# ఇద్దరు 'మధు'ల స్మృతిలో

**– రఘు ఠాకూర్**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁜ ⁜ ⁜

**1**973 వ సంవత్సరములో అనుకుంటా ... మధులిద్దరూ మధ్యప్రదేశ్‌లోని మా ఊరు సాగర్‌లో జరిగిన 'సోషలిస్టు యువజన సభ' కు హాజరైనప్పుడు నాకు వారిద్దరితో పరిచయం కలిగింది. మధు దండావతేగారు ఆ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించగా, మధు లిమాయేగారు ముగింపు ఉపన్యాసం యిచ్చారు.

మేం వి.సి.జైన్ ధర్మశాలలో వారిద్దరూ బస చెయ్యడానికి ఏర్పాట్లు చేసాం. ఆ సందర్భంగా వారిద్దరిలోనూ ఉమ్మడిగా ఉండే లక్షణాలను దగ్గరనుంచీ పరిశీలించే అవకాశం నాకు దక్కింది. వారిద్దరూ ఒకదానికొకటి ఎదురుపడి, ఒకదాన్నొకటి దాటి తిరిగి కలిసి ప్రవహిస్తూ సముద్రాన్ని చేరిన రెండు నదుల వంటివారు. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో కలిసి ఉత్సాహంగా పనిచేసిన వారిద్దరూ తమ తమ స్వభావాల కారణంగా వేర్వేరు రాజకీయ పార్టీలలో చేరి మళ్ళీ తిరిగి ఒకే గూటికి చేరారు. వారిద్దరి స్వభావాలతో ఎన్నో పోలికలున్నప్పటికీ

వ్యక్తీకరణలోను ఆచరణ విధానంలోనూ యిద్దరూ భిన్నంగా ఉండేవారు. అంచేత 1948-55 మధ్యకాలంలో సోషలిస్ట్ పార్టీలో కలిసి పనిచేసిన వారిరువురు ఆ తరువాత కాలంలోనూ చేరి విడిపోయారు. మళ్ళీ 1971లో సోషలిస్టు పార్టీలో చేరటం ద్వారా కలిసినవారు 1979లో తిరిగి జనతాపార్టీ, లోక్‌దళ్‌లలో చేరటం ద్వారా విడిపోయారు. జనతాదళ్ ఏర్పాటు సమయంలో వారిద్దరూ మానసికంగా ఏకమయ్యారు. వారిద్దరి స్వభావాలలో గల ఉమ్మడి లక్షణాలను నేను దిగువన యిస్తున్నాను.

**1. నిరాడంబరత :** ఇద్దరూ ఎంతో నిరాడంబరులు. ఒక సాధారణ కార్యకర్త కూడా ఏ రకమైన సంకోచం లేకుండా వారిని కలిసి అతి సాధారణ విషయాలను చర్చించగలిగేవాడు. గొప్ప నాయకులకుండే హంగు, ఆర్భాటం, భేషజం, వారివద్ద మచ్చుకైనా కనిపించేది కాదు. అదే విధంగా మేధావులు కూడా వారి వద్దకు వెళ్ళి లోతైన చర్చలు చెయ్యగలిగేవారు. సాధారణ కార్యకర్తలకు వారు తమ వంటి కార్యకర్తలుగా కనిపిస్తే మేధావులు వారిలోని పాండిత్యాన్ని గుర్తించగలిగేవారు. మధు దండావతేగారు శిక్షణ శిబిరాన్ని సందర్శించినపుడు తన దుస్తులు తనే ఉతుక్కునేవారు. అతను తనతో కేవలం ఒక చిన్న సంచి మాత్రమే తెచ్చుకునేవారు. ఇక మధులిమాయేగారి విషయానికి వస్తే అతని సంసారమంతా ఒక చిన్న పెట్టెలో పట్టేదే.

**2. స్థిరమైన విశ్వాసాలు :** తమ విశ్వాసాల పట్ల స్థిరత్వంలో వారికి వారే సాటి. వారెన్నడూ సోషలిస్టు జీవన విధానాన్ని వీడలేదు. జవహర్‌లాల్ నెహ్రూగారి నాయకత్వంలోని బలమైన కాంగ్రెస్‌పార్టీగానీ, లేదా 1971లో శ్రీమతి ఇందిరాగాంధీ నేతృత్వంలోని అత్యంత శక్తివంతమైన కాంగ్రెస్ పవనాలుగానీ వారిని వారి విశ్వాసాలకు దూరం చెయ్యలేకపోయాయి. నెహ్రూ, ఇందిరాగాంధీ లిరువురూ ఈ విషయాన్ని స్వయంగా గుర్తించారు. 1971 ఎన్నికల్లో భారీఎత్తున విజయం సాధించిన శ్రీమతి ఇందిరాగాంధీని మీరెలాగూ సోషలిస్టు విధానాలు అనుసరించాలను కుంటున్నప్పుడు మధులిమాయెగారిని మంత్రివర్గంలోకి ఎందుకు తీసుకొనగూడదు? అని ఎవరో ప్రశ్నించగా, అతన్ని ఏ శక్తీ ఆకర్షించలేదనీ ఆమె జవాబిచ్చారు.

**3. ఆదర్శవంతమైన సోషలిస్టు విధానం :** మధులిద్దరూ ఆదర్శమైన జీవితాలను గడిపారు. వారి సామాజిక జీవనానికీ, వ్యక్తిగత జీవితాలకూ పెద్ద భేదమేమీ లేదు. వారిద్దరూ కబీరు వంటి జీవితాన్ని గడిపారు. తనకిచ్చిన వస్త్రాలను మలినం చెయ్యలేదని దేవునికి చెప్పిన కబీరు మాదిరే వారి జీవితాలు కూడా గడిచాయి. పుట్టుకతో పవిత్రులైన వారిరువురూ చివరివరకూ పవిత్రులుగానే ఉన్నారు.

**4. అధ్యయనం పట్ల ఆసక్తి :** ఇరువురూ అధ్యయనానికి సరిపడా సమయం కేటాయించేవారు. ఎంతగా వ్యవహారాల్లో తలమునకలుగా ఉన్నా, తాజా పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండేవారు. అలవాటు ప్రకారం వారు రోజూ కొంత సమయాన్ని చదువుకు, రాతకూ కేటాయించేవారు. దండావతే గారు వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు కాగా లిమాయెగారు శిక్షణ పొందని ఉపాధ్యాయుడు. లిమాయెగారిని నడిచే గ్రంథాలయము అని చెప్పొచ్చు. అతన్నించి ఎవరైనా, ఎప్పుడైనా ఏ రకమైన సమాచారం కావల్సినా పొందగలిగేవారు (తారీఖులతో సహా).

దండావతేగారు సున్నితమైన హాస్యంతో జవాబిచ్చేవారు. అంచేత అతను చెప్పేది తొందరగా మనసులోకి వెళ్ళేది. కాగా లిమాయెగారు సాధారణంగా ఎంత పెద్దవారి గురించైనా, లేదా ఎంత గొప్ప తత్వం గురించైనా శ్రోతలకు అర్థమయ్యేట్టు సూటిగా, సరళంగా చెప్పేవారు. అతను స్వభావరీత్యా మంచి విశ్లేషకుడు. గొప్ప తాత్వికుడు. దండావతే మంచి చతురతతో ఎంతటి చేదు నిజాన్నైనా కాస్త మధురంగా చెప్పగలిగేవాడు. కాగా లిమాయెగారు అది చేదు మందు అని హెచ్చరించి మరీ రోగి చేత యిష్టంగా చేదుమందుని మింగించ గలిగేవారు.

**5. ఋషుల మాదిరి జీవితం :** ఇద్దరూ ఋషుల వలె నిరాడంబరముగా జీవించేవారు. గుండెపోటుకి గురయ్యాక, లిమాయెగారిని ఎయిర్ కండిషనర్ ఏర్పాటు చేసుకొమ్మని అతని సన్నిహితులు బలవంతపెట్టినా, అతను అంగీకరించలేదు. అతను చివరి వరకూ తనకంటూ కారు లేకుండానే బ్రతికారు. అతను ఆటోరిక్షా మీదనో, లేదా మోటార్‌సైకిల్ మీదనో ప్రయాణం చేసేవారు. అతనికి తన లక్ష్యమే ముఖ్యం కానీ సౌకర్యాల కోసం ఎన్నడూ వెంపర్లాడలేదు. దండావతేగారి ఆలోచన, జీవనశైలి

కూడా యిదే విధంగా ఉండేవి. అతను కూడా స్కూటర్ లేదా ఏదో ఒక వాహనాన్ని ఉపయోగించేవారు.

కొన్ని విషయాలు, సిద్ధాంతాలకు సంబంధించి మధులిమాయె హఠయోగిలా బాగా మొండిగా ఉండేవారు. లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం పొందిన నాయకుడికి రాజ్యసభకు వెళ్ళే హక్కు లేదని అతను బలంగా విశ్వసించేవారు. ఈ పద్ధతిని దొడ్డిదారిన ప్రవేశించడం అని లోహియాగారు విమర్శించేవారు. 1980లో లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన మధులిమాయే గారికి రాజ్యసభకు వెళ్ళమని చాలామంది నాయకులు సూచించారు. చౌదరి చరణ్‌సింగ్‌గారు స్వయంగా నచ్చజెప్ప చూసారు. కానీ లిమాయె ఒప్పుకోలేదు. 1991లో సార్వత్రిక ఎన్నికల్లో పరాజయం పొందేక దండావతేగారిని కూడా రాజ్యసభకు వెళ్ళమని చాలామంది అభ్యర్థించేరు. కానీ అతనికి ఎన్నడూ అటువంటి కోరిక లేదు. సోషలిస్టు సిద్ధాంతాలు ఉపదేశించడం సులువు. కానీ ఆచరించడం చాలా కఠినమైన వ్యవహారం. కానీ మధులిద్దరూ సోషలిస్టు సిద్ధాంతానికి కట్టుబడి తమ జీవితాలను సాగించారు. బీద, గొప్ప, పెద్ద, చిన్న తారతమ్యం లేకుండా అందరినీ సమదృష్టితో చూశారు.

**7. స్త్రీ, పురుష సమానత్వం :** వారు కేవలం ఈ సిద్ధాంతాన్ని నమ్మడమే కాదు, ఆచరించి చూపించారు. ఈ జంటలు రెండూ దేశ రాజకీయాల్లోనూ, సామాజిక జీవనంలోనూ ఆదర్శమైన జంటలుగా నిలిచాయి. వారు పూర్తిగా ఒకరికొకరు అంకితమై జీవించారు. బూజుపట్టిన ఫ్యూడల్ ఆలోచనలు వారిలో మచ్చుకైనా కనిపించేవి కావు. వారు కేవలం భార్యాభర్తలే కాదు, మంచి స్నేహితులు. చేతిలో చెయ్యి వేసి నడిచిన కామ్రేడ్స్. ప్రమీలగారు తన భర్తకి రాజకీయాల్లోనూ, ఎన్నికల్లోనూ కూడా సహధర్మచారిణిగా ఉండేవారు. కాగా చంపగారు తన భర్తతో రాజకీయ జీవితాన్ని పంచుకున్నారు. కానీ, ఎన్నికల సమయంలో కేవలం వలంటీర్‌గా మాత్రమే పని చేసేవారు. మధుగారు చంపగారికి వంటింట్లో సాయం చేస్తే, ఆమె అతనికి రాజకీయాల్లో సాయపడేవారు. తమ తమ భార్యల స్వతంత్ర వ్యక్తిత్వాల పట్ల మధులిద్దరికీ చాలా గౌరవం ఉండేది. దండావతేగారు ప్రమీలగారిని తన అనుచరురాలిగా కాక ఒక స్వతంత్ర వ్యక్తిగా గుర్తించేవారు. లిమాయె, చంపగార్ల

వ్యవహారం కూడా ఇలానే ఉండేది. వారు నైతిక విలువలతో కూడిన జీవితాలను గడిపేవారు. తమ సిద్ధాంతాలను ఆచరించి చూపించేవారు. మధులిద్దరూ ఎన్నడూ పిడివాదనలు చేసేవారు కాదు. వారిని చూసినవారు వారి ప్రవర్తన, జీవన విధానాన్ని చూసి అబ్బుర పడేవారు.

**8. సంపద గూర్చిన ఆలోచనే లేదు :** సంపద పోగు చేసుకోవడానికి వారికి ఎన్నో అవకాశాలు వచ్చినా, వారు ఎన్నడూ ఆ దిశగా కన్నెత్తి కూడా చూడలేదు. సమాజం నుంచి నీకు అవసరం అయినంత తీసుకోవడం, నీకు చేతనైనంత సమాజానికి తిరిగివ్వడం అనే సోషలిస్టు సిద్ధాంతానికి వారు కట్టుబడి ఉండేవారు. దండావతేగారు కాస్త మర్యాదగా ఉండే తిరుగుబాటుదారుడు. అయితే లిమాయెగారు కాస్త కోపిష్టి, తిరుగుబాటుదారుడు. వారి కార్యాచరణలోని ఈ తేడాకు కారణం బహుశా వారు పనిచేసిన ప్రదేశాలు, అక్కడి అవసరాలు, వారి భిన్నమైన రాజకీయ కార్యాచరణలు అయి ఉండొచ్చు.

లిమాయెగారు బీహార్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తే, దండావతేగారు మహారాష్ట్ర నుంచి లోక్‌సభకు ప్రతినిధిగా ఉన్నారు. బీహార్ నుంచి అప్పుడప్పుడే పైకి వస్తున్న వెనుకబడిన వర్గాల ఆలోచనా ధోరణిని అర్థం చేసుకోవడం అవసరం. కాగా మహారాష్ట్రలోని స్థిరమైన రాజకీయ వాతావరణం అక్కడి మధ్యతరగతి ఆలోచనా ధోరణిని ప్రతిబింబించేది. అంచేత దండావతేగారు చివరివరకూ ఒకేపార్టీలో కొనసాగాల్సి వచ్చింది. అదే కట్టడంలో ఉంటూ, దాన్ని పడిపోనివ్వకుండా మరమ్మత్తులు చేస్తూ ఉండాల్సి వచ్చింది. కాగా లిమాయెగారు తన రాజకీయ లక్ష్య సాధన కోసం రకరకాల ప్రయోగాలు చేయాల్సి వచ్చింది. తను ఉన్న వ్యవస్థ తన లక్ష్య సాధనకు సరిపోదని అతనికి తోచినప్పుడల్లా అతను దాన్ని పునర్నిర్మించే ప్రయత్నం చేశారు. పాడుబడ్డ యింట్లో కూడా దండావతేగారు విప్లవకారుడిగా జీవించగలిగితే తన విప్లవం కలలను సాకారం చేసుకునేందుకు లిమాయెగారు కొత్త కట్టడాలను నిర్మించారు. ఇవి ఒకే ఆలోచన విధానానికి భిన్న వ్యక్తీకరణలు. దండావతేగారు ఒకే రాజకీయపార్టీని నమ్మడం, లిమాయెగారు ఒకే ఆలోచనా విధానానికి కట్టుబడి ఉండడం అనేవి ఒకే నాణానికి బొమ్మా, బొరుసూ వంటివి.

దండావతేగారు తన కోపాన్నీ, ఆవేశాన్నీ అదుపులో ఉంచుకోగలిగేవారు. లిమాయెగారు వెలిగ్రక్కేవారు. ఇద్దరిలోనూ ఆ కోపం మాటున అపారమైన దయ, కరుణ దాగి వుండేవి. లిమాయెగారు ఒక కార్యకర్తను కఠినంగా మందలించి వెంటనే అతనికి తను స్వయంగా కాఫీ చేసి యిచ్చేవారు. మనసులో ఎంత కోపంగా ఉన్నా, దండావతేగారు ఒక వ్యక్తి బాగోగులు కనుక్కోవడం మరిచేవారు కాదు. అతను కోపాన్ని దిగమింగి దయ, సానుభూతి చూపిస్తే లిమాయెగారు కోప్పడి తరువాత దయ, సానుభూతి చూపేవారు.

**9. పార్లమెంటరీ వ్యవహారాలు :** ఇద్దరూ గొప్ప పార్లమెంటేరియన్స్. లిమాయెగారు పార్లమెంటరీ నియమ, నిబంధనలలో దిట్ట. అతను తన ఈ జ్ఞానాన్ని తన లక్ష్య సాధనకు ఉపయోగించేవారు. ఏదైనా విషయాన్ని పార్లమెంటులో మళ్ళీ, మళ్ళీ లేవనెత్తి ప్రభుత్వం మెడలు వంచి ఆ పని ఎలా చేయించాలో అతనికి బాగా తెలుసు. ఈ రోజుల్లో పార్లమెంటు నుంచి వాకౌట్ చెయ్యడం ఎంత సాధారణం అయిపోయిందంటే ప్రజలు దాన్ని చూసి నవ్వుకుంటున్నారు. కానీ కొన్నిసార్లు పార్లమెంట్‌ను బాయ్‌కాట్ చెయ్యడం అనేది లక్ష్యసాధనకు ఎంచుకునే తెలివైన మార్గం. చర్చలోనూ, ఓటింగ్‌లోనూ పాల్గొనడం అనేది సభ్యుల బాధ్యత. కానీ ప్రస్తుత కాలంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు బాయ్‌కాట్ నాటకాలు వెయ్యడంలో పోటీలు పడుతున్నాయి. తద్వారా అధికారపార్టీ తన తీర్మానాలను ఆమోదింప చేసుకోగలిగితే, ప్రతిపక్ష పార్టీ తమ వ్యతిరేకతను తెలియజేసే నెపంతో తను కర్తవ్యాన్ని విస్మరిస్తోంది. ఈ రకమైన కుట్రల వలన నిజంగా తిరస్కరించబడాల్సిన ఎన్నో తీర్మానాల ఆమోదించబడుతున్నాయి. పేటెంట్ సవరణ చట్టం అలాగే ఆమోదించబడింది.

పార్లమెంట్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన గళాన్ని బలంగా వినిపించాలని లిమాయె భావించేవారు. అతను సస్పెండ్ అవటానికైనా సిద్ధపడేవారు కానీ బాయ్‌కాట్ చేసి పోరాటాన్ని మధ్యలో వదిలేసేవారు కాదు. పార్లమెంట్‌లో దండావతేగారి ఉపన్యాసాలు వాస్తవాలతోనూ, వాదనలతోనూ నిండి ఉండేవి. అతను అభ్యంతరం చెప్పటానికి నిలుచున్నప్పుడు కూడా ప్రత్యర్థులు అతని మాటలను నిశ్శబ్దంగా మంత్రముగ్ధుల వలె వినేవారు. లిమాయెగారు మాట్లాడటానికి

నిలబడ్డప్పుడు ఎవరి వంతు వస్తుందో అని అధికార యంత్రాంగం గడగడలాడేది. దండావతేగారు మాట్లాడేటప్పుడు సభ చక్కటి ఉపాధ్యాయుడు పాఠం చెప్తున్న తరగతి గదిలా ఉండేది. లిమాయెగారు పులిలా గర్జిస్తే దండావతేగారు సాధువులా ప్రవర్తించే వారు.

ఇద్దరు మధుల జీవితాలు ఆదర్శమైనవీ, ఉదాహరణలుగా నిలబడేవి. సోషలిస్టు ఉద్యమానికి నవజీవం కావాల్సిన ఈ రోజున వారిద్దరి జీవితాలను సమన్వయంతో తరచి చూసి దండావతెగారి తేనెతో, లిమాయెగారి నిమ్మరసాన్ని కలిపి సోషలిస్టు ఉద్యమానికి సరైన పాళ్ళల్లో ఆ మిశ్రమాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా  ఉంది. అప్పుడే అవసానదశలో ఉన్న సోషలిస్టు ఉద్యమం బాగుపడుతుంది. విడివిడిగా కూడా వారిద్దరూ ఎంత గొప్పవారంటే కొత్తతరం సోషలిస్టులకు వారి జీవితాలు ఎంతో కొంత నేర్పుతూనే ఉంటాయి.

# విలక్షణ ప్రతిభాశాలి మధు

**- మృణాళ్ గోరే**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁘ ⁘ ⁘

మధు గారితో మా పరిచయం 1942 నాటిది. జైలు నుంచి విడుదలైన ఆయనను నా భర్త బండూ (స్వ. కేశవ్ గోరే) తమరు సాహసి అని కీర్తిస్తూ మా ఇంటికి తీసుకొచ్చారు. అప్పుడే ఆయనతో నాకు తొలిసారి పరిచయం. ప్రారంభంలో ఆయన మితభాషి, అంతర్ముఖుడుగా కనిపించినా, తన పరిసరాలను శ్రద్ధగా పరిశీలించే వ్యక్తి అని అర్థం అయ్యింది. నాకు బాగా గుర్తు ఉన్న ఒక సంఘటన గురించి చెప్తాను. బాంద్రాకి చెందిన మా మిత్రుడు బాలకృష్ణ వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న అమర్ గావ్ (ప్రస్తుతం గుజరాత్‌లో ఉంది) లో ఒక వైద్య శిబిరం నిర్వహించాడు. ఆ శిబిరంలో దాదా నాయక్, నారాయణ్ భీమానీ, ప్రవీణ్ మష్రూవాలా, మాధవ్ అంబే, జగదీష్ సెతల్వాడ్, శ్రీమతి అనీస్ రావ్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో 'స్వాతంత్ర్యం యొక్క చరిత్ర' అనే అంశాన్ని మధులిమాయే, 'సమాజవాదం (సోషలిజం) యొక్క చరిత్ర' అనే అంశాన్ని కేశవ్ గోరే ఎంచుకున్నారు. వీరిద్దరూ శిబిర నిర్వాహణ బాధ్యత తీసుకున్నారు.

శిబిరంలో లోతైన చర్చలు జరిగేవి. అదే సమయంలో మేమంతా సముద్ర తీరాన ఆటపాటలలో కూడా కాలం గడిపాం. అయినా కూడా అధ్యయనం, చర్చల సమయం వచ్చేసరికి మేమంతా ఎంతో శ్రద్ధతో వ్యవహరించే వాళ్ళం. స్వాతంత్ర్యోద్యమ చరిత్ర గురించి, సమాజవాదం (సోషలిజం) గురించి ప్రతి కార్యకర్త తప్పనిసరిగా తెలుసుకోవాలనే షరతు ఉండేది. కార్యకర్తలందరికీ దేశం పట్ల, సమాజం పట్ల వారి బాధ్యతలను వాటిని వారు నిర్వర్తించాల్సిన తీరు గురించి ఈ శిబిరాలలో చక్కగా శిక్షణ నిచ్చేవారు. మధులిమాయే, కేశవ్ గోరే ఇద్దరూ ఈ విషయములను మూలాలనుంచి మాకు చక్కగా వివరించేవారు. ఈ శిబిరం జరుగుతున్న సమయంలోనే నాకు బండూకూ మధు గారి ప్రతిభ స్పష్టంగా తెలిసింది. అప్పటి నుంచే అతని ప్రతిభా పాటవాలతో మేం ప్రభావితులమయ్యాం. శిబిరం జరుగుతున్న సమయంలో ఎ. అన్నా, వినాయక్ కులకర్ణి, సదానంద్ బాగాయిత్ కర్‌లు కూడా వస్తూ ఉండేవారు. ఆ తరువాత కేశవ్ గోరెతో నా వివాహం జరిగింది. ఆ తరువాత మేము బొంబాయికి పశ్చిమాన ఉన్న గోరేగావ్‌లో నివసించ సాగాం. కొన్ని నెలల తర్వాత అంతర్జాతీయ సోషలిస్టు సమ్మేళనంలో పాల్గొనడానికి మధు యూరప్ వెళ్ళారు. బహుశా ఆ సంవత్సరమే ఈ సమ్మేళనంలో భాగంగా కేశవ్ గారు బర్మా వెళ్లడం జరిగింది. యూరప్‌లో ఉన్న కారణంగా మధు మా వివాహానికి హాజరు కాలేకపోయారు. అందుకు ఆయన చాలా చింతించారు. నాకు 'టీ' చాలా యిష్టం. అని అతనికి తెలుసు. అంచేత యూరప్ నుంచి మా కోసం 'టీ సెట్' బహుమతిగా తెచ్చారు. ఆ రోజుల్లో మా వంటి సాధారణ కార్యకర్తలకు "టీ సెట్" చాలా గొప్ప విశేషమే మరి! ఆ "టీ సెట్" ని నేను యిప్పటికీ భద్రంగా ఉంచాను.

మధు ఆలోచనలు ఎప్పుడూ దూకుడుగానే ఉండేవి. అతను సాహసి. దేనికి భయపడేవాడు కాదు. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడేవాడు. అతనికి సాధారణ ప్రజానీకం యొక్క సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన ఉండేది. అంచేత ఏ ప్రణాళిక వేసినా, లేదా ఏ అడుగు వేసిన దాని పర్యవసానాలు అయిదారు సంవత్సరాల తరువాత కూడా ఎలా ఉంటాయనేది అతను అంచనా వెయ్యగలిగేవాడు. అంచేత అతని వ్యాఖ్యలు కూడా పదనుగానే ఉండేవి. అతని ఈ నిశితమైన దృష్టిని నేను తెలుసుకోగలిగాను. సామాన్య జనాలను కలుసుకోవడం,

వారి మాటలను శ్రద్ధగా వినడం, వాటిని విశ్లేషించి, సమస్యలకు సమాధానాలు అన్వేషించడం ఇదే అతని కార్యశైలి. ఇది క్లిష్టమైనదే అయినా, సమస్యను మూలల్నినుంచి పరిష్కరించే విధానం యిదే మరి.

నాకు బాగా గుర్తు. మేం గోవా సత్యాగ్రహంలో పాల్గొనడానికి వెళ్ళాలని నిర్ణయించుకున్నప్పుడు మధు గోవా సామాజిక, ఆర్థిక, చారిత్రక విషయాలను మాకు వివరించారు. సిద్ధాంతాలను, సిద్ధాంతాలతోనే మార్చాలని ఆయన భావించేవారు.

అంచేత ఏదైనా ఆందోళన లేదా సత్యాగ్రహంలో పాల్గొంటున్నా కార్యకర్త లందరికీ ఆ నేపథ్యానికి సంబంధించిన విషయ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాల్సి వచ్చేది. ఇటువంటి కార్యశైలి వలన కార్యకర్తలు దారి తప్పిపోరు. సరి కదా లక్ష్యసాధనకు తమను తాము అంకితం చేసుకుంటారు. అతను కార్యకర్తల ఆలోచనా విధానాన్ని ఎంతగా పటిష్టపరిచేవాడంటే వారు తమ ఆలోచనలను ప్రేమించేవారు. ఆ తరం సోషలిస్టులను చూస్తే ఇప్పుడు కూడా మీరు ఆ విషయాన్ని గమనిస్తారు. ఆ సమయంలో గోవాలో హింస ఎంతగా ప్రజ్వరిల్లేదంటే ఎవరైనా సరే సత్యాగ్రహం, ఆందోళన వంటి పదాలు వాడటానికి కూడా భయపడి పోయేవారు. పాలకుల దమన నీతి, హింసకాండ ఆ స్థాయిలో ఉండేవి. ఆ పరిస్థితులను గమనించిన మేం అక్కడికి వెళ్ళటం సరైన పనేనా అని మధు గారిని ప్రశ్నించాం. అప్పుడాయన పూర్తి విశ్వాసంతో ఇలా అన్నారు. “నేనక్కడకు వెళ్ళడానికి నిర్ణయించుకున్నాను” అని మాలో కొంతమంది చింతాక్రాంతులై ఉండడం చూసి, అతను “భయం అణిచివేతకు బలం చేకూరుస్తుంది” అన్నారు. ఈ సత్యాగ్రహం అక్కడి శాసకులకు బహిరంగంగా సందేశం ఇవ్వడమే కాక వారి దమన నీతిని వ్యతిరేకిస్తుందని అతని అభిప్రాయం. మధు గారి ఈ మాటలు మాకు ధైర్యాన్నిచ్చాయి.

మధు గారు గోవా వెళ్ళారు. అక్కడ అతనిపై దౌర్జన్యం చేసారని వార్తలొచ్చాయి. అక్కడ అతన్ని కొట్టారని, ఆ దౌర్జన్యంలో అతను ప్రాణాలు కోల్పోయారని ఇక్కడి దినపత్రిక ‘లోకమాన్య’ లో మొదటి పుటలో వార్త వచ్చింది. అదంతా చదివి మేం చాలా ఆందోళన చెందాం. నేను బొంబాయిలోనే ఉన్నాను.

ఆ సమయంలో మొరార్జీ దేశాయ్ గారు మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. అతని ఏదో సమావేశంలో పాల్గొనడానికి గోరేగావ్‌లోని ఫిల్మిస్తాన్ స్టూడియోకి వచ్చారు. నేను పరుగు పరుగున అతని వద్దకు వెళ్లి ఈ వార్త సంగతి చెప్పగా అతను తేలిగ్గా కొట్టి పారేస్తూ "సత్యాగ్రహం చెయ్యడానికి వెళ్ళాడు కదా! మరింక ఆందోళన దేనికి?" అన్నారు.

నేను ఇంకొంచెం గాభరా పడడం చూసి "అది తప్పుడు వార్త. నేను విషయం కనుక్కున్నాను. దెబ్బలాటలో బాగా గాయలయితే అయ్యాయి. ఆసుపత్రిలో చేర్చారు" అన్నారతను. అది విన్నాక మనసుకి కాస్త ఊరట కలిగింది.

సోషలిస్టు పార్టీ స్థాపించే నాటికి మధు గోవా సత్యాగ్రహం కథానాయకునిగా బాగా ప్రసిద్ధి చెందాడు. అప్పటికి అతను అక్కడే జైలులో ఉన్నారు. బందూ అతనికి క్రమ పద్ధతిలో ఉత్తరాలు వ్రాస్తూ కొత్త పార్టీ రూపు రేఖలు, కార్యక్రమాల గూర్చి తెలియజేస్తూ ఉండేవారు. చంప కూడా అతన్ని కలవడం కోసం గోవా వెళ్తూ, వస్తూ ఉండేది. మధు గారి ఈ సాహసం వలన మా కార్యకర్తలందరి మనోస్థైర్యము పెరిగింది. అతను చేసిన ఈ కార్యాన్ని ఎంత ప్రశంసించినా తక్కువే మరి.

ఆ తరవాత బీహార్‌లోని ముంగేర్ ఎన్నికలలో పోటీ చేస్తున్నప్పుడు నేను అతని సాహసాన్ని మరోసారి ప్రత్యక్షంగా చూశాను. ఇది 1964 నాటి సంగతి. అతను తొలిసారిగా ముంగేర్ నుంచి పోటీ చేసారు. మేమంతా బొంబాయి నుంచి వెళ్ళాం. అప్పట్లో ఎన్నికలలో ఇంత ఖర్చు లేదు, ఇంత హంగామా లేదు. మేం ఒక మార్వాడి ధర్మశాలలో బస చేసాం. అక్కడే భోజనం అది చేసేవాళ్ళం. బీహార్‌కి చెందిన నాయకుడు కపిల్ దేవ్ సింహ్ మా అందరికీ ప్రచారానికి దిశా నిర్దేశం చేసేవాడు. మధు గారికి బీహార్‌లో మొదట్నుంచి జనాదరణ బాగా ఉండేది. కానీ ఎన్నికలలో దిగిన వారానికి, కార్యకర్తలు లేని వెలితి కొట్టొచ్చినట్టు కనిపించింది. అప్పుడు నేను గోరేగావ్‌లో ఉన్న మా కార్యకర్తలకు తంతి పంపించాను. మా వద్ద మంచి కార్యకర్తల జట్టు ఉండేది. వాళ్లంతా చందాలు వేసుకుని ఎలాగో ఒకలాగా తంటాలు పడి బీహార్ చేరుకున్నారు.

వాళ్ళ రాకతో మా ప్రచారానికి కొత్త ఊపు వచ్చింది. ఆ ఎన్నికల్లో మధు గారు భారీ మెజారిటీతో గెలుపొందారు. లోక్‌సభలో అడుగుపెడుతూనే బీహార్‌కు, బీహార్‌లోని పేదరికానికి సంబంధించిన ప్రశ్నలను సంధించారు. ఆ ప్రశ్నల గూర్చి దేశమంతటా చర్చ జరిగింది. ఆ రోజుల్లో టీవీలు లేవు గానీ లోక్‌సభలో మధుగారు ఏం మాట్లాడారో, ఏం చర్చలు జరిగాయి అనే విషయాలను రేడియోలో వినడానికి ప్రజలు చాలా ఆసక్తికరంగా ఉండేవారు. లోక్‌సభలో ప్రశ్నలను లేవనెత్తడం, వాటితో పాలకుల నోరు మూయించడం అనే మధు గారి విలక్షణ శైలి దేశ రాజకీయాలలో చాలా తొందరగా ప్రసిద్ధి చెందింది. అతి తక్కువ కాలంలో మధుగారు ఒక గొప్ప పార్లమెంటీరియన్‌గా పేరు పొందారు. దేశ ప్రజలంతా అతని గూర్చి తెలుసుకోవడానికి, అతని ఉపన్యాసాలు వినడానికి ఉత్సుకత చూపసాగారు.

మా పెళ్లైన కొత్తలోనే కేశవ్ గారు "అంతర్రాష్ట్ర సమాజ్ వాద్" (అంతర్జాతీయ సోషలిజం) అనే పుస్తకాన్ని వ్రాసారు. ఈ పుస్తకానికి బహుమతి కూడా లభించింది. మహారాష్ట్రకు చెందిన నలుగురైదుగురు కార్యకర్తలు ఈ పుస్తకం వ్రాయడం, చదవడంలో తోడ్పడ్డారు. రాజకీయాలలో విలువలు క్షీణిస్తే కార్యకర్తలు భ్రమపడే ప్రమాదం ఉందని వారు భావించేవారు. ఈ రోజులలోని పతనమైన రాజకీయ పరిస్థితి చూస్తే అది ముమ్మాటికి నిజం అని నాకు అనిపిస్తోంది. నాయకుల, కార్యకర్తల విచార శూన్యత రాజకీయాలను భ్రష్టమార్గం పట్టించింది.

కేశవ్ గారి ఆకస్మిక మరణం మధు, ఇంకో నలుగురైదుగురు బృంద సభ్యులకు శరఘాతంలా తగిలింది. ఆ రోజుల్లో ఒక ద్వైమాసిక పత్రిక (రెండు నెలలకొకసారి వచ్చే పత్రిక) ప్రచురింపబడేది.

'రచన' అనే పేరుతో ప్రచురించబడే ఆ పత్రిక చైతన్యశీల ఆలోచనా స్రవంతిలో జనామోదాన్ని పొందింది. మా స్నేహితులందరం ఆ పత్రికను ఎంతో ఇష్టంగా చదివేవాళ్ళం. మహారాష్ట్రలోని ఆలోచనా పరుల వద్దకి ఈ పత్రిక చేరడానికి కేశవ్ గొరె, మధులిమాయ్, అణసానె, వినాయక కులకర్ణి, సదానంద్ భాగాయిత్కర్ లు బాగా కృషి చేశారు. ఈ పత్రికను చదివిన పాఠకులు చాలామంది మహారాష్ట్ర సోషలిస్టు ఉద్యమంలో పాల్గొనడానికి ముందుకు వచ్చారు. ఆ రోజుల్లోనే యూరప్‌కి

వెళ్ళిన మధుగారు అక్కడి ప్రభుత్వాలు అనుసరిస్తున్న చక్కని పథకాల సూచిని చూసి వచ్చారు. ఆ సూచీ ఆధారంగా కార్యకర్తల కోసం హెల్త్ క్యాంప్ మొదలైనవి నిర్వహించడం ప్రారంభించాం.

సభలో తమ సంఖ్యాబలం తక్కువగా ఉన్నప్పుడు సభా నియమాలను అనుసరిస్తూనే వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలను ఎలా అడగవచ్చు అనే విషయాన్ని మధుగారు తన అనుచరులందరికీ నేర్పించారు. మనమంతా పేద ప్రజల ప్రతినిధులం కనుక వారి తరఫున వీలున్నన్ని ప్రశ్నలు అడగాల్సిన బాధ్యత మనపై ఉందని అతను ఎల్లప్పుడూ చెప్పేవారు. పేదల గొంతులను విన్పించాలని, వారి బాధలను తీర్చాలని ఆయన చెప్పేవారు. సభ్యులందరికీ సభలో మాట్లాడటానికి మధుగారు తర్ఫీదు నిచ్చేవారు. సభలో మాట్లాడటానికి మధుగారు నిల్చునేసరికి సూదిపడ్డా విన్పించేంత నిశ్శబ్దం సభలో అలుముకునేది. అతను ఆధారాలతో, అంకెలతో సహా ఎంత పటిష్టంగా తన వాదనను వినిపించేవారంటే పాలకులు నిరుత్తరులయ్యేవారు. సభా నియమాలన్నీ అతనికి బాగా ఎరుకే. సభలో అతను ఎల్లప్పుడూ తన అంతరాత్మ ప్రబోధం మేరకే నడుచుకునేవారు.

## హక్కు దొరకలేదు

**– కిషన్ పట్నాయక్**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁂

మధులిమాయే గారంటే నాకు మొదటి నుంచీ గౌరవం, ఈర్ష్య, ఒక రకమైన అసంతృప్తి ఉండేవి. మధుగారంటే ఈర్ష్య ఎందుకో చెప్తాను. వ్యక్తిగానూ, రాజకీయనేతగానూ ఆయన ఎంత ఎత్తున ఉండేవారంటే ఆ ఎత్తుకి నేనెప్పటికీ ఎదగలేక పోయాను. మరి! అతనంతటి విద్వాంసుడిని కాలేకపోయాను. అంతటి కళాప్రేమికుడిని కూడా కాలేకపోయాను. గోవా సత్యాగ్రహ కాలంలో అతను పడ్డ కష్టాలు, ముంగేర్ ఎన్నికల సమయంలో తనపై జరిగిన దాడులను అతను సమర్థంగా ఎదుర్కొన్న తీరు ఇలాంటి అనుభవాలేవీ నాకు లేవు మరి! అంచేత ఎక్కడో నా ధైర్యం అతని కంటె తక్కువ స్థాయిలో ఉన్నట్టే! 1980వ సంవత్సరం తరువాత అతను ఏ దళంలోనూ సభ్యుడిగా లేరు. ఏ పదవిలోనూ లేరు. లోక్‌సభనీ, రాజకీయాలనూ మధు ఎంతగా ప్రభావితం చేసారంటే ఆ స్థానానికి నేనెన్నటికీ ఎదగలేను.

అతని పట్ల ఈర్ష్యగా ఉందని చెప్పడానికి నాకే మాత్రం సంకోచం లేదు. ఎందుకంటే ఆ ఈర్ష్యలో ద్వేషం ఏ మాత్రం లేదు. బహుశా నేను అమితంగా ప్రేమించే వారిపట్ల ఈర్ష్య చూపడం నా స్వభావం అనుకుంటాను. నా ఈర్ష్యకు కారణం అదే. 1968వ సంవత్సరం నుంచే రాజకీయాలలో నేను మధుగారితో వేరుగా ఉంటూ వచ్చాను. అతని వైఖరి పట్ల నాకు చాలా అసమ్మతి ఉండేది. కానీ రెండు సందర్భాలలో తప్ప ఎన్నడూ నేను అతన్ని గట్టిగా విమర్శించలేదు. అయ్యో, మధుగారు ఇలా ఎందుకు చెయ్యరు? అని మాత్రమే అనుకునేవాడిని.

ఆ రెండు సందర్భాలలో ఒకటి శ్రీ వి.వి. గిరిగారిని రాష్ట్రపతి అభ్యర్థిగా నిలిపే సందర్భం. గిరిగారు ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ నిలిపిన అభ్యర్థి. ఆ రోజుల్లో రాజ్ నారాయణ్‌గారు, మధులిమాయేగారు ఒకే దళంలో ఉండేవారు. గిరిగారి అభ్యర్థిత్వాన్ని సమర్థించాలని వారిద్దరూ కలిసి నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయాన్ని రాతపూర్వకంగా ప్రకటించారు. మా ఉద్దేశ్యంలో ఇది మా దళం యొక్క కాంగ్రెస్ వ్యతిరేక భావాలకు భిన్నంగా ఉన్న నిర్ణయం. దళ విధానాలు కాంగ్రెస్‌కి వ్యతిరేకమైనవని ప్రకటించిన మేం ఈ రకంగా కాంగ్రెస్ అనుకూల వైఖరి అవలంబించడం మాకేమాత్రం నచ్చలేదు. రెండవ సందర్భం సుమారు 1980వ సంవత్సర కాలంలోనిది. మధుగారు సోవియట్ దేశపు విధానాల ఉచ్చులో చిక్కుకుంటున్నారేమోనని మాకు తోచింది. చాలాసార్లు మిత్రుల వద్ద, పరిచయస్థుల వద్ద నేనీ విషయాన్ని ప్రస్తావించడం జరిగింది. నా మాటలు అతన్ని చేరాయో, లేదో నాకైతే తెలియదుగానీ యితరులు కూడా ఈ రకమైన ఆలోచన చేసే ఉంటారు. తరవాత తొందరలోనే మధుగారు సర్దుకున్నారు.

వయసులో మధుగారు నాకంటే కొంచెం పెద్ద. కానీ నా కంటె చాలాకాలం ముందు నుంచీ సోషలిస్టు ఉద్యమంలో ఉన్నారు. నేను సోషలిస్టు పార్టీ ఒక రాష్ట్రశాఖ కార్యదర్శిగా ఉన్నప్పుడు అతను జాతీయస్థాయి సంయుక్త కార్యదర్శిగా ఉన్నారు. అప్పటికే ఒక పుస్తకం రాసి ఉన్నారు. కమ్యూనిస్ట్ ఉద్యమాన్ని నేను ఒక విద్యార్థిలా ప్రారంభం నుంచీ తెలుసుకోవాలనుకున్నాను. ఒడిశాలోని నా మార్గదర్శకులు మధులిమాయేగారు రచించిన "కమ్యూనిస్ట్ పార్టీ; వాస్తవాలు, అబద్ధాలు" అనే ఆంగ్ల గ్రంథాన్ని చదవమని సలహా ఇచ్చారు. కానీ ఆ పుస్తకం చదివి నేను చాలా అసంతృప్తికి గురయ్యాను. నేను కమ్యూనిస్ట్ ఉద్యమం బలాలు,

బలహీనతలు రెండూ తెలుసుకోవాలనుకున్నాను. కమ్యూనిస్ట్ ఉద్యమం ఎందుకు ప్రపంచమంతటా విస్తరించి ఉంది. సోషలిస్ట్ ఉద్యమంతో పోలిస్తే వారి విధానాలు ఎక్కువ విప్లవాత్మకంగా ఎందుకుంటాయి? అనే ప్రశ్నలకు నాకు జవాబులు దొరకనే లేదు. కేవలం కమ్యూనిస్టుల జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలకు సంబంధించిన వాస్తవాలు మాత్రమే తెలిసాయి. కానీ దీనంతటికీ బాధ్యత అప్పటి పార్టీ ప్రధాన కార్యదర్శి అశోక్ మెహతాగారిదే అని నా ఉద్దేశ్యం. అశోక్ మెహతాగారి ప్రభావంతోనే ఈ పుస్తకం రాయబడిందని నా అభిప్రాయం. అశోక్ మెహతాగారు రచించిన 'ప్రజాస్వామ్య సోషలిజం' అనే పుస్తకం నాకు బాగా నచ్చింది. అందులో కమ్యూనిస్ట్ వ్యతిరేకత లేదు. కానీ రాజకీయపరంగా అతను కమ్యూనిస్ట్ సిద్ధాంత వ్యతిరేకి. కమ్యూనిస్ట్ వ్యతిరేక భావజాలం అంటే కమ్యూనిజానికి వ్యతిరేకులైన పెట్టుబడిదారులు రెచ్చగొట్టగా ప్రపంచమంతటా వ్యాపించిన ఒక ఆలోచనా స్రవంతి. భారతీయ సోషలిస్టులలో ఎక్కువశాతం మంది ఈ ఆలోచనా స్రవంతి బాధితులే.

అశోక్ మెహతాగారు 'డెమొక్రటిక్ రీసెర్చ్ సర్వీస్' అనే ప్రచురణ సంస్థను ప్రారంభించినప్పుడు అతని ఉద్దేశ్యాలు మరింతగా స్పష్టమయ్యేయి. కమ్యూనిస్ట్ వ్యతిరేక సాహిత్యాన్నీ, భావజాలాన్నీ ప్రచురించి, ప్రచారం చెయ్యటమే ఈ సంస్థ ముఖ్య ఉద్దేశ్యంగా ఉండేది. మధులిమాయే గారి పుస్తకం ఈ సంస్థ ద్వారా ప్రచురింపబడలేదు. ఈ సంస్థతో మధులిమాయే గారికి సంబంధం కూడా లేదు. అశోక్ మెహతాగారి నుంచి మధులిమాయేగారు వేరు పడ్డారని స్పష్టమయింది. తదుపరి కొంతకాలంలోనే అశోక్ మెహతాగారి రాజకీయవాదానికి వ్యతిరేకంగా మధుగారు నిలబడ్డారు. అప్పట్నుంచీ మధుగారంటే మా మనస్సుల్లో ఒక ప్రేమభావం ఏర్పడింది. 1967వ సంవత్సరం తర్వాత అతనితో మాకెన్ని విభేదాలు ఏర్పడినా మా మనసులో అతని పట్ల ఈ ప్రేమ తొలగిపోలేదు. రాజకీయాలకు సంబంధించిన మకిలి ఏదీ అతని జీవితాన్ని అంటకపోవడమే దానికి కారణం కావచ్చు.

లోక్‌సభ సభ్యుడిగా అతని స్థానం ఎంతో ఉన్నతమైనది. మంత్రుల అవినీతి మీద అతని దాడి ఎంత పదునుగా ఉండేదంటే గొప్ప గొప్ప నాయకులు కూడా అతనంటే భయపడేవారు. 1964-67 మధ్యకాలంలో లోక్‌సభలో అతని ఎదుగుదలకు నేను ప్రత్యక్షసాక్షిని. పార్లమెంట్ వ్యవహారాలు, రాజ్యాంగం పట్ల

అతని జ్ఞానం అద్వితీయం. స్వాతంత్ర పోరాట కాలంనాటి నాయకులు, ఆనాటి రాజకీయాలకు సంబంధించి అతను వ్రాసిన పుస్తకాలు చాలా శ్రేష్ఠమైనవి. అతని తక్కిన పుస్తకాల నుంచి వీటిని వేరుచేసి మూల్యాంకనం చేయాల్సిన అవసరం ఉంది.

1967లో లోహియాగారి మరణం తరవాత మావంటి సోషలిస్టులకు ఏది అవసరమో అది మధుగారు యివ్వలేకపోయారు. అంచేత మేం అతన్నించి మెల్లమెల్లగా దూరం జరుగుతూ వచ్చాం. ఇక్కడ చిత్రమేమిటంటే మధుగారి ప్రతిష్ఠ పెరుగుతున్న కొద్దీ మేం అతనికి దూరమైపోయాం. సోషలిస్టు ఉద్యమాన్ని ముందుండి నడిపే ప్రతిష్ఠాత్మక నాయకుడు మాకు అవసరం అయ్యాడు. రాజ్‌నారాయణ్, ఎస్.ఎమ్. జోషీ, మధులిమాయే – ఈ ముగ్గురు గొప్ప నాయకులు మాతో ఉండేవారు. వాళ్ళ సాధకబాధకాలేమిటి? పని ఎంత కఠినమైనది, మా బలహీనతలేమిటి వంటి ప్రశ్నలను విశ్లేషించడం యిప్పుడు అనవసరము. తరువాతి కాలంలో మధుగారి ఆరోగ్యం కూడా దెబ్బతింది. అయినా కూడా ఇంటి నుంచే అతను ఎంత పని చేసేవారంటే, కేవలం తన లేఖలు, ఉపన్యాసాల ద్వారానూ, ప్రజల ఎదుటకి రావడం ద్వారానే అతను సోషలిస్టు ఉద్యమాన్ని నడపగలరని అనిపించేది. సోషలిస్టు ఉద్యమ వర్తమాన స్థితి-భవిష్యత్ గురించి అతను ఏమీ రాయకపోవడం తీరని లోటే అని చెప్పాలి.

1990ల తర్వాత ఈ విషయం మరింతగా గుచ్చుకుని బాధపెట్టసాగింది. 1990ల తరవాత సామ్రాజ్యవాదం దాడి మరింతగా పెరిగింది. భారతదేశం ఆర్థికంగా ఎంతగా బానిసగా ఉందో స్పష్టం కాసాగింది. దేశభక్తి, సోషలిస్టు ఆదర్శాలు రెండూ ఉన్నవాళ్ళు మాత్రమే ఈ పరిస్థితిని ఎదుర్కోగలరు. మధులిమాయేగారు దేశభక్తులు. సోషలిస్టు దేశభక్తిలోనూ, సోషలిస్టు ఆలోచనా ధోరణిలోనూ అతనికి తిరుగే లేదు. అతనికి అఖండ భారతావని పట్ల ఎంతటి ప్రేమ అంటే అతని దేశభక్తి రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి కావాలని అడిగే నాయకులకు మింగుడు పడేదికాదు. ఈ స్వయం ప్రతిపత్తి వ్యవహారం అతనికి అంతగా రుచించేదికాదు. కానీ ఈ ఆర్థికస్వేచ్ఛ లేకపోవడం అనే విషయంపై అతనికి చివరివరకూ ఒక స్పష్టమైన వైఖరి లేకపోవడం కాస్త విచిత్రమే మరి. దీనికి కారణం మేం యిలా భావించేవాళ్ళం. మధుగారు వాస్తవిక దృక్పథం కలవ్యక్తి, కార్యవాది. దేశంలో ఆర్థిక బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికి తగ్గ చిన్నపాటి

శక్తి కూడా లేనప్పుడు ఆ విషయాన్ని రేకెత్తించడం ఎందుకు అని అతను భావించి ఉండొచ్చు.

కానీ ఈ జవాబు అంత సంతృప్తినిచ్చేది కాదు. కొంతమంది ఎంతో కొంత పోరాటం చేస్తూ వచ్చారు. వారికి మధుగారి వంటి బలమైన నాయకుల సాయం అవసరం. మా గుంపుకి మధుగారితో పెద్దగా సంబంధ బాంధవ్యాలు ఉండేవి కావు. కానీ జార్జ్ ఫెర్నాండెజ్‌గారు అతనికి బాగా దగ్గర వ్యక్తి. అంతేకాదు, లోక్‌సభలో నూతన ఆర్థిక విధానాలకు సంబంధించి బాగా పట్టు ఉన్న వ్యక్తి. కానీ మధుగారు తన ఉత్తరాల ద్వారా ఫెర్నాండెజ్‌ను కూడా నిరుత్సాహ పరిచేసారు. నూతన ఆర్థిక విధానాలు సురక్షితమైనవి. దేశభవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది అనా? ఇదంతా ఏమిటి? తటస్థ విధానం అవలంబించడమా? లేక ఆ దిశగా ఆలోచన చెయ్యకపోవడమా?

ఇంత పెద్ద సమస్య గురించి మధుగారు ఎక్కువ కాలం అస్పష్ట వైఖరితో వుండజాలరు అని మేం భావించేవాళ్ళం. అతను మా తరపున మాట్లాడి తీరాల్సిందేనని అనుకునేవాళ్ళం. అతను మరణించడానికి కొన్ని నెలల ముందు 'సర్వోదయ ప్రెస్ సర్వీస్' వాళ్ళు ఒక వ్యాసం ప్రచురించారు. సంపన్న దేశాల ద్వంద్వనీతి గురించి అందులో చర్చించడం జరిగింది. ఈ వ్యాసం చదివి మళ్ళీ నా ఆశలు చిగురించాయి. నా ఆశలు ఏ స్థాయికి వెళ్ళాయంటే తరువాత అతని ఒక వ్యాసం చదివి నేను దాన్ని అపార్థం చేసుకున్నాను. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కమ్యూనిస్ట్ ప్రభుత్వం తాలూకు పారిశ్రామిక విధానం గురించి మధులిమాయేగారి వ్యాసం ఒకటి 'మెయిన్‌స్ట్రీమ్' పత్రికలో ప్రచురించారు. అందులో మార్క్సవాద నాయకత్వం గురించిన విమర్శ ఉంది. అది చదివి నేను మధుగారు పారిశ్రామిక విధానాన్ని వ్యతిరేకిస్తున్నారని అపోహ పడ్డాను. కానీ మధుగారు జ్యోతిబసుగారి పారిశ్రామిక విధానాన్ని సమర్థిస్తూ ఆ వ్యాసం రాసేరని ఆ తరవాత ఒక మిత్రుడు నాకు వివరించాడు. ఆ తరవాత నేను మళ్ళీ ఆ వ్యాసాన్ని చదివి నిరాశ చెందాను. నా ప్రగాఢమైన కోరిక, ఆ వ్యాసం యొక్క వ్యంగ్య ధోరణి నా అపార్థానికి కారణమయ్యాయి. మా తరం నాయకులకు మధుగారి నాయకత్వం మీద ఎంత నమ్మకముండేదో, ఎన్ని ఆశలుండేవో చెప్పటానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

# మధులిమాయే స్మృతిలో

**–రఘు ఠాకూర్**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁜ ⁜ ⁜

మే 1 మధులిమాయే గారి జన్మదినం. ఈ సంవత్సరం అతని జన్మ శతాబ్ది సంవత్సరం కూడా. మధుగారి జీవితాన్ని అయిదు భాగాలుగా చూడొచ్చు.

1. స్వాతంత్ర్య పోరాట ఘట్టం
2. గోవా సత్యాగ్రహ ఘట్టం
3. సోషలిస్టు ఉద్యమ ఘట్టం
4. పార్లమెంట్ వ్యవహారాలు
5. క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్న తరువాత రచనా కార్యక్రమం

స్వర్గీయ మధులిమాయే గారు తన యవ్వనంలోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. మధుగారు తన జీవితంలో సోషలిజాన్ని కేవలం

అధ్యయనం చెయ్యడమే కాదు, బోధించారు కూడా. సర్గీయ సానె గురూజీగారు తను సోషలిజాన్ని మధుగారి వద్దే నేర్చుకున్నానని తన ఆత్మకథలో చెప్పారు.

మధుగారి పట్ల సానె గురూజీగారికి ఎంతటి ప్రేమ, విశ్వాసం ఉన్నాయో దీని ద్వారా మనకు తెలుస్తుంది. స్వాతంత్ర్యానంతరం అతను దారుణమైన నిరాశలో కూరుకుపోయినప్పుడు కూడా అతను తన జీవితంలోని ఆఖరి ఉత్తరం మధుగారికే రాస్తూ, తాము కన్న కలలు సాకారమయ్యేట్టు కనిపించటం లేదని వాపోయారు. స్వాతంత్ర్యోద్యమం తరువాత మధుగారు గోవా సత్యాగ్రహంలో పాల్గొని గోవా పోలీసుల చేతిలో లాఠీదెబ్బలు తిన్నారు. సత్యాగ్రహంలో భాగంగా మధుగారు గోవాలో ప్రవేశించినప్పుడు అతనిపై ఎంత తీవ్రంగా లాఠీచార్జి జరిగిందంటే అతను స్పృహతప్పి పడిపోయారు. అప్పుడు పోలీసులు అతన్ని తీసుకువెళ్ళిన విధానం చూసి, చుట్టూ ఉన్నవారంతా అతను మరణించారనే భావించారు. మధులిమాయే గారు మృతి చెందారని బొంబాయి వార్తాపత్రికలలో వార్తలు రావడంతో బొంబాయిలోని వారి ఇరుగుపొరుగు వాళ్ళు చంప గారికి సానుభూతి తెలపసాగారు. చాలా రోజుల తర్వాత మధుగారు బ్రతికే ఉన్నారనే నిజం తెలిసింది.

మధులిమాయేగారు సోషలిస్టు ఉద్యమంలో అగ్రనేత. ఆచార్య నరేంద్రదేవ్, లోహియా, జె.పి.గారి తర్వాతి తరానికి చెందిన నాయకుడు. అతను ఆ రోజుల్లో బర్మాలో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు సమావేశంలో భారత సోషలిస్టు పార్టీ ప్రతినిధిగా పాల్గొన్నారు. సోషలిస్టు పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం కోసం యింకా బలవంతుల పెత్తనానికి వ్యతిరేకంగా డా॥ లోహియాగారు గళమెత్తినపుడు తత్ఫలితంగా జరిగిన విభజనలో మధుగారు డా॥ లోహియా పక్షం వహించడమే కాక, చివరి వరకూ అతని వెన్నంటి నిలిచారు. డా॥ లోహియాగారికి మధుగారంటే విపరీతమైన నమ్మకం, అదే విధంగా మధుగారికి లోహియాగారి పట్ల ఎంతో భక్తి ఉండేవి.

మధుగారి పార్లమెంటరీ జీవితం సువర్ణాక్షరాలతో విభజించదగ్గది. అతనికి పార్లమెంటరీ వ్యవహారాలకు సంబంధించి ఎంత జ్ఞానం ఉండేదంటే అతను సభలో ఏదైనా ప్రశ్న లేవనెత్తినపుడు అతని వాదనను ఖండించడానికి స్పీకరుకు కూడా సాహసం ఉండేదికాదు. ఒక సందర్భంలో పార్లమెంట్ సమావేశకాలం

అంతా మధులిమాయేగారి పేరనే గడిచింది. ఎందుకంటె ప్రతిరోజు అతను లేవనెత్తిన ప్రశ్నల మీదే చర్చ జరిగేది. 70వ దశకంలో బాగా జనాదరణ పొందిన 'దినమున్' అనే పత్రిక అయితే 'మధు సత్ర్' అని శీర్షిక కూడా పెట్టింది. మధుగారి పార్లమెంటరీ వ్యవహారాల జ్ఞానం యింకా క్రమశిక్షణ వలన వచ్చిన ప్రమాదం ఏమంటే అతను ఏదైనా బ్రీఫ్‌కేసు పట్టుకుని సభలోకి అడుగు పెట్టారంటే అధికారపక్షం మంత్రివర్యులు అంతా అందులో ఏ రహస్యం దాగివుందో ఆ వేళ ఏ మంత్రి తాడు తెగుతుందోనని గడగడలాడేవారు. మధుగారు ఒక ప్రశ్న లేవనెత్తారంటే దాన్ని మళ్ళీ, మళ్ళీ చర్చించేట్టు చేసి చివరకు ఎంతటి శక్తిశాలి ప్రభుత్వమైనా ఆ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకునేట్టుగా చేసేవారు.

1963-64 ప్రాంతాల్లో మధుగారు నాకు పరిచయం అయ్యారు. ఆ సమయంలో నేను నా స్వంత జిల్లాలో పార్టీపదవిలో ఉన్నాను. మధ్యప్రదేశ్‌కి స్వర్గీయ లిమాయేగారు తరచూ రాకపోకలు సాగించేవారు. అక్కడి కార్యకర్తలతో కూడా అతనికి మంచి సంబంధాలు ఉండేవి. అతను కార్యకర్తల భావాలను అర్థం చేసుకుని వారిపట్ల సహానుభూతి కలిగి వుండేవారు. 1973లో అప్పటి ప్రభుత్వం నన్ను పోలీసులకు వ్యతిరేకంగా హర్తాళ్ చేసినందుకుగాను బంధించి భోపాల్ జైలులో ఖైదు చేసింది. అక్కడ నాకు ఎదురుగా వున్న గదిలో ఒక ముస్లిము సోదరుడిని పాకిస్తానీ పౌరుడు అనే నేరంపై ఖైదులో వుంచారు. అతను రాత్రి పూట బ్యారక్ మూసేసాక భోరున ఏడుస్తూ ఉండేవాడు. ఇంచుమించు రోజూ రాత్రిపూట యిదే తంతు నడిచేది.

ఒకరోజు నేను అతన్ని "సోదరా! ఎందుకేడుస్తావు? ఏదైనా శారీరక బాధ ఉందా?" అని అడిగేను. అప్పుడతను తన కథ చెప్పుకొచ్చేడు. 1947లో దేశ విభజన జరిగేనాటికి అతను చిన్న పిల్లాడు. అతని అక్క అత్తవారిల్లు కరాచీలో వుండేది. అక్క అత్తవారింటికి వెళుతుంటే ఆమె వెంట యితను కూడా వెళ్ళేడట. ఆ తరవాత దేశ విభజన జరగడంతో రాకపోకలు నిలిచిపోగా యితను పాకిస్తాన్‌లోనే వుండిపోయాడట. చాలా ఏళ్ళ తరవాత పరిస్థితులు కాస్త చక్కబడ్డాక అతను వీసా తీసుకుని భోపాల్‌లో తన యింటికి తిరిగి వచ్చాడట. ఇక్కడికొచ్చి టాంగా నడప సాగేడట. కాలక్రమంలో పెళ్ళి చేసుకున్నాడు. పిల్లలు పుట్టేరు. ఇక్కడే

నివశించసాగాడు. 1965 భారత్, పాకిస్తాన్ యుద్ధ సమయంలో పాకిస్తాన్ నుంచి భారత్‌కు వచ్చినవారి చట్టబద్ధత పరిశీలించే క్రమంలో వీసా పూర్తి అయి కూడా పాక్ తిరిగి వెళ్ళకుండా యిక్కడే పాకిస్తానీ పౌరుడు అనే ఆరోపణతో అతన్ని ఖైదు చెయ్యడం జరిగింది. అప్పట్నుంచీ అతను జైల్లోనే ఉన్నాడు. అతను చాలా ఏళ్ళనుంచీ జైల్లోనే మగ్గుతున్నాడు. తన పిల్లలను చూసి కూడా చాలా కాలమైందట. నేను జైలు నుంచే అతని వ్యధనంతా ఒక లేఖగా వ్రాసి మధుగారికి పంపించాను.

అసలు ఒక చిన్న జిల్లా స్థాయి పార్టీ పదవిలో ఉన్న వ్యక్తి రాసిన ఉత్తరాన్ని చదివి, ఆ విషయాన్ని లోక్‌సభలో ప్రస్తావించడం మధుగారి పెద్దమనసుకు నిదర్శనం. తత్ఫలితంగా ఆ ముస్లిమ్ సోదరుడు విడుల అవడమే కాకుండా, అదే విధంగా వివిధ జైళ్ళలో మగ్గుతున్న మరొక 50 మంది విడుదలకు నోచుకున్నారట. అంతేకాదు, వారందరికీ భారత పౌరసత్వం కూడా లభించింది. మధుగారితో కలిసి నేను మధ్యప్రదేశ్ అంతటా విస్తృతంగా పర్యటించాను. అప్పట్లో మధ్యప్రదేశ్ అంటే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ కలిసి ఉండేవి. ఆ సంయుక్త మధ్యప్రదేశ్‌లో మేము పర్యటించని జిల్లా లేదంటే అతిశయోక్తి కాదు. ధార్ జిల్లాలోని ముందూలో, హొసంగాబాద్‌లో పచమనీలో, పన్ను యిలా అనేక జిల్లాల్లో కార్యకర్తల శిబిరాలు నిర్వహించి మధుగారిని పిలవడం, వారు అక్కడ కొన్నాళ్ళు బస చెయ్యడం జరిగేది.

1963-64 ప్రాంతం నుంచి అతని జీవితపు ఆఖరి క్షణం వరకు నేను అతనితో ఉన్నాను. అతను లోహియా ఆస్పత్రిలో తనువు చాలించే సమయంలో కూడా నేనతనితో వున్నాను. మధులిమాయేగారు ఒక నీతిమంతుడు. సత్యవాది. అతను నాతో ఒకే ఒక్కసారి అబద్ధం చెప్పారు. అది కూడా లోహియా ఆస్పత్రిలో ఉండగా, రెండు రోజులుగా అతనేమీ తినలేదు. ఏదైనా తినమని నేను అతన్ని బాగా కోప్పడ్డాను. అతనికి శారీరక బాధ చాలా ఎక్కువగా ఉంది. ఆయాస పడుతున్నారు. నా ప్రేమ నిండిన కోపాన్ని గ్రహించి అతనన్నాడు కదా 'ఈ రాత్రికి ఆగు. రోప్పొద్దున నీతో కలిసి తింటాను' అని, తెల్లారి ఏమైనా తినేలోపే అతను తుదిశ్వాస విడిచారు.

బహుశా అతని జీవితంలో అతను చెప్పిన తొలి, తుది అబద్ధం అదే కావచ్చు. లేదా అతనిచ్చిన మాటని విధి పూర్తి చెయ్యనివ్వలేదేమో!

అతని స్మృతులు అనేకం. వేల కొద్దీ సంఘటనలు జ్ఞప్తికి వస్తున్నాయి. అతని జన్మశతాబ్ది సందర్భంగా మనమంతా అతని నీతిశీలతను, ప్రవర్తనను, త్యాగాన్నీ, జ్ఞానాన్నీ, నిజాయితీనీ, పోరాటాన్నీ, ఆదర్శంగా తీసుకుని, అతని అడుగుజాడలలో నడుస్తామని సంకల్పం తీసుకోవాలి.

మధుగారికి, చంపగారికి వినయపూర్వక శ్రద్ధాంజలి!

# ప్రపంచ రాజకీయ జ్ఞాన భాండాగారం మధులిమాయే

**(అమలేశ్ రాజుతో సంభాషణ ఆధారంగా)**

**-శరద్ యాదవ్**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁂ ⁂ ⁂

**భా**రతదేశ మాజీ కేంద్రమంత్రి, దశాబ్దాల పాటు లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడు అయిన శ్రీ శరద్ యాదవ్‌గారి అభిప్రాయం ప్రకారం సోషలిస్టు, మాజీ లోక్‌సభ సభ్యుడు అయిన మధులిమాయేగారు కేవలం భారతీయ రాజకీయాలే కాదు, ప్రపంచ రాజకీయాలనే క్షుణ్ణంగా ఔపోశన పట్టిన అరుదైన వ్యక్తి. మధుగారు అత్యంత సాదాసీదా జీవితాన్ని గడుపుతూ భారత రాజకీయాలను ప్రభావితం చేసిన గొప్పవ్యక్తి అని శరద్‌యాదవ్‌గారు కితాబిచ్చారు. భారతదేశ రాజకీయ వ్యవస్థను అర్థం చేసుకున్న వారిలో మధుగారు అగ్రగణ్యులని చెప్పొచ్చు. భారత స్వాతంత్ర్య పోరాటం నుంచి గోవా సత్యాగ్రహం వరకూ నేతృత్వం వహించిన వారందరిలోనూ మధుగారు ముందువరసలో ఉంటారు. అతను తన పాత్రను సరిగ్గా నిర్వర్తించారని చెప్పొచ్చు. అతను లోక్‌సభ సభ్యుడిగానే కాకుండా సోషలిస్టు ఆలోచనా ధోరణితో సభలోనూ, బయటకూడా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నాడు. భారతదేశంలో ప్రజాస్వామిక సోషలిస్టు ఉద్యమం కోసం తన

జీవితాన్ని అంకితం చేసిన మహానేత. నిరాడంబరతకు మారు పేరైన మధుగారు గాంధీజీ, లోహియాల భావజాలాన్ని ప్రచారంలోకి తెచ్చిన వ్యక్తిగా ఎప్పటికీ గుర్తుండిపోతారు.

ఏడుసార్లు భిన్న రాష్ట్రాల నుంచీ లోక్‌సభకు ఎన్నికై, నాలుగుసార్లు రాజ్యసభ సభ్యునిగా పార్లమెంట్‌లో తన గళం వినిపించిన శరద్‌యాదవ్‌గారు తనకి అన్ని రాజకీయ పక్షాల నాయకులతోను సంబంధాలున్నాయనీ, కానీ తననెవరైనా ప్రభావితం చేసేరు అంటే అది కేవలం మధులిమాయేగారు మాత్రమేనని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని హెూసంగాబాద్ జిల్లా, బాబయిలో జన్మించి జబల్‌పూర్ ఇంజనీరింగ్ కాలేజి నుంచి స్వర్ణపతక గ్రహీత అయిన శరద్‌యాదవ్‌గారి సామాజిక జీవనం బృహత్తరమైనది. లోక్‌సభ, రాజ్యసభల్లో సామాజిక, రాజకీయ విషయాలపై తన గళాన్ని వినిపించిన శరద్‌యాదవ్‌గారు జెపి సత్యాగ్రహం నుంచి మండల్ కమీషన్ ఉద్యమాల వరకు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, యింకా బీహార్ రాష్ట్రాల్లో జరిగిన అనేక ఉద్యమ పోరాటోల్లో పాల్గొన్నారు. మహాత్మాగాంధీ, డా॥ రామ్ మనోహర్ లోహియా, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్, బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా పూలే, చౌదరి చరణ్‌సింగ్ మరియు కర్పూరి ఠాకూర్ వంటి అనేక మంది ప్రముఖుల ఆలోచనా విధానాన్నీ, భావజాలాన్నీ జీర్ణించుకుని ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని వాటిల్లో భాగంగా మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్, రీవా, బిలాస్‌పూర్, నరసింహగడ్, బాలావట్, సిచనీ యింకా ఉత్తరప్రదేశ్‌లోని ఎటాలో 1969-70, 1972, 1975లలో మీసా చట్టం క్రింద ఖైదు చెయ్యబడ్డ శరద్‌యాదవ్‌గారు చెప్పేదేమిటంటే ఎమర్జెన్సీ సమయంలో ఖైదు చెయ్యబడ్డప్పుడు మధుగారి సాన్నిధ్యంలో గడపిన రెండేళ్ళు తనకు అతన్నీ అతని జ్ఞానాన్నీ అర్థం చేసుకోవడానికి బాగా ఉపయోగపడ్డాయి అని. మధుగారు జ్ఞాన భాండాగారం! లోక్‌సభలో కూడా శరద్‌గారు మధుగారితో ఉండేవారు.

లోక్‌సభలో మధుగారితో సరితూగే నేత వేరెవ్వరూ లేరని శరద్‌గారి అభిప్రాయం. అంతేకాదు ప్రజాజీవితంలోనూ, రాజకీయాలలోనూ తన ఈ స్థాయిలో ఉండడానికి మధుగారి ప్రేమ, స్నేహాలే కారణమని శరద్‌యాదవ్ గారి అభిప్రాయం.

మధులిమాయేగారు భారతదేశ యింకా ప్రపంచ రాజకీయాలకు సంబంధించిన జ్ఞాన భాండాగారం. అత్యంత సాధారణ జీవితం గడుపుతూ ఏ విధంగా మధుగారు దేశానికి దిశానిర్దేశం చేసారో, ఏ విధంగా దేశ రాజకీయాలను ప్రభావితం చేసేరో తెలుసుకోవడమే వర్తమాన రాజకీయ నాయకులకు పెద్దపాఠం.

# రాజకీయ, సామాజిక న్యాయాలను సమన్వయం చేసిన జననేత

**– మేధాపాట్కర్**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁂

మధులిమాయే గారి పేరు పార్లమెంట్ చరిత్రలోనే కాదు, సోషలిస్టు ఉద్యమ చరిత్రలో కూడా శిలాక్షరాలతో లిఖించబడి వుంటుంది. అతను జీవిత కాలంలో చేసిన కార్యక్రమాలు, స్వాతంత్రోద్యమ సమయములోను, యింకా స్వతంత్ర భారతం తొలినాళ్ళలో అతను సల్పిన కృషి అన్నీ నిజంగా పరిశోధించాల్సిన విషయాలే కాదు ముందు తరాలకి మార్గదర్శకంగా కూడా ఉంటాయి. ప్రస్తుతం దేశంలో ఉన్న అనైతిక రాజకీయ కార్యకలాపాలను చూస్తూ వుంటే, నిస్వార్థపరుడు, గొప్ప వక్త, ప్రజల తరపున మాట్లాడే, పనిచేసే మధులిమాయేగారి గురించి తెలుసుకోవడమే మన మనసులలో పరివర్తన తీసుకు రాగలదని అనిపిస్తోంది.

భారత రాజకీయ, సామాజిక సమానత్వం, న్యాయం విలువలతో సంఘటితం అవడం ఎల్లప్పుడూ సోషలిస్టుల అభిలాషగా ఉండేది. మధులిమాయే గారి వంటి సోషలిస్టు కార్యకర్తల నిర్ణయాలలో అది ప్రతిబింబిస్తూ ఉంటుంది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిలబడ్డప్పుడు లోహియా గారి పక్షం వహించి సోషలిస్టు పార్టీ

స్థాపించడంలోనూ, సోషలిస్టులను ఎన్నికల్లో నిలబెట్టి ప్రతిఫలాపేక్ష లేకుండా వారిని గెలిపించడంలోనూ, లోక్‌సభలో ప్రతీ రాజకీయ పక్షంపైనా ధైర్యంగా, తన వ్యక్తిత్వం చూపి ప్రభావితం చేస్తూ తన కర్తవ్యాన్ని నిర్వర్తించడంలోనూ మధులిమాయేగారి లక్ష్యం అదే! అతను జీవితాంతం దళితులు, పీడితుల కోసం పనిచేశారు. యవ్వనంలో తను చూసిన ఎస్.ఎమ్. జోషీ వంటి సోషలిస్టుల జీవనం, గాంధీజీ యొక్క సామాజిక- ఆర్థిక ఆలోచనా విధానం, యివే మధులిమాయేగారికి ప్రేరణగా నిలిచాయి. వర్ణవ్యవస్థను పూర్తిగా రూపుమాపాలనే అంబేద్కర్‌గారి ఆలోచనా విధానం చాలా గొప్పదని ఆయన నమ్మేవారు. గాంధీగారి ఏకత్వాన్ని సాధించే మార్గం దీనికి కాస్త భిన్నమైనదని ఆయన ఉద్దేశ్యం. తన స్వతంత్ర ఆలోచనలు, స్పష్టమైన వక్తీకరణల కారణంగానే అతను ఎన్నో అభిప్రాయ భేదాలున్నప్పటికీ, ఎక్కడా రాజీ పడకుండా జీవితం గడపగలిగేరు. లోహియాగారు, జయప్రకాశ్‌గారి మధ్య అభిప్రాయ భేదాలు వచ్చిన సందర్భంలోనైనా, ఇందిరాగాంధీగారు లోక్‌సభలో తనకి శిక్షపడే ప్రకరణాలను మార్చుదానికి ప్రయత్నించినప్పుడు గాని మధుగారు వ్యవహరించిన తీరు అందరికీ మార్గదర్శకమైనదని చెప్పొచ్చు. సోషలిస్టుల నిజాయితీతో కూడిన విశ్లేషణకి అతడిలోని ఈ గొప్పగుణం ఆధారంగా నిలిచింది. అతను రాజకీయాల నుంచి తప్పుకున్నాక తన జీవిత చరమాంకంలో ఈ విశేషాలనే గ్రంథరూపంలో తీసుకొచ్చారు. అవే మనందరికీ సామాజిక పరివర్తన కలుగుతుందని విశ్వాసం కలిగించే ఆశాదీపాలు.

మధుగారు ఎన్నికల్లో కూడా కేవలం తన ఒక్కరి కోసమే కాకుండా ప్రతీ నియోజకవర్గంలోనూ ప్రజాప్రతినిధిగా మారిపోయేవారు. 1938వ సంవత్సరం చివర్లో అనేకమంది యితర సోషలిస్టు యువ కార్యకర్తలతో కలిసి యుద్ధాన్ని వ్యతిరేకించినందుకు గాను ఖాన్‌దేశ్‌లోని ధులియా జిల్లాలో కారాగారవాసం చేస్తున్న సమయంలో సానే గురూజీ ఆ ఉపన్యాసాలకు నోట్సు కూడా వ్రాశారు. కానీ దురదృష్టవశాత్తూ 1942 సంఘర్షణలో ఆ నోట్సు మాయమవడం వలన అది గ్రంథరూపం దాల్చడం జరగలేదు. స్వాతంత్రోద్యమ కాలంలో ఆకాశవాణిని స్థాపించిన రెండేళ్ళవరకు మధుగారు కారాగారంలో బందీగానే ఉన్నారు. జైల్లో

కార్యకర్తల బాగోగులు తెలుసుకుంటూ ఉండటానికి చాలా కష్టాలు పడాల్సి వచ్చినా అతను ఎన్నడూ భీతి చెందలేదు.

శ్రామికుల అధికారం కోసం ఎస్.ఎమ్. జోషి వంటి సోషలిస్టులు పనిచేస్తున్న కాలంలో కూడా మధుగారు ఆ కార్యాలలో కూడా ఏవిధంగానూ రాజీపడలేదు. బియ్యం వ్యాపారులు అవినీతి మార్గంలో సంపాదించిన సొమ్ము నుంచి వెయ్యి రూపాయలను మధుగారికి చందా క్రింద పంపిస్తే అతను మేమేమైనా దళారులమా? అని ప్రశ్నిస్తూ ఆ చందాని తిరగొట్టారు.

స్వాతంత్ర్యానంతరం కూడా రాజకీయ, సామాజిక, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా మధుగారు సోషలిస్టు సిద్ధాంతాలననుసరించి పోరాటం సల్పుతూనే ఉండేవారు. పరిపాలనా పరంగా ఏ ఇందిరాగాంధీని వ్యతిరేకించారో ఆ ఇందిరా గాంధీగారు విదేశీ వ్యవహారాల గురించి మధుగారి సలహా తీసుకోవడం ఎన్నడూ మరిచేవారు కాదు. లోక్‌సభలో సరైన ప్రతిపక్షంగా ఉంటూ, ప్రభుత్వాన్ని ఎదిరించడమే మధుగారి సంకల్పంగా ఉండేది. లోక్‌సభకి బయట కూడా అతను అనేక ప్రజాపోరాటాలలో పాల్గొనేవారు. రాజకీయాలలో మార్పు తీసుకురావడానికి అతను ఎన్నికల ప్రక్రియపై అనేక పర్యాయాలు ప్రశ్నలు లేవనెత్తారు. ప్రత్యామ్నాయ మార్గాలను కూడా సూచించారు.

తన రచనలు, ఉపన్యాసాల ద్వారా సోషలిస్టు ఆదర్శాలను ప్రచారం చెయ్యాలనే లక్ష్యంతో జీవితాంతం పనిచేసిన మధుగారి నిర్విరామ కృషి ప్రస్తుత దేశ పరిస్థితులలో ఆలోచించదగ్గది. జాత్యహంకారం, ఆదర్శానికి అతను ఎప్పుడూ తీవ్ర విరోధిగానే ఉన్నారు. గాంధీ, లోహియా జయప్రకాశ్‌గార్లతో పాటు మధుగారు కూడా దేశంలో సోషలిస్టు ప్రత్యామ్నాయం తీసుకువచ్చే పనిలో మూలస్తంభంగా ఉన్నారు. అంచేత అతనికి గొప్పతనం గురించి కేవలం స్మారక సంచిక తీసుకు రావడమే కాకుండా యువతకు సోషలిస్టు పాఠశాల ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు జరగాలి.

# నిష్కళంకితుడైన సోషలిస్టు ఆలోచనాపరుడు

**– రమాశంకర్ సింహ్**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁂ ⁂ ⁂

**1**969 ప్రాంతం నుంచే మధుగారిని చూడడం, అతని ఉపన్యాసాలు వినడం జరుగుతూ వున్నా, మధుగారితో నా పరిచయం 1972 తరువాతే జరిగిందని చెప్పొచ్చు. మరొక సోషలిస్టు నాయకుడైన రాజ్‌నారాయణగారి నిష్కపటత్వం, నిశ్చలత్వం పారదర్శకత వలన అతని పట్ల ఆకర్షితుడనైన నేను అతనితో సన్నిహితంగా ఉండేవాడిని. కాలక్రమేణా అప్పటి సోషలిస్టు రాజకీయాల్లో నన్ను రాజ్‌నారాయణ గారి వర్గానికి చెందిన వ్యక్తిగా గుర్తించసాగారు. అలా అయినప్పటికీ మధుగారి పట్ల ఆకర్షితులవడం సహజమే. ముఖ్యంగా భారీ సభలలో అతను సోషలిస్టు ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరిచే విధానం సమ్మోహనకరంగా ఉండేది. లోక్‌సభలో అతను లేవనెత్తే ప్రశ్నల గూర్చి తెల్లారి దినపత్రిక రాగానే సమాజంలో ప్రతీ మూలా చర్చ జరిగేది. ఇక్కడ నేను అతని గూర్చి నా జ్ఞాపకాలు రెండు మూడు పంచుకోవడం ద్వారా అతని ఉన్నత వ్యక్తిత్వాన్ని తెలియజెయ్య దలిచాను.

(1) 1977లో పిన్న వయసులోనే మధ్యప్రదేశ్‌లోని జనతా ప్రభుత్వంలో నాకు మంత్రిపదవి దొరికింది. అది చౌదరి చరణ్‌సింగ్ గారు స్వయంగా కల్పించుకోవడం వలన జరిగిందని ముఖ్యమంత్రి శ్రీ వీరేంద్రకుమార్ సఖ్లేచాగారు నాకు ఫోన్ చేసి చెప్పడం జరిగింది. తరువాత కాలంలో ముఖ్యమంత్రిగారికీ, నాకు నాకు మధ్య ప్రజలకు సంబంధించి చెలరేగిన వివాదం మెల్లగా ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్‌గారి వరకూ వెళ్ళింది. నా ఆరోపణల్లో వాస్తవాలున్నప్పటికీ, వాటికి లిఖితపూర్వక ఆధారాలున్నప్పటికీ ఆ ఆరోపణలపై ఏ రకమైన విచారణ చేయించడానికి మొరార్జీగారు సుముఖత చూపలేదు. అప్పటికి కేంద్ర హోమ్‌శాఖ మంత్రిగా వున్న చౌదరి చరణ్‌సింగ్‌గారు ఇ.డి. ద్వారా అంతర్గత విచారణ చేయించగా నా ఆరోపణల్లో నిజం ఉందని తేలింది. ముఖ్యమంత్రి కుటుంబం అవినీతికి పాల్పడిందనేది ముఖ్యమంత్రిగారిపైన ఆరోపణ. తరువాత కాలంలో చాలా పార్టీ వేదికల మీద భారతీయ జనసంఘ్, భారతీయ జనతా పార్టీలు శ్రీ సఖ్లేచాగారి పైన యిదే ఆరోపణ చెయ్యడం, కొన్నేళ్ళ తర్వాత సఖ్లేచాగారు రాజకీయాల్లో పత్తా లేకుండా పోవడం జరిగేయి.

నేను చాలాసార్లు కలిసి విన్నవించుకున్నా కూడా శ్రీమొరార్జీగారు నా మాటలను పెడచెవిన పెట్టడంతో మంత్రివర్గానికి రాజీనామా చెయ్యడం మినహా నాకు ప్రత్యామ్నాయం కనిపించలేదు. ఇదే ఆలోచనతో నేను మధుగారిని కలిసి అతనికి నా సమస్యను, నా ఆలోచనను చెప్పినపుడు, అతను కూడా నా ఆలోచనను అంగీకరించి రాజీనామా చెయ్యడమే ఉత్తమమని సలహా యిచ్చేరు.

నేనేం చెప్పానంటే యిక్కడ ఆరోపణ ముఖ్యమంత్రిగారి అవినీతికి సంబంధించినది కనుక, తక్కిన సోషలిస్టు మిత్రులు కూడా నాతోపాటు మంత్రివర్గానికి రాజీనామా చేస్తే, వాతావరణం వేడెక్కి అది ముఖ్యమంత్రి రాజీనామాకు దారి తియ్యగలదని! మధుగారు నాతో సైద్ధాంతికంగా అంగీకరించినా కూడా ఏమన్నారంటే ఈ సోషలిస్టుల ఆలోచనా విధానాలు తనకు తెలుసనీ అంచేత వాళ్లమీద ఒత్తిడి పెంచాలంటే ముందుగా నేను రాజీనామా చెయ్యాలనీ చెప్పేరు. వెంటనే నేను రాజీనామా లేఖ డిక్టేషన్ ఇమ్మని మధుగారిని అడిగేను. అనుకోకుండా ఢిల్లీలోని మధ్యప్రదేశ్‌భవన్‌కి విచ్చేసి ఉన్న ముఖ్యమంత్రిగారికి రాజీనామా లేఖ సమర్పించేను. ఒకటి రెండు వారాల తరువాత నేను తక్కిన

సోషలిస్టు సహచరుల రాజీనామాల గురించి మధుగారిని ప్రశ్నించినప్పుడు ఆయన ఖిన్నులై వారంతా కపటంతో వ్యవహరిస్తున్నారనీ, పోరాటానికి యింకేమీ మిగల్లేదనీ వాపోయారు.

కొంతకాలానికే కేంద్రప్రభుత్వం పడిపోయింది. విధానసభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో సంయుక్త సోషలిస్టు పార్టీ, లోక్‌దళ్‌ల కూటమికి చెందిన 70 మంది అభ్యర్థుల్లో నేను తప్ప వేరెవ్వరూ విజయం సాధించలేదు. ఆ తరువాత మధుగారికీ, నాకూ మధ్య సాన్నిహిత్యం పెరిగింది.

(2) ఆ తరువాత ఒక సందర్భంలో మేమిద్దరం కలిసినప్పుడు తరవాత కార్యక్రమం ఏమిటని మధుగారు యధాలాపంగా ప్రశ్నించారు. ఆ మరుసటి దినం కుటుంబంతో సహా అంబాసిడార్ కారులో భింద్ వెళ్తున్నానని చెప్పాను. ఏ దారిలో వెళ్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇటావా మీంచి అని జవాబిచ్చాను. ఎంతమంది వున్నారని ఆయన అడిగారు. ముగ్గురు పెద్దలు, యిద్దరు పిల్లలు అని నా జవాబు. అయితే నేను ముందుసీట్లో కూర్చోవచ్చా, నాతో పాటు ఒక బిడ్డగానీ, నువ్వుగానీ కూర్చోవచ్చుగదా అని అతను అడిగారు. తప్పక– అది మాకెంతో సంతోషం అని నా జవాబు. ఆ రోజుల్లో అంబాసిడార్ కారులో ముందుకి రెండు విడి సీట్లు కాకుండా ఒకటే పెద్ద సీటు ఉండేది. దాని మీద డ్రైవర్‌తో సహా ముగ్గురు కూర్చోగలిగేవారు. మరుసటి దినం దారంతా సుమారు 6, 7 గంటలపాటు మధుగారు నా కుమార్తెలకు రకరకాల పాటలు వినిపించారు. ఆనందించే విషయాలు చెప్పారు. ఇటావా సర్క్యూట్ హౌస్ దగ్గర ములాయంసింగ్ యాదవ్ మధుగారి కోసం జీపుతో వేచివున్నారు.

(3) 1981, 82 ప్రాంతంలో నేను సింగపూర్ వెళ్ళడం సంభవించింది. అది జపాన్ ఎలక్ట్రానిక్ పరికరాలు వెల్లువెత్తుతున్న కాలం. చవకగా కూడా దొరికేవి. చక్కటి సంగీతం వినడంతోనే నాకు మధుగారు జ్ఞాపకం వచ్చేరు. అతను రోజూ సంగీతంపై మక్కువ కొద్దీ పాత, డొక్కు ఫిలిప్స్ ఎల్. పి. రికార్డర్‌లోంచి వచ్చే ఖరాబైన ధ్వనితోనే సంగీతం వినేవారు. ఏళ్ళుగా అతని వద్ద ఆ పాత రికార్డ్ ప్లేయరే ఉంది. సింగపూర్ బజార్‌లో చక్కటి సోనీ లేదా శాన్యో టేప్‌రికార్డర్ రెండువేల రూపాయలకే దొరుకుతోంది. మధుగారు చక్కటి సంగీతం వినేందుకు వీలుగా అతనికి బహుమతిగా యిచ్చేందుకని నేను ఒక టేప్‌రికార్డర్ కొన్నాను.

ఢిల్లీ వచ్చేక అతని వద్దకు తీసుకెళ్ళాను. అతను చాలాసేపు పాటలు విని దానిని ప్రశంసించారు. అతని ఆనందం కళ్ళారా చూసి, నేను శలవు తీసుకోబోతూండగా అతను టేప్‌రికార్డర్ నా చేతుల్లో ఉంచి బాగుంది అన్నారు. నేను అది అతని కోసమే చెప్పగా నిర్ద్వంద్వంగా తిరస్కరించి, పాత రికార్డర్ తనకు చాలని, నన్ను యిందులో సంగీతం వినమని చెప్పారు. నా కళ్ళలో నీరు తిరగడం చూసి, అతను 'బై' చెప్తూ తన గది తలుపులు మూసుకున్నారు.

మధుగారి తీరు అలా వుండేది. నిష్కళంకమైన, నిరాడంబరమైన జీవితం అతనిది. తన వద్ద ఉన్న పరిమిత వనరులతోనే, ఒకేగదిలో సాదాసీదాగా జీవితం గడప గలిగిన అసలు సిసలు సోషలిస్టు మధుగారు!

# ఆత్మావలోకనం

**- ఆనంద్ కుమార్**

అనువాదం : **అరుణా ప్రసాద్**

✧ ✧ ✧

**భా**రత సోషలిస్టు ఉద్యమానికి మార్గదర్శనం చేసిన మధులిమాయే గారి జన్మశతాబ్ది ఉత్సవాలను ఉల్లాసంగా జరుపుకోవడం కేవలం సోషలిస్టుల బాధ్యత మాత్రమే కాదు. ప్రతీ దేశభక్తుడి, ప్రజాస్వామ్యాన్ని సమర్థించే ప్రతీ భారతీయుడి కర్తవ్యం కూడా. 1922 మే 1 నుంచి 1995 జనవరి 8 వరకు సాగిన మధుగారి సుదీర్ఘ జీవనయాత్రలో గాంధీగారి నేతృత్వంలో స్వాతంత్ర్యోద్యమ పర్వం, లోహియాగారి నేతృత్వంలో సోషలిస్టు ఉద్యమ పర్వం, జె.పి.గారి నేతృత్వంలో సోషలిస్టు పరిరక్షణ ఉద్యమపర్వం అనే మూడు అధ్యాయాలు ఉన్నాయి. అదే సమయంలో 1949 నుండి 1971 వరకు అతను సోషలిస్టు పార్టీలో ఉన్నత పదవులలో వున్నారు. బీహార్ నుంచి నాలుగుసార్లు 1964, 1971, 1973 యింకా 1977 ఎన్నికల్లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1977-78 మధ్యకాలంలో జనతాపార్టీకి, 1979-81 మధ్యకాలంలో లోక్‌దళ్‌కి ప్రధానకార్యదర్శిగా ఉన్నారు.

అతని ఆలోచనలు, చేతలలో ఒక చక్కని సమన్వయం గోచరించేది. సత్యాగ్రహాల నుంచి లోక్‌సభలో ఉద్యమాల వరకు అతను ఆకర్షణీయమైన సోషలిస్టు నేతగా ఉండేవారు. తోటి నేతలంతా అతనితో ఎంతో స్నేహంగా ఉండేవారు. అనుచరులంతా అతన్ని ఎంతో గౌరవించేవారు. అతను కూడా తన జీవితాన్ని స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిస్టు సమాజ స్థాపన అనే లక్ష్యాలకే అంకితం చేసారు.

కానీ యిక్కడ గుర్తుంచుకోవలసిన విషయమేమంటే యింత ప్రసిద్ధి చెందిన సోషలిస్టు అయిన మధుగారి రాజకీయ జీవితం ఏమంత సుగమంగా గడవలేదు. తన మీద తను నమ్మకాన్ని కోల్పోయిన సందర్భాలు, నిరర్థకంగా భావించుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. 7 సార్లు ఎన్నికల్లో పోటీ చెయ్యగా నాలుగుసార్లు గెలిచారు. 3 మార్లు పరాజయం పొందారు. 1983 తరవాత సోషలిస్టు కుటుంబంతో రాజకీయంగా ఒంటరిగా మిగిలిపోవాల్సి వచ్చింది. మధులిమాయే వంటి మహానుభావుడు నిరాశనీ, ఉదాసీనతనీ, ఎలా ఎదుర్కొన్నారో తెలుసుకోవడం కొత్తతరం సోషలిస్టు కార్యకర్తలకు ఉపయోగంగా ఉండగలదు. అతను దారి తప్పకుండా తనను తాను ఎలా కాపాడుకున్నారో తెలుసుకోవడం అవసరం.

మధుగారి జీవన సహచరి చంపగారు చెప్పినదాని ప్రకారం 1955 నుంచి 1957 వరకు ఉన్నకాలం చాలా గడ్డుకాలం. ఆ సమయంలో అతని ఆత్మపరిశీలన గూర్చి తెలుసుకోవాలంటే అతని 'గోవా డైరీ' చదవాల్సిందే. గోవాకి పోర్చుగల్ నుంచి స్వాతంత్ర్యం సాధించడానికి సత్యాగ్రహం చేసిన మధుగారు జైల్లో బంధించబడ్డారు. పోర్చుగల్ ప్రభుత్వం అతన్ని విపరీతంగా కొట్టి ఖైదులో పడేసింది. ఆ తర్వాత అతనికి పన్నేండేళ్ళ ఖైదు శిక్ష విధించబడింది. జైల్లో అతను ఆస్తమాతో బాధపడ్డారు. బయట అతని భార్య చంప ఏడాది వయసున్న పసికందు అనిరుధ్‌తో, ఆర్థిక యిబ్బందులను ఎదుర్కొంటూ జీవనం గడుపుతోంది. కుటుంబమంతా పేదరికంలో కొట్టుమిట్టాడుతోంది. మధుగారు ఏ సోషలిస్టు పార్టీ కోసం తన యవ్వనాన్నీ, విశ్వవిద్యాలయ చదువు, కుటుంబబంధాలు, భౌతికమైన సుఖసౌఖ్యాలను త్యాగం చేసారో అదే సోషలిస్టు పార్టీకి అతను బలిపశువు అయిపోయారు. సన్నిహితులు, దగ్గరగా మసిలే నాయకులు అనేకమంది మొహం చాటువేశారు. ఆ కాలంలో తనకి ఎంతో ప్రియతమ నాయకులైన జయప్రకాశ్

నారాయణ్, ఎస్.ఎమ్. జోషీల వ్యవహారం మధుగారిని మనస్తాపానికి గురిచేసింది. కేవలం లోహియాగారి నైతిక, దృఢవ్యక్తిత్వం కాస్త ఊరటనిచ్చింది.

ఆ గోవా సత్యాగ్రహ (1955-56) హీరోగారికి 1957లో మహారాష్ట్ర విధానసభ ఎన్నికల కాలంలో బెయిల్ రద్దు చెయ్యబడింది. బొంబాయి, మహారాష్ట్ర, ప్రజల ఈ శరాఘాత నిర్ణయం అతనికి తీరని వ్యధను కలిగించింది. 1979-83 మధ్యకాలంలో ప్రభుత్వాన్ని కూలద్రోసి, జనతాపార్టీ విడిపోవడానికి కారణ మయ్యారనే అపనింద ఆయన నెత్తిన పడింది. ఈ దుష్ప్రచారం కారణంగా మధుగారు తన ఆఖరిదశలో ముంబై వెళ్ళేవారు కాదని అతని సుపుత్రుడు అనిరుధ్ వ్రాశారు.

కానీ మధుగారు తన ఈ చేదు అనుభవాలను కాలంతో వెనక్కు నెట్టగలిగారు. సంబంధాలు పునరుద్ధరించుకుని అవకాశాలు ఏర్పరచుకున్నారు. ఏ విధమైన అడ్డంకులూ లేకుండా సరి చూసుకున్నారు. అంచేతే 1974-79 మధ్యకాలంలో జయప్రకాశ్ నారాయణగారికి సన్నిహితమవడానికి అతను సంకోచించలేదు. తన ఆత్మకథను ఎస్.ఎమ్. జోషీ, సానే గురూజీలకు అంకితమిచ్చారు. లోహియాగారి కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయ విధానాలతో విభేదించినప్పటికీ మంచి పార్లమెంటేరియన్స్ అవ్వాలంటే అవకాశవాద రాజకీయాలు మానుకోవాలని లోహియాగారు చెప్పేవారని ఆయన వ్రాశారు. కొంత కాలానికి సోషలిస్టు పార్టీ పురోగమించటం లేదని అతనికి తోచింది. మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ, జనసంఘ్, ప్రసోపా మొదలైనవన్నీ, సోషలిస్టు పార్టీతో కలిసి నడిస్తే రాజకీయాల్లో మార్పు తేవచ్చని అతనికి కొన్నాళ్ళు ఆశ ఉండేది. కానీ ఆ కల కలగానే మిగిలిపోయింది. అంచేత 1963 నుంచి అతను కాంగ్రెస్‌ను ఓడించడానికి సర్వశక్తులూ ఒడ్డి సహకారం అందించారు. పార్లమెంట్ లోపలా, బయటా లోహియాగారు, అతని అనుచరులు చేసిన పోరాటాల ఫలితంగా 1967 సార్వత్రిక ఎన్నికలలో 8 రాష్ట్రాల్లో కాంగ్రెస్ పరాజయం పాలైంది. రాజకీయాల్లో చైతన్యం రావాలని లోహియాగారి ఆకాంక్ష. కాంగ్రెస్ గుత్తాధిపత్యానికి ముగింపు పలకాలని అతను వాంఛించారు. రాజకీయపార్టీలన్నీ కార్యక్రమాల ఆధారంగా ఉండాలని అతను ఆశ పడ్డారు. కానీ దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ గుత్తాధిపత్యానికి చరమగీతం పాడే క్రమంలో ప్రతిపక్షాలన్నీ సిద్ధాంతాలు లేని కాంగ్రెస్ మాదరిగానే తయారయ్యాయి.

# నాకు తెలిసిన మధు గారు

**-మస్త్రామ్ కపూర్**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁘ ⁘ ⁘

**1**995వ సంవత్సరం జనవరి 8వ తేదీ రాత్రి సుమారు 9 గంటలకు మధుగారు మనకి శాశ్వతంగా దూరమైపోయారు. ఆఖరి శ్వాస తీసుకోవడానికి సుమారు అర్థగంట ముందు వరకు అతను ఎప్పట్లాగానే పూర్తి స్పృహలో వున్నారు. 1922 మే 1న వారు జన్మించారు. 18 ఏళ్ళ వయసులోనే స్వాతంత్ర్యోద్యమంలో పూర్తిస్థాయిలో పాల్గొన్నారు. 1940లో మొదటిసారి బ్రిటిష్‌వారిని వ్యతిరేకించి నందుకు అతనికి జైలుశిక్ష విధించబడింది. అప్పటికే అతను ఎస్.ఎమ్.జోషీ, సేనాపతి బాపట్‌ల పట్ల ఆకర్షితుడై తన మార్గాన్ని ఎంచుకున్నాడు. రాష్ట్ర సేవాదళ్ కార్యకర్తల ఊరేగింపుపై దాడి చేసి ఎస్.ఎమ్.జోషీ, సేనాపతి బాపట్‌లు గాయపడడానికి కారణమైన నాటి నుంచీ అతనికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అంటే విముఖత ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ తాలూకు సంప్రదాయవాదం, యథాస్థితివాదాలను కూడా అతను అర్థం చేసుకున్నారు. కనకనే అతను కాంగ్రెసు

సోషలిస్టు పార్టీలో చేరి సోషలిస్టు విధానాలను అవలంబించారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో అజ్ఞాతంలో ఉంటూ ఒక గూడ్స్ రైలును పేల్చేసే పని అతనికి అప్పగించబడింది. ఆ సందర్భంగా ఒక రైల్వే ఉద్యోగి మరణించడం జరిగింది. అజ్ఞాత ఉద్యమం గాయాలు, దెబ్బలు తగలకుండా చెయ్యాలని నిర్ణయించినప్పటికీ ప్రభుత్వ వ్యవస్థలను దెబ్బ తీయడం అంటే ప్రాణాలు పోయే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. ఈ ఘటన వలన మధుగారి మనసులో హింసాత్మక ఘటనలంటే ఏవగింపు ఏర్పడింది. దానితో అతను గాంధీగారి అహింసా విధానాలను సమర్థించాలని నిర్ణయించుకున్నారు. రష్యా మీద హిట్లర్ ఆక్రమణ జరపగానే యిక్కడి కమ్యూనిస్టులంతా రాత్రికి రాత్రి ప్లేటు ఫిరాయించి స్వాతంత్ర్యోద్యమానికి వెన్నుపోటు పొడుస్తూ ఆంగ్లేయుల కొమ్ము కాయడంతో అతనికి కమ్యూనిస్టులంటే కూడా ఏవగింపు కలిగింది. స్వతంత్ర భారతంలో గోవాముక్తి ఆందోళన సందర్భంగా అతనికి 12 ఏళ్ళ కారాగారవాసం విధించబడింది. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు అతను 19 నెలలు జైల్లో గడిపారు. ఆ విధంగా ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే వ్యవస్థలకు వ్యతిరేకంగా అతను పోరాడేరు. లోక్‌సభ సభ్యునిగా ఉన్న కాలంలోనూ (అతను నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు) క్రియాశీల రాజకీయాలనుంచి తప్పుకుని రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన 12 ఏళ్ళ కాలంలోనూ అతను తను ఎంచుకున్న విలువల స్థాపనకు కృషి చేశారు. ఎటువంటి ప్రలోభాలకు ఎన్నడూ తల ఒగ్గకుండా తన తుది శ్వాస వరకు ఆ విలువల కోసమే పాటుపడ్డారు.

మధుగారి మృతి వలన ఏర్పడిన లోటు ఎన్నటికీ పూరింపబడదు. ఇది అతనికి కేవలం శ్రద్ధాంజలి మాత్రమే కాదు. నూటికి నూరు పాళ్ళూ సత్యం. అతనికి అత్యంత సన్నిహితులు మాత్రమే కాకుండా అతని రచనల ద్వారా ప్రేరణ పొందినవారు, సమాజం, దేశం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అవగాహన వున్నవారు అంతా యిలానే భావిస్తారు. 1995 జనవరి 11న ఢిల్లీలోని మావలంకర్ హాలులో మధుగారి శ్రద్ధాంజలి సభలో వివిధ రాజకీయ పక్షాల నేతలు, పత్రికలవారు, సమాజంలోని అన్ని వర్గాల వ్యక్తులు చెప్పిన మాటలు ఏదో కేవలం అలంకారప్రాయంగా చెప్పినవి కాదు. హాలులో కూర్చున సభికులందరికీ ఈ విషయం అర్థమయ్యే ఉంటుంది.

నా ఉద్దేశ్యంలో దీనంతటికీ కారణం అతని స్వచ్ఛమైన దృష్టి. తన బాధ్యతలు, హామీల పట్ల అతనికి స్పష్టత ఉండేది. అతను ఎలాంటి డొంకతిరుగుడు లేకుండా తను చెప్పదలచుకున్నది సూటిగా చెప్పేవారు. అలాగని అతని మనసులో ఎవరిపట్లా శత్రుత్వం ఉండేదికాదు. అతనిలో యిసుమంతైనా ద్వేషం కానవచ్చేది కాదు. తన, పర భేదం లేకుండా ఎవరు చెడు చేసినా అతను దాన్ని గట్టిగా వ్యతిరేకించేవారు. అదేవిధంగా తన విరోధులైనా మంచిపని చేస్తే వారిని అభినందించడానికి ముందుండేవారు.

కాంగ్రెస్ పట్ల మధుగారు ఎప్పుడూ వ్యతిరేక వైఖరినే అవలంబించేవారు. అదే విధంగా ఇందిరాగాంధీగారి అధికార దాహం అతనికి గిట్టేది కాదు. రాజకీయాలలో కాంగ్రెస్ యొక్క సంప్రదాయ పద్ధతులను జీర్ణించుకోలేని అతను ఎప్పుడు కాంగ్రెస్ వైరివర్గంలోనే ఉండేవారు. అలాగని ఆ పార్టీ చేసిన మంచిపనులను అతను ఎన్నడు చిన్నచూపు చూడలేదు. స్వాతంత్ర్యానికి ముందుతరం కాంగ్రెస్ నాయకులంటే అతనికి అపార గౌరవం. అసలతను కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సభ్యుడిగా ఉన్నారు కూడా! అతను తను స్వాతంత్ర్యోద్యమం గురించి తను రచించిన గ్రంథాలలో కాంగ్రెస్ ఇంకా ఆ పార్టీ మహా నాయకులైన గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్, సుభాష్, మౌలానా ఆజాద్, రాజేంద్రబాబు తదితరులను వారి పనులకై ప్రస్తుతించారు. వారిపట్ల అపార గౌరవం చూపారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ, పటేల్‌ల విధానాలతో ఏకీభవించకపోయినా స్వాతంత్రోద్యమ కాలంలో వారి సేవలను గూర్చి కొనియాడడంలో అతను ఏ మాత్రం వెనక్కు తగ్గలేదు. సర్దార్ పటేల్‌గారికి సోషలిస్టులంటే అంతగా గిట్టేది కాదు. (బహుశా సోషలిస్టులు నెహ్రూని తమ నాయకునిగా భావించి నందువల్లనేమో!) అయినా కూడా మధుగారు పటేల్‌ని భారత నిర్మాతగా కొనియాడారు. కాంగ్రెస్ కుటుంబ పాలనా కాలంలో మర్చిపోయిన సర్దార్ పటేల్‌గారికి చంద్రశేఖర్ ప్రభుత్వ హయాంలో భారతరత్న యిప్పించడానికి మధుగారు కృషి చేశారు. స్వాతంత్ర్యానంతర కాంగ్రెస్ విధానాలను అతను నిశితంగా విమర్శిస్తూ వచ్చారు. అతను కేవలం కాంగ్రెస్‌ని వ్యతిరేకించడమే కాకుండా డా.లోహియా గారి కాంగ్రెస్ వ్యతిరేక ఉద్యమంలో మూలస్తంభంగా వున్నారు. (అయితే కాంగ్రెస్ వ్యతిరేక ఆలోచనా విధానంలో లోహియాగారితో అతనికి

అభిప్రాయ భేదాలుండేవి). అతను చివరి వరకూ తన వంతు పాత్రను తను పోషించారు. 1977లో జనతాపార్టీనీ, 1989లో జనతాదళ్‌నీ నిర్మించడంలో అతని కృషి గొప్పది. అయితే ఇవి చీలిపోయి, కొందరు నాయకులు ఇక కాంగ్రెసేతర పక్షాలు నశించాయి అని ప్రచారం చేస్తున్నప్పుడు అతను ఈ సిద్ధాంతం మీద నమ్మకం కోల్పోలేదు. విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రభుత్వంలో భాజపా ఇంకా కమ్యూనిస్టులు కలిసి పనిచేసే విధంగా అతను చాలా కృషి చేసేరు. చంద్రశేఖర్, ములాయంసింగ్‌లు తమ ప్రభుత్వాల కోసం కాంగ్రెస్ మద్దతు తీసుకోవడం అతనికి ఇష్టం లేదు. పార్టీ నిర్మాణ సమయంలో జనసంఘ్ అనుసరించిన మొండి వైఖరి కారణంగా చివరికి జనతా పార్టీ చీలిపోయే పరిస్థితి వచ్చింది. అటువంటి చేదు అనుభవం తరవాత కూడా అతను విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రభుత్వంలో భాజాపాను చేర్చుకొమ్మని అతను సలహా ఇచ్చారు. దీన్ని బట్టి కాంగ్రెస్ వ్యతిరేక సిద్ధాంతం మీద అతని ఆశను అర్థం చేసుకోవచ్చు.

కాంగ్రెస్‌ని యింతలా వ్యతిరేకించినప్పటికీ దేశంలో నిజమైన జాతీయ పార్టీ అంటే కాంగ్రెస్ మాత్రమే అని అతను తరచూ చెప్పేవారు. దీనికి కారణం కాంగ్రెస్ మూలాలు చాలా దూరం వరకు వ్యాపించి ఉండడమే. ఎంత మారుమూల గ్రామాలలోనైనా ఒకరిద్దరు కాంగ్రెస్ వాదులు దొరకకుండా ఉండరు. దక్షిణాదిన అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన కాంగ్రెస్ విధానాలను ప్రస్తుతించిన అతను ఉత్తరాదిన అదే కాంగ్రెస్ బడుగుల అభివృద్ధికి అవరోధంగా ఉంటోందని ఆరోపించేవారు. భాజపాని అనుకరిస్తూ రాజీవ్ నరసింహారావులు హిందూ ఓట్ బ్యాంక్ రాజకీయాలు చెయ్యడాన్ని అతను నిరసించారు. ఇలాంటి విధానాల వలన కాంగ్రెస్‌కి జాతీయ పార్టీగా ఉన్న పేరు, ప్రతిష్ఠ దెబ్బతింటాయని ఆయన హెచ్చరించారు. అర్జున్ సింఘ్, నారాయణ్ దత్ తివారీల ప్రయత్నాలను కూడా అతను అనుమానాస్పదంగానే చూసేవారు. వీరి వలన కాంగ్రెస్ చీలిపోయే ప్రమాదం ఉందని అతని భావన.

కాంగ్రెస్ పట్ల ఈ అనుకూల వైఖరి చూసి కొందరు సోషలిస్టు మిత్రులు కూడా మధుగారు మారిపోయారని అనుకోసాగారు. ముఖ్యంగా అతను ఇందిరాగాంధీమీద ఇందిరాగాంధీగారి మోహినీ ఆట్టమ్, నాకు తెలిసిన ఇందిరాగాంధీ అని రెండు వ్యాసాలు రాసినప్పుడు అందరూ ఆశ్చర్యానికి

గురయ్యారు. కానీ రాజకీయంగా విభేదాలున్నా కూడా అతను అవతలి వ్యక్తులలోని మంచితనాన్ని గుర్తిస్తారని ఈ రెండు వ్యాసాల వలన అర్థం అవుతుంది. వ్యక్తిగత వ్యవహారం, మర్యాద, మన్నన, పేదలతో సహజంగా కలిసిమెలిసి మెలిగేతీరు, చక్కటి వస్త్రధారణ,(దీనికి అతను మన భారతంలోని ద్రౌపదిని ఉద్దేశిస్తూ చెప్పిన 'సుసంవీత' అనే పదాన్ని వాడేరు) వంటి ఇందిరాగాంధీ గుణగణాలను ఆయన ప్రశంసించేవారు. అతను ఇందిరాగాంధీ యొక్క విదేశాంగ విధానాన్ని కూడా ప్రశంసించేవారు. ముఖ్యంగా బంగ్లాదేశ్ విషయంలో ఆమె అనుసరించిన తీరు, ఆ విషయంలో ఆమె నెహ్రూకంటె కూడా మిన్న అని ఆయన అభిప్రాయపడ్డారు. జనతాపార్టీ పాలనా కాలంలో ఇందిరాగాంధీని లోక్‌సభ నుంచి బహిష్కరించే విషయంలో కూడా అతను ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఇటువంటి విషయాలలో కేవలం మందలించి వదిలెయ్యాలని ఆయన భావించారు. ఆ సమయంలో యింకా అయిదేళ్ళు పూర్తికాని కాంగ్రెస్ ప్రభుత్వాలను రద్దుచేసే నిర్ణయాన్ని కూడా ఆయన వ్యతిరేకించారు. ప్రతీకారేచ్ఛతో పని చెయ్యొద్దని అతను జనతాపార్టీ నాయకులను హెచ్చరించారు. కానీ అతని సూచనలను వారు పెడచెవిన పెట్టారు. తత్ఫలితంగా కర్ణాటకలో దేవరాజ్ అర్స్ నాయకత్వంలో కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలుపొందింది. ఆ తరువాత ఇందిరాగాంధీ తిరిగి పదవిలోకి రావడానికి మార్గం సుగమం అయ్యింది.

ఆత్మవినాశనానికి దారి తీసే కాంగ్రెస్ యొక్క అస్థిర విధానాలను విమర్శించడానికి వెనుకాడలేదు. కానీ కాంగ్రెస్ వంటి జాతీయపార్టీ, విచ్ఛిన్నం అవకూడదని ఆయన కోరుకున్నారు. ఎందుకంటే అలా విచ్ఛిన్నం అయినప్పుడు ఏర్పడిన లోటు ప్రాంతీయ సాంప్రదాయవాద సంకీర్ణ దళాల ఉత్పన్నానికి దారి తీస్తుందని ఆయన భావించారు.

సంఘ్ పరివార్ గురించి మధుగారి ఆలోచనలు మొదట్నుంచీ స్పష్టంగా ఉన్నాయి. స్వాతంత్ర్యోద్యమం పట్ల, స్వతంత్ర్య సమర యోధుల పట్ల ద్వేషముతో ఉండే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ గురించి మధుగారికి తెలిసినంతగా సంఘ్‌లోని పెద్ద నాయకులకు కూడా తెలియదు. అంచేతే సంఘ్ పరివార్ నాయకులు మధుగారి వ్యాసాలను జాగ్రత్తగా చదివేవారు. కొన్నిసార్లు అతని అభిప్రాయాలను ఖండించడానికి 'పాంచజన్య', 'ఆర్గనైజర్' పత్రికలలో పేజీలు, పేజీలు రాసేవారు.

జనతాపార్టీని నిర్మిస్తున్న కాలంలో అతనికి అన్ని యూనియన్లను (విద్యార్థిసంఘాలు, కార్మిక సంఘాలు) ఏకం చేసే పని అప్పగించబడింది. జనతాపార్టీ ఏర్పాటుకు ముందు అన్ని భాగస్వామ్య పక్షాలు తమ స్వంత ఉనికిని వదిలిపెట్టి పార్టీలో ఐక్యం అవడానికి అంగీకరించాయి. తీరా జనతా ప్రభుత్వం ఏర్పడ్డాక జనసంఘ్‌కి తమ శక్తి ఎప్పుడైతే తెలిసివచ్చిందో అప్పుడు వారు పార్టీలో విలీనానికి మొగ్గు చూపలేదు. తమ సంఘాల బలంతో జనతాపార్టీని హస్తగతం చేసుకోవచ్చని వారు భావించారు. వాళ్ళు ద్వంద్వ విధేయత కలిగి ఉండటానికి హింసాత్మక వైఖరిని అవలంబించడమే కాక, దానికి మధుగారిని లక్ష్యంగా చేసుకున్నారు. మధుగారి సభల్లో గొడవలు సృష్టించడమే కాకుండా వారు తమ పత్రికల ద్వారా మధుగారు జనతాపార్టీకి శత్రువు అని ప్రచారం చెయ్యసాగారు. చివరికి జనతాపార్టీ చీలిపోయినప్పుడు ఆ నేరమంతా మధులిమాయెగారి నెత్తిన రుద్దబడింది. ఈ ద్వంద్వ విధేయత అంశాన్ని మధుగారే లేవనెత్తారనీ, అంచేత పార్టీ కూలిపోయిందని అతన్ని నిందించడం జరిగింది. రెండు భాగాలుగా మధుగారు ప్రచురించిన గ్రంథం 'జనతాపార్టీ ఎక్స్‌పెరిమెంట్'లో జనతాపార్టీ ఏర్పాటు, చీలికల గురించి మధుగారు వివరించారు. అందులో తెలిసేదేమిటంటే జనతాపార్టీ చీలికకు అనేక కారణాలున్నాయి. వాటిల్లో ద్వంద్వ విధేయత కూడా ఒకటి. పైన చెప్పిన పుస్తకం మొదటిభాగంలో సంఘ్‌పరివార్‌కి సంబంధించిన వ్యాసంలో సంఘ్‌పరివార్ తాలూకు అసలు చరిత్ర అంతా చెప్పబడింది. ఇందులో ఉన్న చాలా ప్రశ్నలకు సంఘ్‌పరివార్ నాయకులు యింతవరకు జవాబు చెప్పలేకపోయారు. ఇకముందు చెప్పలేరు. ఈ కారణంగానే సంఘ్ పరివార్ దృష్టిలో మధుగారు అత్యంత ప్రమాదకర వ్యక్తిగా మిగిలిపోయారు.

సంఘ్ పరివార్ చరిత్ర అంతా పూర్తిగా తెలిసినప్పటికీ, బహుళ జనాదరణ కల ఈ పార్టీ ముఖ్యమైన జాతీయపార్టీగా ఎదగాలని మధుగారు కోరుకున్నారు. మతమౌఢ్యాన్ని విడిచిపెట్టి, మైనార్టీలు, దళితుల పట్ల తన వైఖరిని మార్చుకుని, మందిరం-మసీదు వంటి అంశాలను వదిలిపెట్టి ఆర్థిక, సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలనీ, హిందూమతానికి గొడ్డలిపెట్టు వంటి వర్ణవ్యవస్థను రూపు మాపడానికి రిజర్వేషన్లను నిజాయితీగా అమలు చెయ్యాలనీ అతను కోరుకున్నారు. సాదాసీదా జీవనం గడిపే కొందరు సంఘ్‌పరివార్ నాయకుల జీవన విధానాన్ని అతను

బాగా యిష్టపడేవారు కూడా. ఈ విషయంలో అతను తరచుగా శ్రీ గోల్వాల్కర్, శ్రీ కుశభావు ఠాకరేల పేర్లను ప్రస్తావించేవారు. వాజ్‌పేయిగారి నిష్కపట స్వభావం కూడా అతను యిష్టపడేవారు. సంఘ్ పరివార్ తాలూకు కఠినమైన ఆదర్శాల ముందు అతను నిస్సహాయుడిగా ఉన్నట్టు మధుగారు భావించేవారు. సంఘ్‌పరివార్‌కి చెందిన నాయకులు చాలామందితో అతనికి వ్యక్తిగత సంబంధాలుండేవి. వారు అతన్ని కలుస్తూ వుండేవారు. బాబ్రీమసీదు అంశం బాగా వేడెక్కేక యిరుపక్షాల మధ్య రాజీ కుదర్చడానికి మధుగారి యింట్లో రెండుసార్లు సమావేశాలు ఏర్పాటు చెయ్యబడ్డాయి. బాబ్రీమసీదు జాగాలో సగం మందిరానికీ, సగం మసీదుకీ యిచ్చేట్టుగా ఒక ప్రణాళిక కూడా తయారుచెయ్యబడింది. పటం కూడా తయారు చెయ్యబడింది. సంఘ్‌పరివార్ నాయకులు కూడా సమ్మతించారు. అంగీకార పత్రం మీద సంతకాలు చెయ్యడానికి వారు సమావేశానికి హాజరయ్యారు కూడా. కానీ ఎందుకో భయపడి బాబ్రీమసీదు కమిటీ సభ్యులు సమావేశానికి రాలేదు. మరుసటి దినం బాబ్రీ కమిటీలోని సభ్యుడొకడు మధుగారికి ఫోన్ చేసి, తమ సమస్యను విన్నవించుకుని, మళ్ళీ సమావేశం ఏర్పాటు చెయ్యమని కోరారు. మధుగారు ఫోన్‌లో ఆ వ్యక్తిని బాగా మందలించారు.

కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో సభ్యునిగా ఉన్న కాలంలో కమ్యూనిస్టుపార్టీ నేతలు చాలామందితో కలిసి మధుగారు పనిచేశారు. స్వాతంత్ర్యోద్యమానికి వెన్నుపోటు పొడిచి బ్రిటిష్ వారికి విధేయులుగా సామ్యవాదులు పని చెయ్యటం అనేది యువకుడైన మధుగారి మనసుపై గాఢమైన ప్రభావాన్ని చూపింది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో ఉంటూ అక్కడ వారు ఎలా గలాటా చేసేవారో, మాస్కో యింకా లండన్‌లలో ఉన్న తమ అగ్రనాయకుల మాటలు విని, స్వాతంత్ర్యసమర యోధులని ఏ విధంగా విమర్శించేవారో చూసాక సామ్యవాదుల పట్ల మధుగారి మనస్సు విరిగిపోయింది. తత్ఫలితంగా అతను కమ్యూనిస్టు పార్టీ మాటలు, చేతలు (కమ్యూనిస్ట్ పార్టీ కథనీ ఔర్ కరనీ) అనే గ్రంథం వ్రాసారు. కమ్యూనిస్ట్ పార్టీప్రచురించిన యింకా రహస్యంగా వుంచిన దస్తావేజుల ఆధారంగా రాసిన ఈ పుస్తకంలో వారి ద్వంద్వవైఖరిని ఎండగట్టారు. రాజకీయాల్లో ఉన్నవారు ఈ పుస్తకాన్ని పాఠ్యపుస్తకంగా పఠించాలని జయప్రకాశ్‌గారు ఒకసారి అన్నారు. స్వాతంత్ర్యానంతరం కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన రణదివె అండ్ కంపెనీ హింసాత్మక

విప్లవ పద్ధతులను విడనాడి ప్రజాస్వామ్య పద్ధతులలో పనిచెయ్యడానికి నిశ్చయించుకున్నప్పుడు మధు గారితో వారికి మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. కమ్యూనిస్ట్ పార్టీ విడిపోయిన తరువాత భారతీయ కమ్యూనిస్ట్ పార్టీ కాంగ్రెస్‌తో కలిసి పనిచెయ్యడం మొదలుపెడితే, మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ ప్రతిపక్ష పార్టీ పాత్రను సమర్థంగా నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఆ క్రమంలో సోషలిస్టులతో వారి సంబంధాలు మెరుగుపడ్డాయి. ఎమర్జెన్సీ సమయంలో మార్క్సిస్టులకు కూడా కాంగ్రెస్ ధోరణి ఆశాభంగం కలిగించింది. 1980లో ఇందిరాగాంధీ తిరిగి అధికారంలోకి వచ్చినప్పుడు భారతీయ కమ్యూనిస్ట్ పార్టీ కూడా కాంగ్రెస్ జోడీని విడిచిపెట్టి స్వతంత్రమార్గాన్ని అనుసరించింది. తత్ఫలితంగా వామపక్షాల మధ్య దూరం తగ్గి కాంగ్రెస్ వ్యతిరేక, భాజపా వ్యతిరేక కూటమి ఏర్పడడానికి ఆస్కారం ఏర్పడింది.

సామ్యవాద పార్టీల నేతలందరితోనూ మంచి స్నేహ, సంబంధాలున్నప్పటికీ మధులిమాయె గారు వారి విధానాలని తన వ్యాసాలలో విమర్శిస్తూ ఉండేవారు. భారతీయ కమ్యూనిస్ట్ పార్టీ కంటే మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధాంతపరమైన పిడి వాదపు పార్టీ అని మధుగారి అభిప్రాయం. వారు మూర్ఖంగా సిద్ధాంతాలను పట్టుకు వేలాడబడడాన్ని ఆయన విమర్శించేవారు. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాలలో ఉంటున్న కమ్యూనిస్టులు శ్రామిక వర్గ నియంతృత్వం, హింసాత్మక విప్లవ మార్గాలు, కేంద్ర పార్టీ ఆధార విధానాలు మొదలయినవాటికి చెల్లు చీటీ పలుకుతూ ప్రకటన ఎందుకు చేయరని మధుగారి ప్రశ్న. నిజానికి వ్యవహారంలో ఈ సిద్ధాంతాలకు వాళ్ళెప్పుడో నీళ్ళొదిలేసారు. అతను సూపర్ స్ట్రక్చర్ కీ, యిన్‌ఫ్రాస్ట్రక్టర్ కీ మధ్య సందిగ్ధతను కూడా చక్కగా అర్థం చేసుకున్నారు. అంచేత అతను సామాజిక, సాంస్కృతిక, సమస్యలన్నీ కేవలం ఆర్థిక సమస్యలుగా చూడలేదు. రిజర్వేషన్లను అతను సమర్థించడం ఈ కొత్త దృష్టికోణం ఫలితమే అని చెప్పొచ్చు. అంతేకాదు కమ్యూనిస్ట్ నాయకత్వం ముసలిదైపోయిందనీ, యువతకు పగ్గాలు యిచ్చే విషయంలో వారు చాలా కఠినంగా ఉన్నారనీ కూడా అతను విమరించేవారు. కమ్యూనిస్ట్ పార్టీల మద్దతుదారులంతా బడుగు, బలహీన వర్గాలకు చెందినవారుకాగా నాయకులంతా మాత్రం అగ్రవర్ణాల వారే కావడం కూడా మధుగారి విమర్శకు కారణంగా వుండేది. కార్మికసంఘాల పట్ల కూడా మధుగారు

విమర్శ చేసేవారు. కార్మికసంఘాలు కేవలం ఉద్యోగుల జీతభత్యాల గురించి మాత్రమే మాట్లాడుతూ వారి బాధ్యతలు, ఉత్పత్తి తదితర అంశాల గూర్చి మాట్లాడకుండా, వారిని సోమరులుగా మార్చి తద్వారా ప్రైవేటీకరణకు ఆస్కారం కల్పిస్తున్నాయని అతని విమర్శ. GATT ఒప్పందం ప్రకారం ఏర్పడిన కొత్త వ్యవస్థకి మనం తల ఒగ్గాల్సి రావడానికి కారణం ఈ ఉద్యోగులు కార్యశీలత, ఉత్పాదన మీద సరైన దృష్టి పెట్టకపోవడమే.

'సోషలిస్ట్ కమ్యూనిస్ట్ ఇంటరాక్షన్ ఇన్ ఇండియా' అనే తన ప్రసిద్ధ పుస్తకంలో మధుగారు సోషలిస్టులు, కమ్యూనిస్టుల మధ్య సంబంధాల గురించి విశ్లేషిస్తూ ఇరువర్గాల మధ్య సయోధ్య ఏర్పర్చడానికి సలహా కూడా ఇచ్చారు. అతనేమన్నారంటే–

భారతదేశంలో సోషలిస్టు శక్తులకు కాలం చెల్లిపోతోంది. కమ్యూనిస్టులు తమ సిద్ధాంతాల వల్లంపన నుంచి బయటపడాల్సిన అవసరం ఉంది. సోషలిస్టులు తాము ఏపార్టీలో ఉన్నా అధికారం కోసం రాజకీయాలు చెయ్యడం మానుకోవాలి. ఈ రెండు వర్గాలు ఏకమై కొత్త రాజకీయాలు ప్రారంభం చేసి ప్రజాస్వామ్య సోషలిజం లేదా సోషలిస్టు ప్రజాస్వామ్యం ఆధారంగా పార్టీ స్థాపించకపోతే అసలు సోషలిజం అనేది మెల్లగా అదృశ్యమయిపోయే ప్రమాదం ఉంది.

గాట్ ఒప్పందం, వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ వలన ఏర్పడిన కొత్త పరిస్థితుల గురించి అతను కమ్యూనిస్టులు, సోషలిస్టులతో మాట్లాడుతూ ఈ విధంగా అన్నారు.

"వినియోగదారీ విధానం మీద ఆధారపడి నడిచే పాశ్చాత్య దేశాలకు బానిసలుగా బ్రతకకుండా ఉండటం పగటికల లాగానే ఉంది. విద్యాధికులు కూడా ఈ వినియోగదారీ సంస్కృతిని విడిచి పెట్టలేకపోతే భారత్ పశ్చిమ దేశాలకు, జపాన్‌కు సేవకురాలిగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది."

కమ్యూనిస్టులు సోషలిస్టులు బలమైన కూటమి ఏర్పడాలనీ, అది భారత రాజకీయాలను సమూలంగా మార్చివెయ్యాలనీ మధుగారు వాంఛించారు.

1989లో జనతాదళ్ రూపంలో ఏర్పడిన బలమైన కూటమి విచ్ఛిన్నమై నాలుగు ముక్కలై పోయిందని మధుగారికి చాలా బాధగా ఉండేది. 1979లో జనతాపార్టీ చీలిపోయిన తరుణంలో మధుగారు, అతని సహచరులు చరణ్‌సింగ్ గారి నేతృత్వంలోని కూటమిని సమర్థించి వారితో కలిసి పనిచెయ్యాలని

నిర్ణయించుకున్నప్పుడు అతను సోషలిస్టు ఆదర్శాలకు నీళ్ళొదిలి కులీన వర్గాలను సమర్థిస్తున్నారని అంతా విమర్శించారు. అతని తక్కిన సహచరులైన మధు దండవతె, సురేంద్ర మోహన్, చంద్రశేఖర్ మొదలైన వారంతా జనసంఘ్‌తో కూడిన జనతా పార్టీలో కొనసాగడానికి యిష్టపడ్డారు. వెనుకబడిన వర్గాలు, రైతులతో కూడిన కూటమి (లోక్‌దళ్) మాత్రమే భవిష్యత్తులో కాంగ్రెస్‌కు గట్టి ప్రత్యామ్నాయం కాగలదని మధుగారి విశ్వాసం. 79 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో లోక్‌దళ్‌కి తక్కిన జనసంఘ్ కూటమి, చంద్రశేఖర్, కాంగ్రెస్‌ల కూటమి మొదలైన కూటములకంటె ఎక్కువ సీట్లు లభించడం బట్టి అతని ఆలోచన నిజమేనని అర్థం అయింది. తరువాత కాలంలో ఈ లోక్‌దళ్ కూటమి ఆధారంగానే జనతాదళ్ నిర్మాణం జరిగింది. జనతాదళ్‌లో రైతులు, దళితులు, వెనుకబడిన కులాలే ప్రముఖపాత్ర పోషించారు. అది చాలా శక్తివంతమైన కూటమి. దానికి ఎంతో భవిష్యత్తు ఉండి ఉండేది. జనసంఘ్ వర్గాన్ని తప్పించి తక్కిన వర్గాలన్నీ ఈ కూటమిలో విలీనమయ్యాయి. వామపక్షాలు, భాజపాతో కలిసి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పర్చాయి. కానీ దురదృష్టవశాత్తూ జనతాదళ్ నాయకత్వం తన ప్రాధమ్యాల విషయంలో స్పష్టత కనబరచలేకపోయింది. పార్టీ కూటమిని బలోపేతం చెయ్యడానికి బదులు చీలికల బాట పట్టింది. విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న మధులిమాయెకి అతను కేవలం పదవుల పంపకం, కమిటీలు వెయ్యడం వంటి కార్యక్రమాల్లో నిమగ్నమవడం నచ్చలేదు. అతను పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రయత్నించడం లేదనీ, దృఢమైన నిర్ణయాలు తీసుకోవటం లేదనీ మధుగారు విమర్శించేవారు.

ప్రభుత్వం నుంచి దేవీలాల్ బయటకు వెళ్ళిపోయిన తరువాత అతన్ని దెబ్బ కొట్టడానికి మండల్ కమీషన్ రిపోర్టును అమలు చెయ్యాలనే నిర్ణయం తీసుకోవడం, బాబ్రీమసీదు, రామమందిరం విషయంలో యిరువర్గాలతోనూ ఎదురెదురుగా కూర్చోబెట్టి రాజీ చేసే ప్రయత్నం చెయ్యకుండా వారితో విడివిడిగా మాట్లాడుతూ వుండడం, భాజపా రథయాత్రలు చేస్తున్న సందర్భంలో కూడా ధార్మిక వాతావరణం దెబ్బతింటోన్న సంగతి పట్టించుకోకుండా కలయికలు, చీలికల పైనే దృష్టి పెట్టడం, తన పార్టీకే చెందిన ముఖ్యమంత్రి ములాయమ్‌సింగ్ యాదవ్‌కి తెలియకుండా భాజపా, విశ్వహిందూ పరిషత్‌లతో మంతనాలు జరుపుతూ ఉండడం వంటి

పనులను మధుగారు విమర్శించారు. భాజపా మద్దతు ఉపసంహరించుకొన్నప్పుడు వి.పి.సింగ్ రాజీనామా చేసి ఎన్నికలు జరపమని రాష్ట్రపతికి సిఫారసు చేసి ఉండాల్సిందని మధుగారి ఆలోచన. కానీ అలా చేస్తే అన్ని రాజకీయ పక్షాలు ఎన్నికల తయారీలో తలమునకలవుతాయని అయోధ్య తుఫానుని అణచివేయవచ్చని అతని ఆలోచన. కానీ వి.పి.సింగ్ అలా చేయకుండా బలనిరూపణ కోసం రెండు వారాల గడువు అడిగారు. అంతేకాకుండా అతను ములాయం సింగ్‌ని బలిపశు వుని చేస్తూ భాజపా నుంచి మళ్ళీ మద్దతు కూడగట్టే ప్రయత్నం కూడా చేశారు. కానీ ఈ కుట్రసంగతి తెలుసుకున్న ములాయంసింగ్ జనతాదళ్ నుంచి విడిపోవడంతో వి.పి.సింగ్ ప్రభుత్వం కూలిపోయింది. జనతాదళ్ రెండు ముక్కలుగా చీలిపోయింది.

ప్రధానమంత్రి అయ్యాకనే చంద్రశేఖర్ మధుగారికి సన్నిహితుడయ్యాడు. అంతకుముందు వారిద్దరి మధ్య దూరమే ఉండేది. అది జనతాపార్టీ రోజుల్లో ఏర్పడిన దూరం. ఆ రోజుల్లో చంద్రశేఖర్, మొరార్జీదేశాయ్ వర్గంలో ఉంటూ జనసంఘ్ వర్గానికి దగ్గరగా ఉండేవారు. మధులిమాయెగారు జనసంఘ్ ద్వంద్వనీతిని విమర్శిస్తూ చరణ్‌సింగ్‌గారి అధ్వర్యంలో అన్నింటికంటె శక్తివంతమైన కూటమిని నిర్మిద్దామని ప్రయత్నిస్తే అతన్ని జనతాపార్టీని చీల్చారని నిందించేవారు. మధులిమాయెగారు మొరార్జీదేశాయ్ ప్రవేశపెట్టిన పార్టీ ఫిరాయింపు నిరోధ చట్టానికి సంబంధించిన బిల్లుని వ్యతిరేకించకపోతే, బిల్లు పాస్ అయి చట్టంగా మారి వుండేదనీ, లోక్‌దళ్ విడిపోయి ఉండేది కాదనీ అంతా అనుకున్నారు. ఇదే బిల్లుని ఇందిరాగాంధీ ప్రవేశపెట్టినపుడు విపక్షాలన్నీ ముక్తకంఠంతో వ్యతిరేకించాయి కనుకనే మధుగారు దాన్ని మొరార్జీగారి సమయంలో కూడా వ్యతిరేకించారు. చివరకు రాజీవ్‌గాంధీ కాలంలో ఈ బిల్లు పెట్టినప్పుడు కూడా మధుగారు వ్యతిరేకిస్తే ప్రతిపక్షాలన్నీ అతన్ని ఆకాశానికెత్తేస్తూ పొగిడాయి. ఇప్పుడంతా ఈ చట్టాన్ని మార్చాలని మాట్లాడుతున్నారు గానీ అప్పట్లో యిదే విషయానికి మధుగారిని విమర్శించారు. ఈ చట్టాన్ని గట్టిగా సమర్థించిన నాని పాల్కీవాలా, గిరిలాల్ యిద్దరూ తరువాత కాలంలో తమ వలన తప్పు జరిగిందని మధుగారి ముందు ఒప్పుకున్నారు. ఇటువంటి చట్టం వలన అసమ్మతి తెలిపే అధికారం పోతుందనీ, అది ప్రజాస్వామ్యానికి సంకెళ్ళు వెయ్యడమేననీ, యిటువంటి చట్టం వలన

ఫిరాయింపులు ఆగవు సరికదా మూక ఫిరాయింపులను ప్రోత్సహించినట్టు అవుతుందనీ భావించి మధుగారు ఈ బిల్లుని వ్యతిరేకించారు. గత పదేళ్ళలో ఈ బిల్లు కారణంగా జరిగిన ఫిరాయింపులు, విధానసభల్లో ఉత్పన్నమైన అరాచకత్వం చూస్తేనే మధుగారి ఊహ ఎంత నిజమో అర్థం అవుతుంది.

ప్రాంతీయ పార్టీలతో కలిసి బలహీన కూటములు ఏర్పాటు చెయ్యడం గురించి జనతాదళ్ నేతలు మాట్లాడితే మధుగారికి కోపం వచ్చేది. జాతీయ పార్టీలు నాశనం అయిపోతుండడం, ప్రాంతీయ పార్టీలు అభివృద్ధి చెందుతూ ఉండడం అతనికి బాధ కలిగిస్తూ ఉండేది. ఎవరైనా సోషలిస్టు పార్టీని పునరుద్ధరించడం గురించి మాట్లాడినా అతనికి కోపం వచ్చేది. "టికెట్ కోసం ఆశపడకుండా నిస్వార్థంగా సేవ చేసే 50 మంది వ్యక్తులు ఢిల్లీ అంతా వెతికినా దొరకరు. అలాంటప్పుడు సోషలిస్టు ఉద్యమం ఎలా నడుస్తుంది? శవానికి ప్రాణం పొయ్యడం సాధ్యం కాదు" అనే వారతను. కానీ జనతాదళ్‌కి చెందిన అన్ని వర్గాలు ఏకమై కమ్యూనిస్టులు, సోషలిస్టులు కలిసి విస్తృతమైన సోషలిస్ట్ డెమొక్రటిక్ పార్టీ ఏర్పడాలని అతను ఆశించారు. కానీ ఏదైనా కొత్త ఉద్యమాన్ని చేపట్టడం కొందరు వ్యక్తుల వలన అయ్యే పనికాదని అతను తరచూ అంటూ ఉండేవారు. తగిన పరిస్థితులు ఏర్పడి, వాతావరణం వేడెక్కినపుడు అందులోంచి ఉద్యమాలు పుడతాయి అని ఆయన భావన.

# ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటాలు
# కొన్ని జ్ఞాపకాలు

**- వినోద్ కొచ్చర్**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁂

**భా**రత రాజకీయాల గురించి తెలిసినవారికి మధుగారిని పరిచయం చెయ్యనక్కరలేదు. ప్రముఖ సోషలిస్టు ఆలోచనాపరుడు, నేత, లోక్‌సభ సభ్యుడు అయిన డా॥ రామ్ మనోహర్ లోహియాగారి నేతృత్వంలో లోక్‌సభలోనూ, బయట, వీధుల్లోనూ భారత రాజకీయాల్లో సోషలిస్టు బీజాలను నాటిన నిజమైన దేశభక్తుడు మధులిమాయె.

గాంధీజీ పిలుపు మేరకు కాలేజి చదువుని విడిచిపెట్టి 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలోకి దూకడం ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన మధుగారు 1975 ప్రథమారం వరకు సలిపిన పోరాటాలన్నింటిని గురించి ఆర్.ఎస్.ఎస్.లో తలమునకలుగా ఉన్నప్పటికీ నా అధ్యయన శీలత వలన నేను చదివాను, విన్నాను.

కానీ 1975-77 మధ్యకాలంలో జైలు ఊచల వెనుకనుంచే తన మాటల ద్వారానే కాక చేతల ద్వారా కూడా ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా అతను సల్పిన

పోరాటాలకు నేను ప్రత్యక్షసాక్షిని. అతని సాన్నిధ్యంలో నేను కూడా సోషలిస్టుగా మారిపోయాను.

1975 ఆగస్టు 25వ తారీఖున నన్ను బాలాఘాట్ జైలు నుంచి 1976 సెప్టెంబరు 7న మధుగారిని రాయ్‌పూర్ జైలునుంచి నరసింహగడ్ జైలుకు మార్చడం జరిగింది. 21 మార్చ్ 1977 వరకు నన్ను, 14 నవంబర్ 1976 వరకు నరసింహగఢ్ జైలులోనే ఉంచారు. ఆ విధంగా 14 నెలలపాటు నిరంతరం జైలులో మధుగారి సాన్నిధ్యంలో గడిపాను.

ఈ పద్నాలుగు నెలల కాలంలో మధుగారు తన ఆలోచనలు, రాతలు, చేతల ద్వారా ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా అనేక విధాలుగా పోరాడారు.

అప్పటి ప్రధానమంత్రి ఇందిగాంధీగారు లోక్‌సభ అవధిని ఒక ఏడాది పాటు పెంచుతూ తీసుకున్న అప్రజాస్వామిక నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మాటల ద్వారా, చేతల ద్వారా తమ వ్యతిరేకతను వ్యక్తం చేసినందుకుగాను ఖైదు చేయబడ్డ ప్రతిపక్ష సభ్యులందరికీ మధుగారు 25 డిసెంబరు 1975న తన భార్య చంపగారి ద్వారా ఒక ప్రకటన పత్రాన్ని పంపారు. అందులో ఆయన ఏమని రాసారంటే, "అనైతిక పద్ధతిలో లోక్‌సభ అవధిని ఒక ఏడాది పొడుగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించే సభ్యులందరూ 1976 మార్చి 18 తర్వాత తమ సభ్యత్వాలకు రాజీనామా చేస్తూ ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించండి."

ఆ పత్రంలో మధుగారు ఇంకా యిలా రాశారు. "లోక్‌సభ అవధి ఈ రకంగా అనైతికంగా పెంచడం అంటే వ్యక్తిస్వామ్యం పూర్తిగా నియంతృత్వంగా మారిందని అర్థం. అనైతికంగా ఇలా అధికారంలో కొనసాగడం అంటే ప్రజలు స్వేచ్ఛగా ఉద్యమాలకు విధించిన పరిమితులు ముగిసిపోయాయని అర్థం. ఉద్యమాలను సమర్థించేవారు ప్రస్తుతం రెండు వర్గాలుగా విభజించబడాలి. మొదటి వర్గంలో వుండేవారు సాంప్రదాయిక సహాయ నిరాకరణ మార్గాన్ని అనుసరించండి. రెండవ వర్గంలో 1942 మాదిరి హత్యలు, గాయాలు లేని పద్ధతిని అవలంబించేవారు వుండాలి. సహాయ నిరాకరణ మార్గాన్ని అనుసరించేవారే సంఘర్ష సమితి అనే పేరును ధరించండి. తక్కినవారంతా అజ్ఞాతంలో ఉంటూ ప్రచురణ సంస్థలు, పత్రికలు, ప్రసార మాధ్యమాలు తదితర మార్గాలలో పనిచెయ్యాలి. ఈ

రెండు వర్గాల విధానాలను కలగలపడం వలన ప్రయోజనం లేదు. దాని వలన అనవసరమైన సందిగ్ధత ఏర్పడుతుంది. సమానత్వానికీ, స్వాతంత్ర్యాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ ప్రేమించే ప్రతీ కార్యకర్తా తన మార్గాన్ని స్వేచ్ఛగా ఎన్నుకోవాలి. అదేవిధంగా పరస్పర విమర్శలు, కఠినత్వం లేకుండా తన నిర్ణయాన్ని అమలు చెయ్యాలి."

తన ఈ మాటలను చేతల్లోకి మారుస్తూ 1976 మార్చి 8న మధుగారు తన చరిత్రాత్మక రాజీనామా పత్రాన్ని సమర్పించడంతో 1976 మార్చి 18న లోక్‌సభ సభ్యత్వానికి అతని రాజీనామా ఆమోదించబడింది. మధుగారి హృదయంలో చెలరేగుతున్న ఘర్షణ తాలూకు ఈ గాంధేయ మార్గాన్ని కేవలం యువసభ్యుడైన శరద్ యాదవ్ మాత్రం అనుసరించి 1976 మార్చి 14న – ఇందిర జైలునుంచి తన లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా లేఖను పంపించాడు.

అప్పుడు స్వయంగా లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌తో సహా అనేకమంది ప్రజాస్వామ్య సమర్ధకులు మధుగారికీ, శరద్‌గారికీ లేఖలు రాసి వారి ఈ సాహసకృత్యాన్ని అభినందించారు.

ఒక ప్రక్క మధుగారు ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ గాంధీ/ లోహియా మార్గంలో పోరాడమని దేశవాసులకు పిలుపునిస్తూ ఉంటే మరో ప్రక్క నిషేధానికి గురైన ఆర్.ఎస్.ఎస్.నాయకులు జైళ్ళలో బందీలుగా ఉన్న తమ స్వయం సేవకులను విడిపించుకోవడానికి వినోబాభావే గారికీ, శ్రీమన్నారాయణగారిని లేఖలు రాయమని వేడుకోసాగారు.

సంఘ్ అప్పటి సర్‌సంఘ్‌చాలక్ శ్రీ బాబాసాహెబ్ దేవరస్‌గారయితే ఎరవాడ జైలునుంచి మోకరిల్లుతూ శ్రీమతి ఇందిరాగాంధీకి "ఇందిరా శరణమ్ గచ్ఛామి" అనే భావంతో లేఖ రాస్తూ శ్రీ జయప్రకాశ్ నారాయణ్‌గారి ఉద్యమంతో తమకేమీ సంబంధం లేదని ఆమెకి నమ్మకం కలిగించడానికి విఫలయత్నం చెయ్యసాగారు. కానీ నిజానికి తనని రాజీనామా చెయ్యమని అడుగుతూ లేవనెత్తిన ఉద్యమానికి నాయకునిగా ప్రముఖ ఆర్.ఎస్.ఎస్. నాయకుడు శ్రీ నానాజీ దేశ్‌ముఖ్ గారే ఎన్నుకోబడ్డారనీ శ్రీమతి ఇందిరాగాంధీకి కూడా తెలుసు.

అప్పటి జనసంఘ్ ప్రముఖ నాయకుడు శ్రీ లాల్‌కృష్ణ అద్వానీగారు ఏం చేస్తున్నారు? ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించమని శ్రీమతి గాంధీకి ఎలాంటి

విన్నపాలూ చెయ్యకుండా, షరతులు విధించకుండా రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థిగా నిలబడి రాజ్యసభ సభ్యునిగా నిరుపయోగంగా చేతులు ముడుచుకు కూర్చున్నారు.

మధుగారు జైల్లో ఉంటూనే తన సత్యాగ్రహ పద్ధతుల్లో పోరాటాలు సాగించారు.

జైల్లో మధుగారు తన ట్రాన్సిస్టర్‌ని మంటల్లో వేసి జరిపిన పోరాటం కథ ద్వారా ఎమర్జెన్సీ కాలంలో అధికారులు ఎంతకి బరితెగించారో, చట్టాన్ని అతిక్రమిస్తూ ఎంతగా అధికార దుర్వినియోగం చేసారో తదితర విషయాలతో పాటు ఒక జైలర్ మధుగారిని గౌరవ మర్యాదలతో చూసుకోవాల్సింది పోయి, కలెక్టర్, జైళ్ళశాఖ ఐ.జి.గారి ఆదేశాలను బేఖాతరు చేస్తూ తన ఉద్యోగాన్ని పోగొట్టుకోవడానికి కూడా సిద్ధపడడం, ఆ జైలర్‌ని మధుగారు కరుణాదృష్టితో చూడడం అర్థం అవుతాయి.

ఈ కథంతా నా జైలు డైరీలో 1976 మార్చి 21వ తేదీన రాసిన పుటలో పొందుపరిచాను. ఇది ఎంత అద్భుతమైన వ్యవహారమంటే దీనిని ప్రత్యేకంగా ప్రచురించాల్సి ఉంటుంది. జైలునుంచి మధుగారు ఇందిరాగాంధీగారికి రాసిన లేఖలు కూడా లేఖాయుద్ధానికి తక్కువేమీ కావు. ఉదాహరణకు మధుగారు ఇందిరాగాంధీకి రాసిన ఒక చిన్న లేఖను చూద్దాం. ప్రధానమంత్రి అజ్మీర్‌యాత్ర సందర్భంగా ఈ లేఖ రాయడం జరిగింది. లేఖా విషయం - గులాబీ రహదారి.

మధుగారు ఇలా రాస్తున్నారు.

"సర్కారు చొరవతో సమాచార వ్యవస్థలన్నీ ఏకమై 'సమాచార ఏజన్సీ' ఏర్పడడం వలన దానిని 'అర్ధ సర్కారీ ఏజన్సీ' అనడం తప్పేమీ కాదనుకుంటాను. అది క్రింది వార్తను ప్రచురించింది. 'ప్రధానమంత్రిగారి కోసం గులాబీ రహదారి.

ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీగారి 1976 అక్టోబర్ 24 అజ్మీర్ యాత్ర సందర్భంగా ఆమె కోసం గులాబీలు పరిచిన రహదారి ఏర్పాటు చెయ్యబడుతోంది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ప్రధానమంత్రి స్వాగతం కోసం 251 స్వాగత ద్వారాలు ఏర్పాటు చెయ్యాలనే నిర్ణయం తీసుకోవడం జరిగింది. (నవభారత్, భోపాల్, 15-10-76).

మొగల్ - ఎ- అజమ్ కూడా అజ్మీర్‌యాత్ర మండుటెండలో ఉత్తికాళ్ళతో చేసేదని చెప్తారు. తెల్లవారి పెద్దదొరగారి కోసం కూడా ఇంచుమించు యిటువంటి

స్వాగతమే దొరికి ఉంటుంది. అటువంటప్పుడు మూడింట రెండొంతులు పేదప్రజలే ఉన్న రంగుల ప్రపంచానికి చెందిన నేత కోసం ఇంత ఆర్భాటపు అభద్ర ప్రదర్శన ఎందుకు? పూలు చెట్లకున్నప్పుడు అందంగా ఉంటాయి. ప్రజలు పూలను దేవుళ్ళకు అర్పిస్తారు. అలంకరణకు కూడా అవి బాగుంటాయి. మన దగ్గర మహిళలు పూలు శిరోజాలంకరణకు ఉపయోగిస్తారు. నా ఉద్దేశ్యంలో పూలరాదారిలో తమరు, తమ సహచరుల శోభాయాత్రకు వెడలడం తమకు కూడా అంగీకారం కాకపోవచ్చు. అంచేత ఇలాంటి మూర్ఖులనుంచి తమరిని రక్షించమని ఆ భగవంతునికి నా ప్రార్థన.

తమరి

**మధు లిమాయె"**

భయభ్రాంతులై పోయిన ప్రజలని పత్రికలవారినీ నిబ్బరంగా చెయ్యాలనే సదాశయంతో స్వాతంత్ర్య పోరాట కాలంనాటి గాంధీగారి చరిత్రను కూడా మధుగారు పరిశీలించారు. మహాత్మాగాంధీగారి సంపూర్ణ వాఙ్మయం నుంచి మధుగారు అనేక ఉపన్యాసాలను ఎంచి ప్రచురింపచేసి, తద్వారా ఎమర్జెన్సీ సమయంలో భయభ్రాంతులై పోయిన ప్రజల గుండెల్లో ధైర్యం నింపాలనీ అదే విధంగా భావప్రకటనా స్వేచ్ఛకోసం త్యాగాలకు సిద్ధపడాలనీ పత్రికారంగానికీ తెలియ చెప్పాలనీ అతను భావించారు.

మధుగారి వ్యాఖ్యానాలతో కూడిన ఈ గాంధీగారి ప్రసంగాలను శ్రీ ఎన్.జి. గోరెగారు (తరువాత జనతా ప్రభుత్వ కాలంలో అతను బ్రిటన్‌కి హైకమీషనర్‌గా ఉన్నారు) తన 'పీపుల్' పత్రికలో 'Collected works of Mahatma Gandhi' అనే శీర్షికన ప్రచురించారు.

ఆకాశంలో మిణుకు మిణుకు మంటున్న లెక్కలేనన్ని చుక్కల మధ్య, వేళ్ళపైన లెక్క పెట్టగలిగే మిణుకు మిణుకు మనకుండా నిశ్చలంగా ప్రకాశిస్తూ ఉండే గ్రహాలను కూడా మధుగారు ఇట్టే గుర్తు పట్టేవారు. నా ఉద్దేశ్యంలో మధుగారు తారల్లాంటి సహచరులకంటె, గ్రహాలవంటి సహచరుల కోసం అన్వేషిస్తూ ఉండేవారు. వారైతే అనుకూల పరిస్థితుల్లోనూ, ప్రతికూల పరిస్థితుల్లోనూ తమ ఆదర్శాలతో రాజీపడరని ఆయన అభిప్రాయం.

అతని వ్యక్తిత్వానికి సంబంధించిన ఈ ప్రముఖమైన అంశాన్ని వ్యక్తపరచడానికి నేను జైల్లో హెూలీ జరిపిన సందర్భంలో వారికోసం ఈ విధంగా రాశాను.

కలలు కల్లలౌతాయి, సన్నిహితులు దూరమౌతారు.

యోగుల జీవితంలో, కఠిన పరీక్షలు ఎదురౌతాయి.

సుదీర్ఘమైన కాళరాత్రి ఇది, కానీ నేను దీనికి భయపడను.

మినుకు మినుకుమనే చుక్కల్లోంచి నేను గ్రహాలను వెదికి పట్టుకుంటాను.

ఇప్పటికీ మధుగారు తన వ్యాసాలు, చేతల ద్వారా సోషలిస్టు ఉద్యమకారులకు దారి చూపుతూ ఇలా అంటున్నారు.

కొండల్లో, పర్వతాల్లో ఈ రోజుకీ నిర్భయంగా శంఖం ఊదుతూ

నడుస్తున్నా. నేను ఆరిపోలేదు.

మధ్యాహ్న సూర్యుడిని ఆలింగనం చేసుకుని ప్రకాశిస్తున్నాను.

# మధు గారు ఇప్పుడు బ్రతికి ఉంటే...

**- అనిరుధ్ లిమాయె**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁂ ⁂ ⁂

బ్రతికి ఉంటే మధుగారికి మే1, 2022 వేళకి నూరేళ్ళ వయస్సు. బహుశా నేను ఈ కార్యక్రమంలో పాలు పంచుకోలేకపోవచ్చు. అంచేత ఈ సందర్భంగా ప్రచురించబడుతున్న స్మారక సంచిక కోసం ఒక చిన్న వ్యాసం రాస్తున్నాను.

ప్రస్తుతం జీవించి ఉంటే మధుగారు ఇప్పటి పరిస్థితుల గురించి ఏం ఆలోచించి ఉండేవారు, మాట్లాడేవారు, రాసేవారు, ఏం చేసేవారు? అని నేను ఆలోచిస్తున్నాను.

నా ఈ అభిప్రాయాలు మూడు నమ్మకాల మీద ఆధారపడి ఉన్నాయి. మొదటి నమ్మకం ఏమంటే... మధుగారి బుద్ధి, జ్ఞాపకశక్తి. అతని అంతిమ దినాలలో కూడా ఎంత నిశితంగా ఉన్నాయో ప్రస్తుతం కూడా అంతే నిశితంగా ఉండి ఉండేవి. రెండవ నమ్మకం (బహుశ ఇది కల కూడా కావచ్చు). ఆఖరి దినాలలో అతని ఆరోగ్యం బాగులేక మనిషిని నిస్సత్తువ ఆవరించిన మాట

నిజమే గానీ ప్రస్తుతం బ్రతికి ఉండి ఉంటే మాత్రం అతను ఎంతో ఆరోగ్యంగా ఉండి ఉండేవారు, దేశమంతా తిరిగి, ప్రజలతో మాట్లాడి, వాళ్ళకు నచ్చజెప్పి పార్టీని మరింత బలోపేతం చేసి ఉండేవారు. మూడవ నమ్మకం ఏమంటే నాకు అతని (అంటే మా తండ్రిగారి) ఆలోచనల గూర్చి చాలా బాగా తెలుసు. అంచేత ఈ రోజున బ్రతికి ఉంటే అతను ఏం ఆలోచన చేసి ఉండేవారు, ఏం చేసి ఉండేవారు అనే విషయాన్ని బాగా వివరించగలను. ఆ అర్హత నాకు ఉంది.

నేను రాసేదే సరైనది, మధుగారు అదేవిధంగా ఆలోచించి ఉండేవారు, చేసి ఉండేవారు అని నేను కచ్చితంగా చెప్పలేను గానీ, నేను అతన్ని బాగా దగ్గర నుంచి ఎరుగుదును, అనేక విషయాలపై అతనితో చర్చించాను, వాదించాను అని చెప్పగలను. అంచేత నా ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమంటే మధుగారి ఆలోచనల గూర్చి నేను వ్యక్తపరిచిన అభిప్రాయాలను గూర్చి అందరూ లోతుగా, నిండు మనసుతో ఆలోచించి, చర్చించి, సమస్యలకు సరైన పరిష్కారం అన్వేషించే దిశగా ప్రేరితులవ్వాలని నా ఆశ.

మధుగారు దేశ ఐక్యత, సమగ్రతల కోసం, అదేవిధంగా దేశ ప్రజలందరి ప్రయోజనాలను పరిరక్షించే ఒక చక్కని, ప్రజాస్వామిక పాలనా వ్యవస్థ కోసం ఎల్లప్పుడూ తపించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, డా. బాబాసాహెబ్ అంబేద్కర్ తదితరులు అటువంటి పరిపాలనా వ్యవస్థ కోసమే పటిష్టమైన రాజ్యాంగాన్ని రచించారనేది మధుగారి నిశ్చిత అభిప్రాయం.

ఈ ప్రభుత్వం అణచివేతలకు పాల్పడే ప్రభుత్వం కాకూడదనీ, ప్రజాప్రయోజనాలను పరిరక్షించే ప్రభుత్వంగా ఉండాలని అతను ఆకాంక్షించారు. ముఖ్యంగా బడుగు, బలహీనవర్గాల వారసత్వాన్నీ, యితర హక్కులనూ కాపాడే విధంగా ఉండాలనీ, అందరినీ అభివృద్ధి మార్గంలో తీసుకెళ్ళే విధంగా ఉండాలనీ వాళ్ళ మతం, జాతి, భాష, వర్గం మొదలైన వాటితో సంబంధం లేకుండా అందరినీ సమానంగా ప్రగతిపథంలోకి తీసుకెళ్ళాలనీ అతను వాంఛించారు. కానీ యివాళ చూస్తే సంఘ్ పరివార్ సంస్థలు, రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ ఉన్న భాజపా ప్రభుత్వాలు ఎన్నికల్లో తమ బలాన్ని చూసుకుని ఆశ్చర్యంతో రాజ్యాంగం,

ప్రజాస్వామిక ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన ఈ అంశాలను బలహీనపరచడానికి ఆయత్తమౌతున్నాయి.

ఉపనిషత్తుల నుంచి, కబీర్, నానక్ మొదలైన సంత్‌ల వరకు, అలాగే అక్బర్ చక్రవర్తి, దారాసికో, ఛత్రపతి శివాజీ మొదలు స్వామి వివేకానంద, మహాత్మాగాంధీ వరకు ఈ దేశ సంస్కృతి అనేక రకాలైన ఆలోచనలను, మత సంప్రదాయాలను స్వీకరించి, సర్వమతాలను, ధర్మాలను సమానంగా ఆదరిస్తూ వస్తోంది. ఈ మతపరమైన సహనంలోనే దేశ క్షేమం యిమిడి ఉంది. మధుగారు కూడా ఈ సమానత్వాన్నీ, సహనాన్నీ సమర్థించారు. అంతేగానీ అవకాశవాద రాజకీయాలు చేస్తూ అల్ప సంఖ్యాక వర్గాలనో, అధిక సంఖ్యాకులనో సంతృప్తి పరచడం అతనికి యిష్టం ఉండేది కాదు.

మధుగారు ఏ విషయం పైన గానీ, సమస్య గురించి గానీ లోతుగా తెలుసుకోకుండా, సమగ్రంగా ఆలోచించకుండా, ప్రజలతో చర్చించకుండా ఏమీ మాట్లాడేవారు కాదు. ఏ నిర్ణయం తీసుకునేవారు కాదు. ప్రజల మనోభావాలను సవాలు చెయ్యకుండా, వారికి వాస్తవాలు చెప్పి ఒప్పించేందుకు ఆయన ప్రయత్నించేవారు. అతను స్వయంగా నాస్తికుడు, పూజలు, గట్రా నమ్మని వ్యక్తి అయినప్పటికీ అతను ప్రజల మత విశ్వాసాలను గౌరవించేవారు. అన్ని రకాల మత సంప్రదాయాలను బాగా ఎరిగి ఉండేవారు. అంచేతనే అతను ఎన్నడూ ఏ మత సంప్రదాయాలనూ విమర్శించేవారు కాదు. సరికదా, వాస్తవాలను, భారతీయ పరమత సహనాన్ని ఆధారంగా చేసుకుని ఛాందసవాదాన్నీ, మతమౌఢ్యాన్నీ తిప్పి కొట్టే ప్రయత్నం చేసేవారు.

అతను మరణించిన మరుసటి దినం పత్రికలలో ప్రచురింపబడిన అతని వ్యాసంలో కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే దేశంలో మత విద్వేషాలకు వ్యతిరేకంగా సమర్థంగా పోరాడగలదని చెప్తూ, అతను కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను పార్టీని పునరుజ్జీవింపచెయ్యమని అభ్యర్థించారు. స్వాతంత్ర్యానికి పూర్వపు పార్టీ విధానాలను అవలంబించమని అతను వారిని కోరారు. ప్రస్తుతం జీవించి ఉంటే మధుగారు కాంగ్రెస్‌ను పునరుజ్జీవింప చెయ్యడానికి ప్రయత్నించడమే కాక మత ఛాందసవాద వ్యతిరేక పార్టీలన్నింటిని ఒక కూటమిగా సంఘటితపరిచే ప్రయత్నం

తప్పక చేసేవారు. అటువంటి కూటమి సామాజిక, ఆర్థిక న్యాయం సాధించే దిశగా పని చేసేందుకు ఆయ సలహాలు యిచ్చి ఉండేవారు. ముఖ్యంగా సామాజిక న్యాయం కోసం తేవాల్సిన మార్పులపై ఆయన ఆలోచించి ఉండేవారు.

అతను కేవలం పై స్థాయి, ఎన్నికల రాజకీయాల మీద ధ్యాస పెట్టకుండా ప్రతిపక్ష పార్టీల నిర్మాణంలో పాలుపంచుకుని, సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం ఉద్యమాలు చేసే దిశగా ప్రోత్సాహం యిచ్చేవారు. ఎందుకంటే ఈ రెండు సమస్యలను పరిష్కరించే దిశగా ప్రజలను ఆకర్షితులను చేస్తే మత విద్వేషాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నిర్మించబడుతుందని ఆయనకు బాగా తెలుసు. యువతను, కార్యకర్తలను సత్ప్రవర్తన, అభ్యాసం, త్యాగం మొదలయిన విషయాలపై దృష్టి నిలిపే విధంగా ఆయన ప్రోత్సహించి ప్రతిపక్షాల సుదీర్ఘ పోరాటానికి తగ్గట్టుగా వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్ది ఉండేవారు.

తన నిశితమైన బుద్ధి, నిరంతర అభ్యాసం, నిష్కళంక చరిత్ర, ధీరత్వం, దృఢనిశ్చయాలతో అతను భాజపా ప్రభుత్వం, వారి కుట్రలు, విధానాలపై అతను వాస్తవాల సహాయంతో ప్రతిదినం దాడి చేసి, నరేంద్రమోదీ, అతని సహచరుల దేశభక్తితో కూడిన అవినీతి రహిత పాలన అనే ముసుగును తొలగించి ఉండేవారు. తద్వారా సంఘ పరివార్ తనని తాను సంరక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడి ఎన్నికల్లో గెలిచే అవకాశాలు తగ్గి ఉండేవి.

ఇలా మధుగారు ఏం ఆలోచించి ఉండేవారు. రాసి ఉండేవారు, చేసి ఉండేవారు అనే విషయాలు చెప్పాలంటే పెద్ద గ్రంథమే రాయాల్సి ఉంటుంది. ఒక్క విషయం మాత్రం నిజం. ఆయన అన్యాయం ముందు ఎన్నడూ తల ఒగ్గి ఉండేవారు కాదు.

## జీవితంతో సంభాషణ

**– మధు దండావతె**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁂

**నా** ప్రజా జీవితానికి మూల సిద్ధాంతాలేమిటి అని నన్ను నేను ప్రశ్నించు కున్నప్పుడు నా జీవితానుభవాల్లోనే బదులు దొరుకుతుంది. నా చెయ్యి ఒకటి నాకు జ్ఞానాన్ని ప్రసాదించిన పుస్తకాల మీద ఉంచి, రెండవది న్యాయం కోసం పోరాడే నా సహచరుల హృదయాలపై ఉంచి నేను నా ప్రజా జీవిత ప్రయాణాన్ని సాగించాను. అపారమైన జ్ఞానానికీ, ప్రజల మనోభావాల పట్ల సానుభూతికీ మధ్య ఉండే సంతులనమే మన ఆలోచనలకు, కర్మలకూ మార్గదర్శనం చేస్తుందని నా ప్రగాఢ నమ్మకం. జీవితంలో ఆదర్శాల పట్ల నిబద్ధత, అంకితభావం, దృఢనిశ్చయాలతో పాటు సంగీత, సాహిత్యాలు, కళల పట్ల అభినివేశం కలిగివుంటే జీవితంలోని మధురమైన క్షణాలని ఆస్వాదించగలుగుతాం. నా ఆలోచనలు, విశ్వాసాలు అన్నీ పోరాటం అనే కొలిమిలోంచి, నిర్మాణాత్మక కార్యాచరణ అనే చీలిక సుత్తి నుంచి, జ్ఞాన అన్వేషణ నుంచీ ఏర్పడ్డవే. మహా నాయకులతోనూ,

అదేవిధంగా అంకితభావం కలిగిన సాదాసీదా కార్యకర్తలతోనూ కల సన్నిహిత సంబంధాలు నన్నెంతో ప్రభావితం చేసాయి.

నా జీవితంలో వివిధ దశలలో నన్ను ప్రభావితం చేసిన ఆలోచనా ధోరణులను ఒకసారి స్మరించుకోవాలని ఉంది. నేను చాలా చిన్నతనంలోనే 'మార్క్స్' ని చదివేను. నిజానికి 'గాంధీ' ని ఆలస్యంగా చదివేనని చెప్పొచ్చు. ఆ తరువాత చాలా కాలానికి పూలే, అంబేద్కర్, బుద్ధుడు వంటి మానవీయ మూర్తుల ఆలోచనలను చదివి, ఆకళింపు చేసుకునే అవకాశం దొరికింది. అంచేత ముందు కొంతకాలం నా ఆలోచనల్లోనూ, కర్మల్లోనూ కొంత దురభిమానము, అసమతౌల్యం కానవచ్చేవి. కానీ క్రమేణా ఈ మహానుభావుల రచనలను నేను అధ్యయనం చేయడం ప్రారంభించాక నా ఆలోచనా విధానం సంతులితమైంది.

సమాజవాది ఉద్యమ నాయకుల నుంచి నేను చాలా నేర్చుకున్నాను. ఆచార్య నరేంద్రదేవ్‌గారి పాండిత్యం, పెద్దరికం, జె.పి.గారి పోరాటం, త్యాగం, సమాజ్‌వాది ఆలోచనా విధానం కోసం లోహియాగారి తాపత్రయం ...యివన్నీ నా ఆలోచనలకు, కర్మలకు కొత్త దిశనిచ్చాయి. ప్రజాజీవితంలో ఎస్.ఎమ్. జోషీగారి ఉత్కృష్ట వ్యక్తిత్వం పట్ల నాకు గౌరవం మెండు. ఎన్.జి. గొరె గారి హేతువాద ఆలోచనాధోరణి, సాంఘిక సమానత్వం కోసం తపన, కార్యపాలన కోసం ఆతృత యివన్నీ నన్ను ఎంతగానో ప్రభావితం చేసాయి. పూల మీద మంచు బిందువుల మాదిరి స్వచ్ఛత, పారదర్శకత కలిగిన యూసఫ్ మెహరెల్లీగారి జీవితం నాకు అద్భుతంగా తోచింది. తండ్రివంటి రక్షణ, తల్లివంటి కరుణ కలిగిన సానే గురూజీగారి ఆలోచనా విధానం నాలో యితరుల మనో భావాల పట్ల సానుభూతిని పెంపొందించింది. మానవ వేదనకు మధుర స్వరాన్నందించిన నా స్నేహితుడు నాథ్‌పాయిగారి ఉపన్యాసాలు నన్నెంతో ప్రభావితం చేసేయి. నిజానికి నాథ్‌గారి కొంకణ్ రైల్వే కల నా నియోజకవర్గానికి కార్యాచరణలో కీలక భూమిక పోషించింది.

ప్రారంభదశ నుండీ ప్రస్తుత అల్లకల్లోల పరిస్థితుల వరకు నా జీవన పరిణామ క్రమాన్ని తరచి చూసుకుంటే మన వ్యక్తిగత, సాంఘిక జీవనాల్లో స్వేచ్ఛ, సమానత్వం, సాంఘికన్యాయం, పరమత సహనం, లౌకికవాదం, పర్యావరణం పట్ల స్నేహం, మహిళల పట్ల గౌరవం, మహిళాసాధికారత, అన్నిటికంటె

ముఖ్యంగా సామాజిక, ఆర్థిక పునర్నిర్మాణం కోసం ఒక శాస్త్రీయ దృక్పథం వంటి మానవీయ విలువలను అలవరచుకోవాల్సిన అవసరం ఉందని నాకు బలంగా అనిపిస్తోంది. శాస్త్రీయ దృక్పథం అనేది కేవలం మేథోవర్గానికి మాత్రమే పరిమితం కాకూడదు. దేశంలోని 7,00,000 పల్లెల్లో జీవించే ప్రజలకు, ముఖ్యంగా దారిద్ర్యరేఖకు దిగువన జీవితం గడిపే అత్యధికుల అవసరాలకు అది అన్వయించబడాలి. వారిని అలా నిశ్శబ్దంగా పేదరికంతో బాధపడమని వదిలేస్తే, ఒకరోజున ఆ నిశ్శబ్దం పెను విస్ఫోటనంగా మారి ప్రస్తుతం దేశంలో సాంకేతిక విప్లవం సృష్టిస్తోన్న ప్రయోజనాలన్నింటినీ తుడిచి పెట్టేస్తుంది.

నా జీవితమంతా నేను అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడాను. నవ సమాజ నిర్మాణానికి అవసరమైన నిర్మాణాత్మక కార్యకలాపాల్లో పాలు పంచుకున్నాను. పార్లమెంట్‌లోనూ, బయటా జరిపిన ఉద్యమాల ద్వారా నేను పేదలు, అనాథల బాధలకు, ఆశలకూ గళాన్నిచ్చే ప్రయత్నం చేసాను. మనందరి కలలను సాకారం చేసుకోవడానికి నా వంతుగా చేసిన చిన్ని ప్రయత్నం ఇది. భవిష్యత్తు కాస్త మసగ్గా కనిపిస్తుందేమోగాని పూర్తిగా అంధకారమయం కాదు. ప్రఖ్యాత కవి కీ.శే. కైఫీఅజ్మీ చెప్పినట్లు :

ఒక కోప కెరటం
దీపాలన్నింటినీ ఆర్పేసింది
కానీ ఒక్కటి మాత్రం మిణుకు మిణుకు మంటోంది
దాని పేరే 'ఆశ'

## మధు దండావతె జీవిత సంగ్రహం

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁂ ⁂ ⁂

మధు దండావతె గారు 1924 వ సంవత్సరం జనవరి 21వ తేదీన మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో జన్మించారు. మున్సిపల్ స్కూల్ నుంచి ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న తరువాత అతను మాధ్యమిక విద్య కోసం అహ్మద్‌నగర్ ఎద్యుకేషనల్ సొసైటీలో చేరారు. ఈ బడిని ప్రఖ్యాత సంఘసంస్కర్త, మహా పండితుడు కీ.శే. మహాదేవ్ గోవింద రనడే గారు స్థాపించారు. దండావతెగారు ఈ పాఠశాల నుండి మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులయ్యారు.

పాఠశాల విద్యాభ్యాస కాలంలో దండావతెగారికి కవిత్వం పట్ల చాలా మక్కువ ఉండేది. ఆయన కవిత్వం చదివే పోటీలలో తరచూ పాల్గొనే వారు. అతను క్రికెట్ ఆటకు సంబంధించిన అనేక టోర్నమెంట్లలో కూడా పాల్గొని అనేక బహుమతులు పొందారు. క్రికెట్ సాధన చెయ్యటానికి ముంబైని మించిన ఊరులేదని అతని తండ్రిగారి అభిప్రాయం. అంచేత కాలేజీ విద్యకోసం మధుగారిని ముంబై

పంపడం జరిగింది. అతను రామనారాయణ్ రుహ కాలేజి (ముంబై)లో రెండేళ్ళు యింటర్మీడియట్,తరువాత ముంబైలోని ప్రఖ్యాత రాయల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పై చదువుల కోసం చేరారు. అతను బి.యస్.సీ. కోసం భౌతికశాస్త్రాన్ని ఎంచుకుని మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యారు. 1946 లో అదే విద్యాసంస్థ నుండి అతను ఎమ్.ఎస్.సి. పరీక్ష కూడా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యారు. ఆ సమయంలో సిద్ధార్థ్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కోసం ప్రతిభావంతులైన యువ ఉపన్యాసకుల కోసం డా॥బి,ఆర్. అంబేద్కర్‌గారు వెతుకుతూ ఉండటం కాకతాళీయంగా జరిగింది. అతను దండావతెగారిని భౌతికశాస్త్ర ఉపన్యాసకుడిగా 1946లో ఎంపిక చెయ్యడం జరిగింది. ఆ తరువాత అదే కళాశాలలోనూ, యింకా 1971 వరకు ముంబై విశ్వవిద్యాలయంలోనూ  మధుగారు న్యూక్లియర్ ఫిజిక్స్‌ను బోధించేవారు.

మధు దండావతెగారు 1953వ సంవత్సరం అక్టోబర్ 22 న ప్రమీలగారిని వివాహమాడారు. ఆమె అతనికి వ్యక్తిగత జీవితంలోనూ, ప్రజాజీవితంలోనూ కూడా చేదోదువాదోడుగా వున్నారు. అన్ని సాంఘిక, రాజకీయ ఉద్యమాలలో వారిద్దరూ ఒకరికొకరు తోడుగా ఉండేవారు. ఆమె మహిళా సాధికారత, మహిళలకు న్యాయం మొదలయిన విషయాల పట్ల చాలా అంకిత భావంతో ఉండేవారు. సామాజిక అంశాల పట్ల తనకు గల అంకిత భావం కారణంగా ఆమె 7వ లోక్‌సభ (1980–1986)లో సభ్యులుగా వున్నారు. ఆమె 2002 వ సంవత్సరం జనవరి 1 వ తేదీన పరమపదించారు.

## స్వాతంత్ర్య పోరాటం

1940 లలో స్వాతంత్రోద్యమం ముమ్మరంగా సాగుతున్న సమయంలో మధుగారు యవ్వనంలో వున్నారు. 1942 లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో అతను అజ్ఞాతంగా పనిచేసారు. అప్పటికి ఆయన వయస్సు 18 సంవత్సరాలు. అజ్ఞాత ఉద్యమంలో భాగంగా అతను మేజిస్ట్రేట్ కోర్టు బెంచికి నిప్పుపెట్టడం, ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ తాలూకు టెలికమ్యూనికేషన్ వ్యవస్థను పాడు చేయడం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆ తర్వాత 1946లో ముంబైలోని కేసిల్ బరాక్స్‌లో రాయల్ ఇండియన్ నేవీ వారు తిరుగుబాటు చేసినప్పుడు అతను మిలిటరీ వాహనాలు ప్రయాణించడానికి

వీలులేకుండా దారిమధ్యలో రాళ్ళు పెట్టడం ద్వారా తిరుగుబాటుదారులకు సాయపడ్డారు.

## స్వాతంత్ర్యానంతర దశ

స్వాతంత్ర్యానంతర కాలంలో గోవా విముక్తి పోరాటంలోనూ, సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలోనూ, సోషలిస్టు ఉద్యమంలోనూ మధుగారు పోషించిన పాత్ర చెప్పుకోదగ్గది.

1946 వ సంవత్సరం జనవరి 18 వ తేదీన గోవాలో డా॥రామమనోహర్ లోహియాగారు గోవా విముక్తి ఉద్యమాన్ని ప్రారంభించారు. ఉద్యమంలో భాగంగా 1955వ సంవత్సరం ఆగస్ట్‌నెలలో ప్రజా సత్యాగ్రహం ప్రారంభించబడింది. ఇందులో మధుగారు కీలక భూమిక పోషించారు. పోలీసుల ఆదేశాలను ఖాతరు చెయ్యకుండా అతను భారత జాతీయజెండాను చేత ధరించి 1955 ఆగస్ట్ 19వ తేదీన పోర్చుగీసువారి భూభాగంలో మైళ్ళకొద్దీ దూరం దూసుకువెళ్ళారు. దాంతో అతన్ని పోలీసులు తీవ్రంగా కొట్టడం చేత, జీవితకాలం అతను తుంటి నొప్పితో బాధపడ్డారు. ఈ సత్యాగ్రహం కారణంగా ఏర్పడిన ఉద్విగ్న వాతావరణం ఫలితంగా తరువాతి కాలంలో భారతప్రభుత్వం సైనికచర్య జరిపి పోర్చుగీసు వారి నుంచి గోవాను విముక్తం చేసింది.

రాష్ట్రాల పునర్విభజన కోసం వేసిన కమీషన్ నివేదిక ప్రకారం ముంబై మహారాష్ట్రలో భాగం కాదని చెప్పటం 1956లో సంయుక్త మహారాష్ట్ర ఉద్యమానికి దారి తీసింది. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించిన సంయుక్త మహారాష్ట్ర సమితికి మధు దండావతెగారు కార్యదర్శిగా వ్యవహరించారు. అతని నాయకత్వంలో సమితి బాంబే (ముంబై) రాజధానిగా సంయుక్త మహారాష్ట్రకు కేంద్రప్రభుత్వం అనుమతి నిచ్చేవరకూ పోరాటం చేసింది. ఈ ఉద్యమ కాలంలో చాలాసార్లు దండావతెగారు , అతని శ్రీమతి జైలుశిక్షని అనుభవించారు.

తన రాజకీయ జీవితకాలం అంతటిలోనూ మధు దండావతెగారు సోషలిస్టు ఉద్యమంతో సంబంధాలు కలిగివున్నారు. కార్మికవర్గాలు, రైతుకూలీలు, భూమిలేని నిరుపేదల కోసం సోషలిస్టులు సలిపిన పోరాటాలన్నింటిలోనూ అతను

పాలుపంచుకున్నాడు. 1950ల ప్రారంభంలో ముంబైలో సోషలిస్టుల ఆధ్వర్యంలో ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా జరిగిన సత్యాగ్రహంలోనూ, అలాగే టెక్స్‌టైల్ సమ్మెలోనూ అతను పాల్గొన్నారు. కార్మికులకు ఇచ్చే బోనస్ అనేది యాజమాన్య వర్గాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే కంటితుడుపు వ్యవహారం కాదనీ, అది కార్మికుల న్యాయపరమైన ఆర్జన అనీ, ముంబైలో జరిగిన టెక్స్‌టైల్ సమ్మెలో సోషలిస్టులు నొక్కి చెప్పారు. కార్మిక సంఘాల పోరాటాలు కూడా సోషలిస్టు ఉద్యమంలో భాగంగా ఉండేవి. రైల్వే కార్మికుల పోరాటాల్లోనూ, డాక్‌యార్డ్ కార్మికులు, రవాణా కార్మికులు యింకా యితర కార్మిక సంఘాల పోరాటాల్లో ప్రొఫెసర్ దండావతెగారు ప్రముఖ పాత్ర పోషించారు. పట్టణాలు, పల్లెల్లోని పేదలకు భూమి కోసం 1969లో జరిగిన భూవిముక్తి పోరాటంలో దండావతెగారి పాత్ర చాలా కీలకం అని చెప్పవచ్చు. సహకార ఉద్యమం ద్వారా వికేంద్రీకరణ అనేది దీర్ఘకాలంలో సమునత్వవాద (ఇగాలిటేరియన్) సమాజ స్థాపనకు దారి తీస్తుందని సోషలిస్టుల విశ్వాసంగా ఉండేది. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యమాన్ని చైతన్య పరచడంలో దండావతెగారు ప్రముఖ పాత్ర పోషించారు.

తన ప్రజా జీవితంలో దండావతెగారు ఎల్లప్పుడూ ప్రజాస్వామ్యవాదిగానే నిలిచారు. భారత రాజకీయాల్లో నియంతృత్వ పోకడలు తలెత్తినప్పుడల్లా ఆయన వాటికి వ్యతిరేకంగా పోరాడారు. 1975 జూన్ 25న అత్యవసర పరిస్థితి విధించిన తరువాత ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం జరిగిన ఉద్యమంలో అతను పోషించిన పాత్రను భారతప్రజలు ఎన్నటికీ మరువలేరు. మిసా చట్టం క్రింద బెంగుళూరు కేంద్ర కారాగారంలో అతను 18 నెలలు జైలుశిక్ష అనుభవించారు.

## పార్లమెంటులో

తన ప్రజా జీవితం ప్రారంభదశలో దండావతెగారు ఎక్కువగా సంస్థాగత కార్యక్రమాలకు, నిర్మాణాత్మకమైన పనులకు, పార్టీ కార్యకలాపాల వ్యూహరచనకు, యువతకు శిక్షణనివ్వడానికి ప్రాముఖ్యత నిచ్చారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల తరపున అతను ఉత్సాహంగా ప్రచారం చేసినప్పటికీ, తను స్వయంగా ఎన్నికల్లో పాల్గొనేవారు కాదు.

1970లో అతను తొలిసారి మహారాష్ట్ర శాసనమండలికి ముంబై పట్టభద్రుల తరపున ఎన్నికయ్యారు. కౌన్సిలర్‌గా వ్యవహరించిన స్వల్ప కాలవ్యవధిలోనే అతను రైతులు, కూలీల సమస్యల గూర్చి, వారికి భూమి పంపకం గూర్చి బలంగా తన వాదనలు వినిపించారు.

పార్లమెంటులో దండావతెగారి ప్రవేశం యాదృచ్ఛికంగా జరిగింది. 1971 లోక్‌సభ సాధారణ ఎన్నికలకు సరిగ్గా నెలరోజుల ముందు మహారాష్ట్రలోని రాజపూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించే లోక్‌సభ సభ్యుడు శ్రీనాథ్ సాయిగారు మృతి చెందడం జరిగింది. రాజాపూర్ సోషలిస్ట్‌లకు పెట్టని కోట వంటి నియోజకవర్గం. నాథ్‌సాయిగారి మరణానంతరం సోషలిస్టులతో బాగా జనాదరణ కలిగిన మధు దండావతెగారు ఆ నియోజకవర్గం నుంచి పోటీ చెయ్యాల్సివచ్చింది. 1971లో పాకిస్తాన్‌పై యుద్ధంలో విజయం తర్వాత శ్రీమతి ఇందిరాగాంధీగారికి లభించిన జనాదరణ కారణంగా సాధారణ ఎన్నికల్లో 48 సీట్లలో 47 సీట్లు సోషలిస్టులు కాంగ్రెస్ చేతిలో ఓడిపోగా కేవలం ఒక్క రాజపూర్‌లో మాత్రం దండావతెగారు విజయభేరి మోగించారు. ఆ తరువాత అతను వరసగా 1977, 1980, 1984 మరియు 1989లలో నాలుగుసార్లు అదే నియోజక వర్గం నుంచి ఎన్నికయ్యారు.

దండావతెగారు రైల్వేమంత్రిగా విజయవంతంగా పని చేశారనీ, సమర్థుడైన ఆర్థికమంత్రిగా పేరు తెచ్చుకున్నారనీ అందరికీ తెలుసు. ఎమర్జెన్సీ తరువాత జరిగిన సాధారణ ఎన్నికల్లో జనతాపార్టీ విజయం సాధించి కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వంలో రైల్వేమంత్రిగా పనిచేశారు. 1989-90 మధ్యకాలంలో వి.పి.సింగ్‌గారి ప్రభుత్వంలో అతను కేంద్ర ఆర్థికమంత్రిగా వ్యవహరించారు. 1991 సాధారణ ఎన్నికల్లో పరాజయం పాలయ్యాక దండావతెగారు తన సమయాన్ని అధ్యయనానికీ రచనలకూ వినియోగించారు. 1996 లో శ్రీ హెచ్.డి. దేవెగౌడగారు ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో దండావతెగారు ప్రణాళికా సంఘానికి డెప్యూటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు.

## రచయితగా

దండావతెగారు అనేక విషయాల గురించి విస్తారంగా రచనలు చేసారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థ, ప్రతిపక్షాల భూమిక, సంకీర్ణ రాజకీయాలు, సభాపతిపాత్ర, పార్లమెంటరీ అధికారాలు, ప్రతిపక్షనాయకుడు, న్యాయవ్యవస్థ యొక్క క్రియాశీలత యింకా పార్లమెంట్‌కూ, న్యాయవ్యవస్థకూ, కార్య నిర్వాహకులకూ మధ్య సంబంధ బాంధవ్యాలు ... యిలా అనేక అంశాల మీద అతను తన వ్యాసాలలో తన అభిప్రాయాలను స్పష్టంగా చెప్పారు. అంతేకాకుండా అతను కార్ల్‌మార్క్స్, మహాత్మాగాంధీ, యూసఫ్ మెహరెల్లీ, జయప్రకాశ్ నారాయణ వంటి ఎందరో ప్రముఖుల గురించి కూడా పుస్తకాలు రాశారు.

ప్రొఫెసర్ దండావతెగారు రచించిన పుస్తకాలలో ఎవల్యూషన్ ఆఫ్ సోషలిస్ట్ పాలిసీస్, గాంధీజీ' స్ ఇంపాక్ట్ ఆన్ సోషలిస్ట్ థింకింగ్, మార్క్స్ అండ్ గాంధీ, త్రీ డికేడ్స్ ఆఫ్ ఇండియన్ కమ్యూనిజం, యూసఫ్ మెహరెలీ– క్వెస్ట్ ఫర్ న్యూ హొరైజన్స్, ఎథోస్ ఆఫ్ ప్లానింగ్ యిన్ ఇండియా, కాశ్మీర్–టెస్ట్ కేస్ ఫర్ సెక్యులరిజం, జయప్రకాశ్ నారాయణ్, స్ట్రగుల్ విత్ వాల్యూస్, ఎకోస్ ఇన్ పార్లమెంట్, క్వెస్ట్ ఆఫ్ కాన్షియన్స్ యాజ్ ది మైండ్ అన్‌ఫోల్డ్స్ వంటివి ముఖ్యమైనవి. లోక్‌సభలో అతను అయిదు దఫాలు సభ్యునిగా ఉన్నప్పుడు యిచ్చిన ఉపన్యాసాలను 'ఎకోస్ ఇన్ పార్లమెంట్' అనే పుస్తకంలో పొందుపరచగా 'క్వెస్ట్ ఆఫ్ కాన్షియన్స్'లో అతను జూలై 1993 నుంచి ఆగస్ట్ 1996 వరకు జనతా వార పత్రిక సంపాదకునిగా వివిధ రాజకీయ, సామాజిక, ఆర్థిక, అంతర్జాతీయ అంశాలపై రాసిన సంపాదకీయాలు పొందుపరచబడ్డాయి. 'ఆర్కిటెక్ట్స్ ఆఫ్ మోదర్న్ ఇండియా' (ఆధునిక భారతావని నిర్మాతలు) అనే అతని పుస్తకంలో విభిన్న రంగాలకు చెందిన భారత ప్రముఖుల సంక్షిప్త జీవన చిత్రాలు పొందుపరచబడ్డాయి. వాస్తుశాస్త్రం, సాహిత్యం, తత్వం, కళలు, సంగీతం, రాజకీయాలు, సినిమా, విప్లవం, సాంఘిక సంస్కరణలు, శాస్త్ర సాంకేతిక రంగాలు, క్రీడలు .... ఇలా విభిన్న రంగాలకు చెందిన ప్రముఖుల జీవిత గాథలు ఈ పుస్తకంలో చర్చించడం జరిగింది. అతను తన జీవిత చరమాంకంలో రాసిన 'డైలాగ్ విత్ లైఫ్' ను అతని ఆత్మకథగా

చెప్పవచ్చు. 'ది గాంధీ స్టడీ సర్కిల్' అతనికి చాలా యిష్టమైన ప్రదేశం. అక్కడ అతను తన స్నేహితులతోనూ, అభిమానులతోనూ మేథోపరమైన చర్చలు జరిపేవారు.

## అవార్డులు

ప్రొఫెసర్ దండావతెగారిని అనేక అవార్డులు వరించాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కీ.శే. కంభంపాటి సత్యనారాయణగారి స్మారక స్వర్ణపతకం, 1995 వ సంవత్సరానికి గాను రాష్ట్రీయ కాకాసాహెబ్ గాడ్గిల్ సమ్మాన్, యశ్వంతరావ్ చవాన్ ఫౌండేషన్ వారిచ్చే రాష్ట్రీయ ఏకతా పురస్కార్, పోర్చుగీసువారికి వ్యతిరేకంగా గోవా విముక్తి ఆందోళనలో పాల్గొన్నందుకు గోవా ప్రభుత్వం వారిచ్చే బహుమతి, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ వారిచ్చిన జవహర్‌లాల్ నెహ్రూ శతజయంతి పురస్కారం, ప్రణాళికాభివృద్ధికిగాను భారత రాష్ట్రపతి అందజేసిన నేషనల్ సిటిజన్స్ అవార్డు, యింకా బాపూ పురస్కార్ యివన్నీ అతన్ని వరించిన బహుమతులలో చెప్పుకోదగ్గవి.

## ఆఖరి ప్రయాణం

దీర్ఘకాలం అస్వస్థులుగా ఉన్నాక దండావతెగారు 2005, నవంబర్ 12 న కాలధర్మం చెందారు. అతను లైపోసర్కోము అంటే తుంటికేన్సర్‌తో చాలా కాలం బాధపడ్డారు. 2005, అక్టోబర్ 20న ఆయన్ని ముంబైలోని జస్‌లోక్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్చడం జరిగింది. కానీ దురదృష్టవశాత్తూ ఆయన కోలుకోలేదు. 81 ఏళ్ళ వయసులో తుదిశ్వాస విడిచారు. అతని ఆకాంక్షకు అనుగుణంగా అతని శరీరాన్ని గ్రాంట్ మెడికల్ కాలేజీకి పరిశోధన,అధ్యయనాలకై యివ్వడం జరిగింది. అంచేత అంతిమ సంస్కారాలు జరపబడలేదు.

ప్రొఫెసర్ దండావతెగారు మృదుస్వభావి. పండితుడు, పెద్దమనిషి, అతను సోషలిజాన్ని ఆచరణలో పెట్టిన వ్యక్తి. విలువలతో కూడిన రాజకీయం నడిపిన నాయకుడు. పారదర్శకమైన ప్రజాజీవితానికి అతని జీవితం ఒక ఉదాహరణ. అతను సామాజిక న్యాయం, సమానత్వం కోసం అవిశ్రాంతంగా పోరాడిన యోధుడు. సోషలిస్టు ఉద్యమం ఆర్థిక అసమానలతో పాటు సామాజిక అసమానతల గూర్చి కూడా మాట్లాడాల్లి వుంటుంది అని అతని అభిప్రాయం. అతను ఎల్లప్పుడూ

లౌకిక వాదాన్ని సమర్థించారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శించే భారతజాతిలోని సహనాన్నీ, సామరస్యాన్నీ ఆయన ఎల్లవేళలా సమర్థించేవారు. పార్లమెంట్ సభ్యునిగా అతను ఎల్లప్పుడూ పూర్తిగా ఇంటివద్ద తయారై, తగిన సన్నాహకాలతో సభలో అడుగు పెట్టేవారు. అతనికి పార్లమెంట్ పద్ధతుల గురించి పూర్తి అవగాహన వుండేది. రాజ్యాంగానికి సంబంధించిన విషయాలు అతన్ని ఎప్పుడు ఉత్తేజ పరిచేవి. "ఎవరైనా మనని విమర్శించినప్పుడు కోపగించుకనేకంటే, చతురోక్తులతో వారికి జవాబివ్వడం మంచిది." అని అతను భావించేవారు. ముక్కుసూటి వ్యవహారానికీ, ఋజువర్తనకూ, విలువలతో కూడిన ప్రజా జీవితానికీ, రాబోయే తరాలు అతన్ని తప్పక గుర్తు పెట్టుకుంటాయి...

# మధు దండవతే జీవితం - కార్యచరణ

- ప్రొఫెసర్ బి. వివేకానందన్

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁂

1930వ సంవత్సరం జనవరి 26 వ తేదీన రావి నది ఒడ్డున లాహోర్‌లో జరిగిన ఒక మహాసభలో భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాడాలని భారత జాతీయ కాంగ్రెస్ తీర్మానించింది. అప్పటి నుంచి మనకు స్వాతంత్ర్యం వచ్చేదాక ఆ రోజునే స్వాతంత్ర్యదినంగా జరుపుకోవడం ఆనవాయితీగా ఉండేది.

సరిగ్గా ఏడేళ్ళ తర్వాత 1932లో అహ్మద్‌నగర్‌లో ఈ స్వాతంత్ర్య దినానికి ముందురోజు అర్థరాత్రి 13 ఏళ్ళ బాలుడొకడు ఎ.యి.సొసైటీ హైస్కూల్ గోడనెక్కి ఆ శిఖరం మీద భారత జాతీయ పతాకాన్ని ఎగరేశాడు. అంతేకాదు, ఇంగ్లీషువాడి జెండాను దించి మువ్వన్నెల పతాకాన్ని ఎగరేసే రోజు దూరంలో లేదని ప్రకటించాడు. ఆ బాలుడు మరెవరో కాదు, మధు దండవతె. ఈ సన్నివేశం చిన్నతనంలోనే అతనిలో గల దేశభక్తికి నిదర్శనం.

ఈ దేశభక్తి కారణంగానే అతను 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో

అజ్ఞాత కార్యకర్తగా పనిచేశాడు. అందులో భాగంగా తన సహచరుల సహకారంతో అతను అర్ధరాత్రివేళ పోలీసుల కన్నుగప్పి అహ్మద్‌నగర్ మేజిస్ట్రేట్ కోర్టుకి నిప్పుపెట్టాడు. తెల్లదొరల అధికార చిహ్నాలని తుడిచిపెట్టే కార్యంలో ఇది కూడా ఒక భాగం. ఆశ్చర్యం ఏమంటే, అహ్మద్‌నగర్ మున్సిపాలిటీలో ఛీఫ్ ఆఫీసర్‌గా ఉన్నది మధుగారి తండ్రిగారే. అగ్నిమాపక దళం అతని క్రిందే పనిచేస్తుంది. అంచేత అతను ఆ అర్ధరాత్రి పరుగులు తీసి మంటలార్పే పనిని పర్యవేక్షించారు. కానీ అప్పటికీ అతని సుపుత్రుడు కోర్టుని విజయవంతంగా భస్మీపటలం చేసాడు.

1946లో బాంబేలో రాయల్ ఇండియన్ నేవీవారు సాయుధ తిరుగుబాటు చేసారు. రాయల్ ఇండియన్ నేవీకి మద్దతుగా నగరమంతా ప్రదర్శనలు జరిగాయి. ఈ ప్రదర్శనలను అణచివేసేందుకు ప్రయత్నిస్తున్న సైనిక వాహనాలను అడ్డుకునేందుకు మధుగారు, తన సహచరులతో కలిసి రహదారికి అడ్డంగా బారికేడ్లను నిలుపుతుండగా అక్కడకు చేరుకున్న బ్రిటిష్ సైనికులు ప్రదర్శనకారులపై నిర్లక్ష్యంగా కాల్పులు జరిపారు. మధు దండవతెగారి ప్రక్కనే వున్న వ్యక్తి సైనికుల బుల్లెట్లకు నేలకూలగా అతను మాత్రం ఆశ్చర్యకరంగా తప్పించుకోగలిగారు.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది. బ్రిటిషర్లు వెళ్ళిపోయారు. కానీ పోర్చుగీసువారు గోవా మీద యింకా యితర వలసల మీద తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. గోవా స్వతంత్ర్య పోరాటం జరుగుతూ ఉంది. 1955 ఆగస్ట్ 15న, గోవా విముక్తి పోరాటంలో భాగంగా సత్యాగ్రహాన్ని తీవ్రం చెయ్యాలని నిర్ణయించబడింది. బాంబే నుంచి యితర ప్రాంతాల నుంచి 1200 మంది సత్యాగ్రహులను తీసుకెళ్ళాలని మధు దండవతెగారు నిర్ణయించారు. సత్యాగ్రహులకూ, పోర్చుగీసు పోలీసులకూ మధ్య గొడవలు జరిగి జననష్టం సంభవిస్తుందని భయపడ్డ బాంబే ప్రభుత్వం ఆ జననష్టాన్ని నివారించే ఉద్దేశ్యంతో హఠాత్తుగా బెల్గాం నుంచి గోవాకు రవాణా సాధనాలను నిషేధించింది. కానీ మధు దండవతెగారి స్వాతంత్ర్య కాంక్ష అజేయమైనది. 1200 సత్యాగ్రహులను తీసుకుని అతను బెల్గాం నుంచి గోవా సరిహద్దు వరకు అంటే ఇంచుమించు 85 మైళ్ళు జడివానను లెక్కచేయ్యకుండా కాలినడకన వెళ్ళారు. నిర్ణయింపబడ్డ స్థలానికి మధు దండవతెగారి బృందం సమయానికి చేరుకోలేక పోవడం వలన మహారాష్ట్ర

కోస్తా ప్రాంతానికి చెందిన హిర్వే గురూజీగారిని తెరెఖోల్ క్రీక్‌కి వెళ్ళే మరో సత్యాగ్రహుల బృందానికి నాయకత్వం వహించమని ఆఖరి నిమిషంలో నిర్ణయించబడింది. కానీ దురదృష్టవశాత్తూ తెరెఖోల్ కోట వద్ద జరిపిన కాల్పులకు మొదటగా ఆయనే బలయ్యారు. ఇది మధు దండవతెగారికి జీవితాంతం తీవ్రమైన విషాదాన్ని మిగిల్చింది.

ఆగస్ట్ 15న అమానుషంగా అన్ని హత్యలు జరిగిన తర్వాత కూడా ఆగస్ట్ 17న మరో బృందానికి నాయకత్వం వహిస్తానని మధు దండవతెగారు పట్టుబట్టారు. కొంతమంది సహచరులు మధుగారి భార్య ప్రమీలగారి వద్దకు వెళ్ళి సత్యాగ్రహంలో ప్రాణాలు పణంగా పెట్టొద్దని అతన్ని ఒప్పించమని అడగ్గా, ఆమె ససేమిరా ఒప్పుకోలేదు. పైపెచ్చు, మధు దండవతెగారితోపాటు వెళ్ళడానికి తనకు కూడా అనుమతి నివ్వమని ఆమె కోరారు. “మరణాన్ని ఇద్దరం కలిసే ఎదుర్కొంటాం” అనేది ఆమె నిర్ణయం. కానీ చివరకు, మధు దండవతెగారికి మాత్రమే అనుమతి దొరికింది. ప్రమీల గారికి అతనితో కలిసి వెళ్ళేందుకు అనుమతి దొరకలేదు. వెతార్దా సరిహద్దుల నుండి దండవతెగారు 92 మంది అనుచరులతో కలిసి 8 మైళ్ళు ట్రెక్కింగ్ చేసి మరీ గోవాలో అడుగుపెట్టే వేళకి సాయుధులైన పోర్చుగీసు పోలీసులు సత్యాగ్రహులకు ఎదురొచ్చి వారి మీద దాడి చేసారు. భీకర పోరాటం తరువాత వారు దండవతెగారి చేతిలోంచి మువ్వన్నెల పతాకాన్ని లాగి పారేశారు. వారు అతన్ని తీవ్రంగా కొట్టి, నేలకు పడద్రోసి అతని శరీరం మీంచి బూటుకాళ్ళతో నడిచి వెళ్ళారు. ఇంతటి అవమానాన్ని ఎదుర్కోలేక మధుగారు స్పృహ కోల్పోయారు. స్పృహలో లేని స్థితిలో అతన్ని స్ట్రెచర్ మీద గావా సరిహద్దులు దాటించడం జరిగింది. ఈ పోరాటంలో అతని తుంటి ఎముకలు గాయపడ్డాయి. ఈ గాయాలు నయమవడానికి ఏళ్ళు పట్టింది.

గోవా సత్యాగ్రహంలో పాల్గొనడానికి ముందు బాంబేలోని సిద్ధార్థ కాలేజీలో తన భౌతికశాస్త్ర ఆచార్యుని పదవికి రాజీనామా ఇవ్వాలని మధుగారు భావించారు. కానీ కాలేజి యాజమాన్యం అయిన పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ డా॥ బి.ఆర్. అంబేద్కర్ అందుకు ససేమిరా అంగీకరించలేదు. కారణం మధుగారు దేశభక్తితో తన ఆత్మ ప్రబోధాన్ననుసరించి సత్యాగ్రహంలో పాల్గొంటున్నారు అని

అంబేద్కర్‌గారి నమ్మిక. కాలేజీ యాజమాన్యం ఆ విధంగా మధుగారి దేశభక్తిని ప్రశంసిస్తే, విద్యార్థి వర్గమంతా తమ ప్రియమైన ప్రొఫెసర్‌కు వీడ్కోలు పలకడానికై విక్టోరియా టెర్మినల్ రైల్వేస్టేషన్‌కు కదిలివచ్చింది.

చక్కటి కుటుంబ వాతావరణంలో మధుగారి వ్యక్తిత్వం తీర్చిదిద్దబడింది. మధుగారి తాతగారు గొప్ప సాహితీవేత్త. అతను ప్రఖ్యాత కవి భాసుని సంస్కృత నాటకాలనూ, కౌటిల్యుడి అర్థశాస్త్రాన్నీ, రవీంద్రుడి కవిత్వాన్నీ మరాఠీ భాషలోకి తెచ్చారు. అతను ఇందిర వాది. ప్రఖ్యాత కాంగ్రెస్ నాయకుడు గోపాలకృష్ణ గోఖలేకి, సంఘసంస్కర్త అగార్కర్‌కీ సహచరుడు. మధుగారి తండ్రి తన తండ్రి వద్ద నుంచీ సాహితీ పిపాసము, ఉదారవాదాన్నీ పుణికిపుచ్చుకున్నాడు. రాజకీయాలు, సంఘసంస్కరణలు, సామాజిక ఆర్థిక దృష్టికోణం, సాహిత్యం, కవిత్వం, విజ్ఞానశాస్త్రం వంటి అనేక రంగాల్లో ఎదగడానికి మధుగారికి అతని కుటుంబ నేపథ్యం ఎంతగానో దోహదపడింది.

గాంధీజీ తాలూకు మానవత్వం, బుద్ధుని దయ, మార్క్స్ తార్కికత, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ తాలూకు మానవీయ, శాస్త్రీయ దృక్పథం, ఆచార్య నరేంద్రదేవ్‌గారి పాండిత్యం, జయప్రకాశ్ నారాయణ్‌గారి నైతిక, క్రియాశీల దృష్టి, ప్రజాస్వామ్య సోషలిజం గురించి రామ్‌మనోహర్ లోహియాగారి వాస్తవిక ఆలోచనా విధానం, సామాజిక న్యాయం కోసం మహాత్మా పూలేగారి తపన. భారతదేశంలో వర్ణవ్యవస్థ గురించి డా॥ అంబేద్కర్‌గారి హేతుబద్ధ ఆలోచనా విధానం యివన్నీ జీవితం పట్ల మధు దండవతెగారి ఆలోచనా విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేసాయి.

మహారాష్ట్రలోని చారిత్రక పట్టణం అహ్మద్‌నగర్‌లో పాఠశాల విద్యాభ్యాసం ముగిసాక మధుగారిని కాలేజి చదువు కోసం బాంబేకు పంపించారు అతని తల్లిదండ్రులు. పాఠశాలస్థాయిలో క్రికెట్ ఆటలో రాణించిన తమ పిల్లవాడి క్రికెట్ నైపుణ్యం పెంచాలని ఆ తల్లిదండ్రులు భావించడం కూడా అతన్ని బాంబేకి పంపడానికి ఒక కారణం. ఎలాగైతేనేం, బాంబేలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న కాలంలో మధు దండవతె విద్యార్థి ఉద్యమాల్లోనూ, ఆ తరువాత 1942 క్విట్ ఇండియా ఉద్యమంలోనూ, ఆ తరవాత సోషలిస్టు ఉద్యమంలోను పాల్గొన్నారు. 1946 లో 22 ఏళ్ళ వయస్సులో అతను సోషలిస్టు పార్టీ బాంబే శాఖకు కార్యదర్శిగా

ఎన్నికయ్యారు. అతను సోషలిస్టు ఉద్యమంలో ఎంతో అంకితభావంతో పనిచేశారు. అతను సోషలిస్టు ఉద్యమ నేతలైన ఆచార్య నరేంద్ర దేవ్, జయప్రకాశ్ నారాయణ్, రామ్‌మనోహర్ లోహియా, అచ్యుత్ పట్వర్ధన్, యూసఫ్ మెహరెల్లి, అశోక్ మెహతా, ఎస్.ఎమ్. జోషి యింకా ఎన్. జి. గొరె తదితరుల ఆలోచనా విధానంతో ప్రభావితులయ్యారు.

డా॥ బి.ఆర్. అంబేద్కర్‌గారు స్థాపించిన సిద్ధార్థ కాలేజి (బాంబే)లో మధు దండవతె గారు 1946 నుంచి 1971 వరకు భౌతికశాస్త్ర ఆచార్యునిగా వ్యవహరించారు. ఆ సమయంలో అతను సోషలిస్టు ఉద్యమంలో పాల్గొనడానికి పూర్తి స్వేచ్ఛ ఉండేది. కానీ అతను ఆచార్యునిగా తన విధులకు ఏ మాత్రం భంగం వాటిల్లకుండా తన రాజకీయ కార్యకలాపాలు కొనసాగించేవారు. కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలో బోధించిన అతనంటే విద్యార్థులకు ఎంతో ఆదరాభిమానాలుండేవి.

రాయపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి వరసగా మూడుసార్లు (1957, 1962, 1967) లోక్‌సభ సభ్యునిగా ఎన్నికైన బారిస్టర్ నాథ్‌సాయిగారు హఠాత్తుగా మరణించడంతో అతని స్థానంలో సరియైన అభ్యర్థిని నిలుపవలసిన అగత్యం ప్రజా సోషలిస్టు పార్టీకి ఏర్పడింది. ఈ నియోజకవర్గం నుంచి మధు దండవతెగారిని పార్టీ అభ్యర్థిగా నిలపడానికి పార్టీ ఏకగ్రీవంగా తీర్మానించింది. తనకున్న అతి కొద్ది సమయంలోనే దండవతెగారు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన జరిపి తను నాథ్‌సాయిగారి అడుగుజాడలలో నడుస్తాననీ, వెనకబడ్డ ప్రాంతమైన కొంకణ్ అభివృద్ధికి పాటుపడటం ద్వారా నాథ్‌సాయిగారి కలను సాకారం చేస్తాననీ నియోజకవర్గ ప్రజలకు మాట యిచ్చారు. కొంకణ్ ప్రాంత అభివృద్ధికై కొంకణ్ రైల్వే స్థాపన కోసం నిరంతరాయంగా శ్రమిస్తానని అతను వాగ్దానం చేసారు. 1971లో ఇందిరా ప్రభంజనంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఏకైక ప్రతిపక్ష అభ్యర్థి మధు దండవతెగారే. తరవాత అతను వరసగా అయిదు సార్లు రాయపూర్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1971,77,80,84,89 లలో అతను అదే నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. 1980 ఎన్నికల్లో అతను దేశంలోనే అత్యధిక మార్జిన్‌తో గెలిచిన ఘనత సాధించారు.

1975 లో ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో మధు దండవతెగారిని బెంగుళూరు కేంద్ర కారాగారంలో బంధించడం జరిగింది. కారాగారవాసం సమయంలో అతను 'మార్క్స్ అండ్ గాంధీ' అనే ప్రముఖ పుస్తకాన్ని రచించారు. 1977లో జైలు నుంచి విడుదలయ్యాక ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పాల్గొన్నారు. మళ్ళీ రాజాపూర్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికై కేంద్రంలో జనతా ప్రభుత్వంలో రైల్వేమంత్రిగా ప్రమానస్వీకారం చేసారు.

రైల్వేమంత్రి అయ్యాక అతను 1974లో తమ డిమాండ్ల సాధనకోసం సమ్మెచేసిన రైల్వే కార్మికులనూ, అదేవిధంగా నాథ్‌సాయిగారి కొంకణ్ రైల్వే కలనూ రెండింటినీ మరిచిపోలేదు. తను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజుల్లోనే ప్రవేశపెట్టిన మధ్యంతర రైల్వే బడ్జెట్‌లోనే అతను 1974 సమ్మెకాలంలో విధులనుంచి తొలగింపబడిన 50,000 మంది రైల్వే ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అది ఒక చారిత్రాత్మక నిర్ణయం. అతను శ్రద్ధగా పనిచేసి, నష్టాల్లో వున్న రైల్వేను లాభాల బాట పట్టించాలని రైల్వే ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకుని తమ బకాయిలు చెల్లించడంతో రైల్వే ఉద్యోగులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేశారు. దాంతో రైల్వే లాభాలబాట పట్టింది. చాలా కాలంగా లోటు బడ్జెట్‌తోనే నడుస్తున్న రైల్వే బడ్జెట్ మొదటిసారి లాభాలను చూసింది. మొదటిసారి దండవతెగారు ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో 8 కోట్ల మిగులు కనిపించింది. ఉద్యోగుల రెట్టించిన ఉత్సాహంతో పని చేసిన కారణంగా మొత్తం 126 కోట్ల రూపాయల లాభాలు రావడంతో రైల్వేకార్మికుల డిమాండ్లును అంగీకరించడం, రైలు ప్రయాణీకులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడం, రైల్వేలో నూతన సాంకేతికతను ప్రవేశపెట్టడం డబుల్ ఇంజన్ రైళ్ళను ప్రవేశపెట్టడం వంటివి సాధ్యపడ్డాయి.

చాలాకాలంగా మరుగున పడి ఉన్న కొంకణ్ రైల్వే ప్రాజెక్టుకి అతను మంత్రి అయ్యాక కొత్త ఊపునివ్వడమే కాక, తను ఆర్థికమంత్రి అయ్యాక మంగుళూరు వరకు ఉన్న మొత్తం కొంకణ్ రైల్వే ప్రాజెక్టుకి ప్రణాళికాసంఘం అనుమతిని కూడా సంపాదించారు. అంతేకాక స్వయం ప్రతిపత్తి కలిగిన కొంకణ్ రైల్వే కార్పొరేషన్ ఏర్పాటు జరిగేటట్టు చూసేరు. ప్రస్తుతం పూర్తి కావస్తున కొంకణ్ రైల్వేకు

సంబంధించిన తన కల సాకారం కోసం తను చేసిన వాగ్దానాన్ని అతను నిలబెట్టు కున్నారు.

1979లో అంతర్గత కలహాల కారణంగా జనతా ప్రభుత్వం పడిపోయినప్పుడు తను పదవికి రాజీనామా చేసిన వారం లోపే అతను తన ఆస్తుల వివరాలను ప్రధానమంత్రికీ, ప్రతిపక్ష నాయకునికీ, రాష్ట్రపతికీ, జయప్రకాశ్ నారాయణగారికీ, ఆచార్య కృపలానీగారికీ పంపించడమే కాదు పత్రికలకు కూడా ఆ వివరాలను విడుదల చేశారు. మధు దండవతెగారి చర్యనూ, అతని నిజాయితీని ప్రశంసిస్తూ స్టేట్స్‌మన్ పత్రిక దాచేందుకు ఏమీలేదు (నథింగ్ టు హైడ్) అని సంపాదకీయం కూడా రాసింది.

జనతా ప్రభుత్వం పతనమయ్యాక, మధు దండవతెగారిని జనతాపార్టీ నుంచి విడిపోయి నూతన ప్రభుత్వంలో రైల్లేమంత్రి పదవిని చేపట్టమని సూచనలు అందాయి. దానికి మధుగారి జవాబు ఈ విధంగా వుంది. "నేను కోస్తాప్రాంతం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నాను. అక్కడ ఆచారం ప్రకారం పడవ మునిగినప్పుడు పడవతో పాటు కెప్టెన్, సిబ్బంది కూడా మునిగిపోతారు. నేను ఆ కోస్తా ఆచార వ్యవహారాలకు చెందిన మనిషిని. అంచేత మంత్రి పదవి కోసం పార్టీని విడనాడే ప్రశ్న లేదు."

1989లో వి.పి.సింగ్ నాయకత్వంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు మధు దండవతెగారికి అత్యంత ముఖ్యమైన ఆర్థికశాఖ కేటాయించబడింది. అతను ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను కొనియాడుతూ పత్రికలు సంపాదకీయాలు రాసాయి. ధనిక వర్గాలకు పన్నులు విధించడం ద్వారానూ, పేద, బలహీన వర్గాలకు పన్నులలో రాయితీలు కల్పించడం ద్వారానూ అతను బడ్జెట్‌కు కొత్తగా దిశానిర్దేశం చేసే ప్రయత్నం చేసారు. వ్యవసాయ ప్రధాన దేశంలో అతను వ్యవసాయానికీ, గ్రామీణాభివృద్ధికీ పెద్దపీట వేస్తూ రైతులకు రాయితీలు కల్పించే ప్రయత్నం చేసారు. ఉద్యోగ కల్పన కోసం అతను చిన్న తరహా, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించే ప్రయత్నం చేసారు.

కోట్ల రూపాయలతో వ్యవహరించాల్సిన రైల్వే, ఆర్థికశాఖలను నిర్వహిస్తూ కూడా అతను తన నిజాయితీకి మచ్చ లేకుండా వ్యవహరించారు. మంత్రి పదవిని

విడిచిపెట్టాక ఏ హంగూ, ఆర్భాటం లేని సాధారణ జీవితం గడిపేవారు. తన జీవితాన్ని గాంధీగారి సూత్రాల ఆధారంగానే జీవించారు.

మధుగారి రచనలు, ఉపన్యాసాలు, ఎంతో విశ్లేషణాత్మకంగా ఉండడమే కాక ఎంతో భావుకంగా కూడా ఉండి అతని భావాలను మరింత ప్రభావశీలంగా వ్యక్తీకరిస్తాయి. మనసు, మేథల ఈ కలయిక, ఇంకా విలువలకు అంకితమైన స్వభావాల కారణంగా అతని రాజకీయ జీవితం హేతుబద్ధంగానూ, మానవీయంగానూ కూడా ఉంటుంది.

## నాకు తెలిసిన మధు దండవతె

**–ప్రొఫెసర్ డి.కె. గిరి**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁂ ⁂ ⁂

"నీచుల చివరి ఆశ్రయం రాజకీయాలు" అన్న బెర్నార్డ్ షా వ్యాఖ్యను అసత్యమని నిరూపించిన వ్యక్తి భారత రాజకీయాల్లో ఎవరైనా ఉన్నారంటే అది ప్రొఫెసర్ మధు దండవతె అని చెప్పొచ్చు. అతను తన మాటల ద్వారా రాజకీయం ఒక ఉన్నతమైన వృత్తి అని చూపే ప్రయత్నం చేసారు. నీతి, నిజాయితీ, విధేయత, దయ, నిబద్ధత, నిరాడంబరత, సంతోషం, త్యాగం వంటి గొప్పగుణాల మేలు కలయిక అతను. అతన్ని అనుకరించగలగడం కూడ మహాత్కార్యమే! అతను తాత్వికతను ఆచరణలో చూపిన నాయకుడు.

నా పరిశీలనలు సాధారణంగా నాయకుడు మరణించేక మొక్కుబడిగా చేసే ప్రకటనలు కావు. నా అనుభవాల ఆధారంగా చెపుతున్న వాస్తవాలు ప్రొఫెసర్ దండవతెగారి గురించి ఎవరు ఏం చెప్పినా అది అతని జీవితానికి, వ్యక్తిత్వానికి సరిపోయేటట్టుగా వాస్తవమే అయి వుంటుంది. అతని గురించి మాట్లాడేవారంతా

నిజాయితీగా. మనస్ఫూర్తిగా మాట్లాడతారు. ఈ సందర్భంగా నేను మధు దండవతెగారి చతురోక్తిని ఒకదాన్ని గుర్తు చేసుకుంటున్నాను. "నగరాలు వాటి అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగ గుర్తింపబడతాయి. కానీ ఢిల్లీలోని చాలమంది వారి మొక్కుబడి ప్రకటనలకు గుర్తింపు పొందుతారు." ఆ పంథాని నేను అనుసరించక పోవడం అనేది ప్రొఫెసర్ దండవతెగారికి ఆనందాన్నిస్తుందేమో! మధు దండవతెగారితో నాకున్న పరిచయం, అతనితో నా అనుభవాల ఆధారంగా అతనితో పైన నేను చెప్పిన గొప్ప గుణాలను నేను ఇక్కడ పంచుకుంటాను.

తన సంభాషణలలోనూ, ఉపన్యాసాలలోనూ ప్రొఫెసర్ దండవతె చాల నిజాయితీనీ, ఉత్సాహాన్నీ కనబరచేవారు. అతని ఉపన్యాసాలు అతని పాండిత్యాన్నీ, విషయాల పట్ల అతనికున్న అవగాహననూ తెలియపరచేవి. ఒకసారి యువజనతా నియామకాల్లో భాగంగా నా ఆహ్వానం మేరకు అతను 7, జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులను, యువతను ఉద్దేశించి ఉపన్యసించారు. ఆ రోజు ఆ ఉపన్యాసం విన్న నా సహాధ్యాయి డి.కె.తివారీ (బీహార్) నాతో ఇలా అన్నాడు. "గిరీ, నేను మరోసారి దండవతెగారి ఉపన్యాసం విన్నానంటే మీ వర్గంలో చేరిపోవడం ఖాయమోయ్! అబ్బ, ఎంతటి మేథస్సు, ఎంతటి ఆకర్షణ!" మరో సందర్భంలో గాంధీ, మార్క్స్ యిద్దరి గురించీ మాట్లాడటానికి అతన్ని జె.ఎన్.యు. కి ఆహ్వానించడం జరిగింది. అతను జె.ఎన్.యు. లో ఒకటైన ఎల్. 3 లో ఉపన్యసించారు. అక్కడ ఒక అద్భుతమైన చర్చ జరిగిందని చెప్పొచ్చు. ప్రశ్నలు, వ్యాఖ్యానాలు, పరిశీలనలు వీటన్నింటితో ఆ చర్చ ఎంత ఉత్తేజకరంగా సాగిందంటే కేబినెట్ సమావేశానికి హాజరవడానికి దండవతెగారు చర్చ మధ్యనుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. అతను మరుసటి రోజు అదే సమయానికి అదే జాగాలో మళ్ళీ మమ్మల్ని కలుస్తానని మాకు వాగ్దానం చేసారు. ఆ వాగ్దానాన్ని నిలుపుకున్నారు కూడా!

నా లేత హృదయంలో అప్పుడే అంకురిస్తున్న రాజకీయ ఆలోచనలను తీవ్రంగా ప్రభావితం చేసిన గాంధీ, మార్క్స్‌ల గురించిన ఆ దండవతెగారి వుపన్యాసాన్ని గురించి నేను మరికొంచెం వివరించదలుచుకున్నాను. అతను ఈ విషయాన్ని గురించి ఒక గ్రంథమే రాశారు. గాంధీని, మార్క్స్‌నీ అంత చక్కగా సమన్వయ పరచినవారు నాకు తెలిసి మరొకరు లేరు. నిజానికి రాజకీయ, సామాజిక

చింతనగా నాకు మార్క్సిజంతో ఏ రకమైన సంబంధం లేనప్పటికీ నేను మధుగారి ఈ ఆలోచనా విధానాన్ని మాత్రం అనుసరించాను. (ముఖ్యంగా మార్క్స్ యొక్క ఆర్థిక నిర్ణయాత్మకతని నేనే మాత్రం అంగీకరించను) వ్యక్తి నిర్మాణంపై గాంధీగారి ప్రాధాన్యాన్నీ, వ్యవస్థల నిర్మాణానికి మార్క్స్ ఇచ్చిన ప్రాధాన్యతనూ సరిగ్గా సమన్వయ పరిస్తే మంచి సంస్కరణలకు ఆస్కారం ఉంటుంది. ఏదో ఒకటి మాత్రమే పట్టుకుంటే కుదరదు. ఇందులో మరో కీలకాంశం భావజాలం. అంచేత దండవతెగారి సూత్రం ప్రకారం సామాజిక , ఆర్థిక మార్పుల కోసం మనం ఒక త్రిశూల వ్యూహాన్ని అనుసరించాల్సి ఉంటుంది. వ్యక్తి, వ్యవస్థ, విచారం (ఆలోచన).

చతురతతో జవాబివ్వటానికి దండవతెగారు పెట్టింది పేరు. తమిళనాడులోని మెగాకుడ్‌లో జరిగిన ఒక వేసవి శిబిరంలో అతని అధ్యక్షతన ఒక సమావేశం జరుగుతోంది. ఆ సమావేశంలో అతని శ్రీమతి ప్రమీలగారు కూడా పాల్గొన్నారు. ఆమె చర్చ మధ్యలో జోక్యం చేసుకోబోయినప్పుడల్లా అధ్యక్షస్థానంలో ఉన్న దండవతె గారు అడ్డుకున్నారు. ఆమెని మాట్లాడనివ్వమని దండవతెగారి మిత్రుడు ఎరాసెళియన్ దండవతెగారిని అభ్యర్థించాడు. సెళియన్‌గారి మద్ధతు చూసుకని ప్రమీలగారు యిలా అన్నారు. “నేను మీ భార్యను కదా అని, మీరు నన్ను చర్చలో జోక్యం చేసుకోనివ్వటం లేదు.” ఆ మాటలకు ఏ మాత్రం కంగారు పడకుండా దండవతెగారు అన్నారు కదా! “నేను నీ భర్తగా రూలింగ్ ఇవ్వలేదు. సభాధ్యక్షుడిగా నీ జోక్యాన్ని అడ్డుకున్నాను. అది సభాధ్యక్షుడి అధికారం.” ప్రమీలగారికి దండవతెగారు యిచ్చిన ఈ చతురమైన జవాబుకి సభలో నవ్వులు విరిసాయి. అది దండవతెగారి హాస్య చతురత. ఆయన తరచుగా చెప్పేవారు హాస్యం మందుగా పనిచేస్తుందనీ, అన్నిటినీ సరిచేస్తుందనీ!

జనతా నాయకుడు, పార్లమెంట్ సభ్యుడు సయ్యద్ షాబుద్దీన్ కూడా ఆ రోజు ఆ చర్చలో పాల్గొన్నారు. లౌకిక వాదానికి సంబంధించి జరిగిన చర్చలో షాబుద్దీన్‌గారికీ, అక్కడ ఉన్న యితర సభ్యులకూ అభిప్రాయ భేదం వచ్చింది. అప్పుడు దండవతెగారు షాబుద్దీన్‌ని యిలా ప్రశ్నించారు. “మీరు కోరుకుంటున్న ఏదైనా మార్పు ఖురాన్‌లో చెప్పబడ్డదానికి భిన్నంగా ఉంటే అప్పుడు మీరెటు వైపు నిలుస్తారు?” ఖురాన్‌కు భిన్నంగా తన ఆలోచనా విధానం ఉండదనీ, ఎందుకంటె మానవాళికి మంచి చేసే మార్పులన్నింటినీ ఖురాన్ అంగీకరిస్తుందనీ షాబుద్దీన్

జవాబిచ్చాడు. దండవతెగారు ఈ విధంగా రెట్టించారు! “మాకు ఖురాన్‌లో ఏముందో తెలీదు. అంచేత ఒకవేళ అలా ఏదైనా మార్పు, ఖురాన్‌కి భిన్నంగా వుండి ఘర్షణ ఏర్పడితే (అనుకుందాం) మీరెటువైపు నిలుస్తారు?” దీనికి కొంచెం ఖంగు తిన్న షాబుద్దీన్ ఒక ముస్లిమ్‌గా తాను ఖురాన్ వైపే నిలుస్తానని జవాబిచ్చారు. దాంతొ దండవతెగారు చర్చను ఇలా ముగించారు. “షాబుద్దీన్ ప్రజాస్వామ్యం వైపుగాక దైవపాలన వైపు నిలబడడం వలన నేను అతని అభిప్రాయంతో విభేదిస్తున్నాను.” లౌకికవాదం మీద దండవతెగారి అభిప్రాయాన్ని తెలియజెయ్యడానికే నేను ఈ ఉదంతాన్ని యిక్కడ చెప్పాను. ఎన్నో మతపరమైన విభేదాలు పొడసూపుతున్న ప్రస్తుత కాలంలో ఈ ఆలోచనా విధానానికి చాలా ప్రాముఖ్యత ఉంది. లౌకికవాదానికి సరైన భాష్యం చెప్పుకోవాల్సిన అవసరం నేటి పరిస్థితిలో చాల అవసరం.

ప్రొఫెసర్ దండవతెని చాల సందర్భాలలో జె.ఎన్.యు. కి అహ్వానించడం జరిగింది. అటువంటి ఒక సంఘటన నేను చెప్పబోతున్నాను. 1980లో జయప్రకాశ్ నారాయణగారి స్మారక ఉపన్యాసం యివ్వడానికి దండవతెగారు జె.ఎన్. యు.కి వచ్చారు. ఉపన్యాస శీర్షిక “జయప్రకాశ్ నారాయణ్– వ్యక్తి, ఆలోచనలు” ప్రశ్నలు, జవాబుల సమయంలో ప్రేక్షకుల నుంచి ఎవరో ఇలా అన్నారు. గాంధీగారి తర్వాత అంతటి స్వాతంత్ర్యయోధుడు జె.పి.గారే” అని. దీనికి అభ్యంతరం చెపుతూ వేరొకరు అన్నారు. “గాంధీగారి తరవాత అంతటి వ్యక్తి అనడం జె.పి.ని కంచపరచడమే అని. జె.పి.గారు స్థాపించిన జనతాపార్టీ విడిపోవడం వలన అతను విఫలమైనట్టే అని వేరొకరు వ్యాఖ్యానించారు. దండవతెగారు తనదైన శైలిలో అన్నీ విని జవాబిచ్చారు. సాధారణంగా ఇటువంటి సందర్భాలలో అతను కవిత్వాన్నీ, హాస్యాన్నీ ఊతం చేసుకునేవారు. దాంతో ఘర్షణ వాతావరణం మాయమై వాతావరణం చల్లబడేది. ఈ సందర్భంలో అతను యిలా జవాబిచ్చారు. “ఒక గొప్ప కారణం కోసం మరణించేవారు ఎప్పుడూ విఫలమైనట్టు కాదు” ఇది ప్రముఖ కవి బైరన్ చెప్పిన మాటలు. ఈ మాటలను దండవతెగారు ఉటంకించడంతో సభాసదులు అంగీకార సూచకంగా మౌనం వహించారు. వాతావరణం చల్లబడింది.

ఆయన నిరాడంబత్వాన్నీ, వినయాన్నీ తెలియజేసే రెండు సంఘటనలు చెప్పదలచుకున్నాను. ఆయన ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు ఒకసారి కొంతమంది

మిత్రులతో కలిసి నేను అతన్ని చూడటానికి వారింటికి వెళ్ళాను. నేను నా కూడా తీసుకువెళ్ళిన వారంతా యువకులు. అతను తన ఇంటికి వచ్చిన అతిథులకు మహారాష్ట్రలోని అతని నియోజకవర్గం రాయాపూర్‌లో దొరికే ప్రత్యేకమైన 'టీ' తీసుకు రమ్మని చెప్పగానే నౌకరు ఆ రకమైన టీ అందరికీ అందించి తనేదో పనిమీద బయటకు వెళ్ళాడు. కాసేపటికి నాకు టీ అందలేదని గమనించిన దండవతెగారు "గిరీ! అయ్యో, నీకు టీ యివ్వలేదా?" అని అడిగారు. మేమంతా ఆశ్చర్యంతో చూస్తుండగా అతను కుర్చీలోంచి లేచి, వంటింట్లోకి వెళ్ళి అక్కడ మిగిలిన వేడినీటితో తనే స్వయంగా టీ తయారుచేసి నాకు తెచ్చియిచ్చారు. అది అతని వినయ సంపత్తి!

అతనికి చాలా కాలం వరకు, అంటే యించుమించు అన్ని పదవులను త్యజించే వరకు స్వంతానికి కారులేదు. లోక్‌సభ సభ్యునిగా ఉన్నప్పుడు అతను ప్రభుత్వం వారికిచ్చే వాహనంలో ప్రయాణించేవారు. మంత్రిగా ఉన్నప్పుడు కూడా ప్రభుత్వ వాహనాన్నే వినియోగించేవారు. తనకి ప్రభుత్వ వాహనం లేనప్పుడు అతను పార్లమెంట్ ప్రాంగణంలో ఉన్న బ్యాంకుకు వెళ్ళి కారు కొనుక్కునేందుకు రుణం కావాలని దరఖాస్తు చేసారు. నాకు తెలిసి అతను ఒక చిన్న ఫియట్ కారు కొనుక్కున్నారు. తరవాత తన కవసరం లేనప్పుడు దాన్ని ఒక ఫౌండేషన్‌కు దానం చేశారు.

చాలామంది నాయకుల మాదిరిగా కాకుండా దండవతెగారు సమయ పాలకులు. సమయానికి వచ్చిన వారిని అతను మెచ్చుకునేవారు. ఒక సందర్భంలో 'అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ సోషలిజం' అనే సోషలిస్టు సంఘం సమావేశం జరగాల్సి ఉంది. అతను కొన్నాళ్ళు ఆ సంఘానికి అధ్యక్షుడుగా కూడా ఉన్నారు. ఆ సమావేశం 10, అశోకా రోడ్ లోని అతని నివాసంలో జరగాల్సి ఉంది. ADS లో సభ్యులమైన నేను, ప్రొఫెసర్ టి.కె. ఊమ్మెన్ సరిగ్గా నాలుగింటికి దండవతెగారింటి తలుపు తట్టేం. దండవతెగారే తలుపు తెరిచారు. మేం కుర్చీలలో కూర్చున్నాక అతను మమ్మల్ని యిలా అడిగేరు. "మీ సమయ పాలనని నేను మెచ్చుకోకుండా వుండలేకపోతున్నా. కానీ ఊమ్మెన్, ఒకటి చెప్పండి. సరిగ్గా నాలుగింటికి రావడం ఎలా సాధ్యపడింది?" సరిగ్గా నాలుగు కొట్టే వేళకి ఉండడం అనేది కాస్త అసాధ్యమే కనుక మాకు దండవతెగారి ఆశ్చర్యం అర్థమైంది.

నవ్వుతూ ఊమ్మెన్ జవాబిచ్చారు. "ప్రొఫెసర్ దండవతె, సరిగ్గా చెప్పిన సమయానికే రావడం సాధ్యం కాదని మాకూ తెలుసు. అందుకే మేం అయిదు నిమిషాలు ముందుగానే వచ్చి మీ తోటలో చెట్టు క్రింద విశ్రాంతి తీసుకుని నాలుగింటికల్లా ఇక్కడ చేరాం." దండవతెగారి ఆసక్తి, నిరాడంబరత పసిపిల్లాడిని తలపిస్తాయి.

హృదయం నిర్మలంగా ఉండి, నిజాయితీతో ఉండే మనుషులు తొందరగా కన్నీళ్ళు పెట్టుకుంటారని మనస్తత్వ శాస్త్రవేత్తలు చెపుతారు. దండవతెగారు కన్నీళ్ళు పెట్టుకోవడాన్ని నేను రెండుసార్లు చూసాను. ఒకసారి ఒక రోడ్డు ప్రమాదంలో గాయపడి రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దండవతెగారిని నేను చూడబోయాను. అతను చలికాలం ఉదయపు నడకకి వెళ్తుండగా పొగమంచు కారణంగా దారి కనపడక, వెనుక నుంచి వచ్చిన ఆటోరిక్షా అతన్ని గుద్దేసింది. కొత్తగా పెద్ద దెబ్బలేమీ తగలక పోయినా, గోవా విముక్తి ఉద్యమంలో పోర్చుగీసు పోలీసుల చేతిలో దెబ్బలు తిన్నప్పుడు విరిగిన ఎముకల తాలూకు నొప్పి ఈ గాయంతో తిరగబెట్టింది. మేం వెళ్ళినప్పుడు ఆ ఆందోళన సమయంలో తన స్నేహితులు, అనుచరులు పోర్చుగీసు పోలీసుల చేతిలో ఎలా దెబ్బలు తిన్నదీ, ఎలా అమరులైనదీ తల్చుకుని ఆయన కన్నీరు పెట్టుకున్నారు. ఆ జ్ఞాపకాలు తల్చుకున్నప్పుడల్లా ఆయన కంటతడి పెట్టుకునేవారు.

రెండవ సందర్భం మేం అతన్ని పరాంధ్వాడీ సమావేశానంతరం అతని యింటి వద్ద కలిసినప్పుడు జరిగింది. అది ఒక బాధాకర సన్నివేశం. పుణె వద్ద గల పరాంధ్వాడీలో జరిగిన పార్టీ సమావేశంలో చంద్రశేఖర్ తరువాత దండవతెగారిని పార్టీ దేశ అధ్యక్షునిగా ఎన్నుకోవలసి ఉంది. కానీ అది జరగలేదు. ఎందుకు జరగలేదు నేనిక్కడ చెప్పదల్చుకోలేదు. దండవతెగారి స్నేహితులు, అనుచరులు అంతా చాలా నిరాశపడ్డారు. ఆయన ఇంటివద్ద కలిసినప్పుడు ప్రమీలగారి సమక్షంలో నేను నా యవ్వనోద్రేకంతో యిలా ఆక్షేపించాను. "సర్, మీరు బలహీనపడి మీ అనుచరులందరినీ ముంచేసారు కదా!" దీనికి దండవతెగారు చాలా కోపగించుకుని నా మీద గట్టిగా అరిచేరు. "ఓహ్! నేను రాజకీయాలు ఎలా చెయ్యాలో నువ్వు నాకు నేర్పుతావా? జె.ఎన్.యు,లో నాలుగు సమావేశాలు నిర్వహించి, హాజరైనంత మాత్రాన నాకు సలహా యివ్వగలిగేంత వాడివయ్యావా?" అని అతను నా మీద అరిచారు. అతని ఈ అసాధారణ ప్రతిస్పందనకి ఆశ్చర్యపడ్డ

నేను మౌనం వహించాను. ఎప్పటిలాగానే ప్రమీలగారు నన్ను సమర్థిస్తూ "నువ్వెందుకు అతని మీద అరుస్తున్నావు? అతను ప్రజల మనోభావాలను గుర్తించి తన ఉద్దేశ్యం చెప్పాడు. అంతే!" అన్నారు. దాంతో దండవతెగారు మౌనం వహించి, దిగులుగా ఉన్న నా మొహాన్ని చూస్తూ చర్చను మరో విషయం మీదికి మరల్చారు.

తరవాత మమ్మల్ని సాగనంపటానికి గేటు వద్దకి వచ్చినప్పుడు దండవతెగారు నా భుజాలపై చేతులు వేసి యిలా అన్నారు. "గిరీ! నీతో దురుసుగా ప్రవర్తించినందుకు క్షమించవోయ్! బహుశా నీ ప్రతిస్పందన సరైనదే కావచ్చు. కానీ పార్టీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల నుంచి తప్పుకుని నేను చేసిన పని కూడా సరైనదే. మీ లాంటి యువకులు చెప్పినట్టుగా నేను అన్ని విషయాలు నలుగురిలో చెప్పలేను. నిన్ను బాధపెట్టేను గనక నీకు మాత్రమే చెప్పాను. విను, నన్ను పోటీ చెయ్యమని అడిగి, నా పేరుని ప్రతిపాదించిన వారే నన్ను తప్పుకోమని అడిగారు. (వీరు నా దగ్గరి స్నేహితులు. ఒకరు ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి, ఇంకొకరు అతనికి అనుంగు మిత్రుడు.) ఒకవేళ నేను వారి మాట కాదంటే నాకు వ్యక్తిగతంగా ఎదగాలనే దురాశ ఉన్నట్టే కదా! కానీ నాకటువంటి ఉద్దేశ్యం లేదు. నేను నా మిత్రులను గౌరవిస్తాను. నా పార్టీకి ప్రతినిధిని. వ్యక్తిగత కాంక్షలు ఏమీ లేవు" ఈ మాటలంటూండగా అతని చెక్కిళ్ళపై కన్నీళ్ళు కారుతూ ఉన్నాయి. అది నాకు తెలిసిన ఒక మనీషి విశిష్ట వ్యక్తిత్వం.

# రెండంగుళాల ఫోమ్ – గతం, వర్తమానం

**– రామచంద్ర గుహ**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁂

ఈ మార్పుని ప్రవేశపెడుతున్నప్పుడు దండవతె గారు అన్నారు కదా – "నేను మొదటి తరగతి వారి సౌకర్యాలను తగ్గించాలనుకోవటం లేదు. రెండవ తరగతి వారి స్థాయిని పెంచాలనుకుంటున్నాను." ఇవి నిజమైన సోషలిస్టు చెప్పే మాటలు.

సంపన్నులకి వ్యతిరేకంగా నాలుగు పడికట్టు పదాలతో కూడిన ఉపన్యాసాలు చెప్పడం కాకుండా పేదలకు ఆచరణాత్మకంగా సాయపడే నిజమైన సోషలిస్టు పలుకులివి.

దండవతె గారు రైల్వేమంత్రిగా ఉన్న రెండేళ్ళ కాలంలో అన్ని ప్రధాన రైలు మార్గాలలో ప్రయాణించే రైళ్ళలోనూ ఆ రెండు అంగుళాల ఫోమ్ పరుచుకుంది. ఒకసారి ప్రారంభమయ్యేక ఆ కార్యం ఆగలేదు. 1980 చివరికి వచ్చేవేళకి,

భారతీయ రైళ్ళు అన్నింటిలోనూ రెండవతరగతిలో చక్కటి ఫోమ్ బెర్తులు అమిరేయి. ఇప్పటికి వందల మిలియన్ల మంది ఆ సౌకర్యాన్ని అనుభవిస్తున్నారు. భారతీయ రైల్వేల సామాజిక చరిత్ర ఎవరైనా రచిస్తే దాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు. 'మధు దండవతెకి ముందు, దండవతె తరువాత' అని.

# సభలో చెణుకులు

**– మధు దండవతె**

అనువాదం : **అరుణా ప్రసాద్**

⁂ ⁂ ⁂

ఒక సందర్భంలో లోక్‌సభ మాజీ డెప్యూటీ స్పీకర్ ప్రొఫెసర్ జి.జి. స్వెల్‌గారు సభలో మాట్లాడినదేదైనా సరే రికార్డులకెక్కుతుందని అన్నారు. తన అత్యుత్సాహంతో అతను యిలా అన్నారు – "నేను నా భార్య గురించి మాట్లాడినా సరే, ఆమె కూడా పార్లమెంటరీ రికార్డులకెక్కుతుంది" అని.

దీనికి ఒక సభ్యుడు యిలా చెణుకు విసిరాడు – "సర్, దయచేసి మీ భార్య గురించి మాట్లాడకండి. లేదంటే ఆమెని సభలో టేబుల్‌పై ఉంచాలని ఎవరైనా డిమాండ్ చెయ్యొచ్చు. సభలో ఏదైనా పత్రం గురించి మాట్లాడితే, సభ్యులు కోరినప్పుడు ఆ పత్రాన్ని సభలో ఉంచాలని ఆ సభ్యుడికి తెలిసే ఇలా అన్నాడు.

– – –

భారత్ భూభాగంలోకి చైనా చొచ్చుకు వస్తున్న రోజుల్లో ప్రధానమంత్రి నెహ్రూగారు సభకు ఇలా హామీ యిచ్చారు. "మన భూభాగంలో ఒక అంగుళం

కూడా చైనాకు వదులుకోము, అని ఇది వింటూనే ఎప్పుడూ చురుగ్గా ఉండే హెచ్.వి.కామత్‌గారు సభలో లేచి నిలబడి ప్రధానమంత్రిని ఇలా ప్రశ్నించారు – "మీ మ్యాప్ (దేశపటం)లో అంగుళం అంటే ఎన్ని మైళ్ళు?" ఈ చతురోక్తికి ప్రధానమంత్రితో సహా సభ అంతా నవ్వుల్లో మునిగిపోయింది.

---

శ్రీ మహావీర్ త్యాగి గారి చతురోక్తి ఒకటి. భారతదేశపు ఉత్తర సరిహద్దులో ఉన్న బంజరు భూమిని చైనా ఆక్రమించుకుంటున్నప్పుడు ఆ భూమి గురించి మాట్లాడుతూ ప్రధానమంత్రి నెహ్రూగారు ఇలా అన్నారు – "చైనా వాళ్ళు రహదారులు నిర్మిస్తున్న భూమిలో గడ్డి కూడా మొలవదు, మనిషన్నవాడు కనిపించడు." దీనికి శ్రీ మహావీర్ త్యాగి గారు వెంటనే. తన బట్టతలని చూపిస్తూ యిలా అన్నాడు – "సర్, గత కొన్నేళ్ళుగా ఈ తల మీద కూడా ఒక్క వెంట్రుకా మొలవలేదు. అలా అని నేను తలను శత్రువుకి స్వాధీనం చెయ్యాలా?" దీంతో ప్రధానమంత్రి సహా సభలో నవ్వులు విరిసాయి.

---

స్వాతంత్ర్యం రాకముందు సెంట్రల్ లెజిస్లేచర్‌లో ఒకసారి బడ్జెట్ పై చర్చ జరుగుతోంది. ఆర్థిక మంత్రి రాయిస్మన్ గారు ఉప్పు (సాల్ట్) మీద పన్ను గురించి. మాట్లాడుతుండగా ఒక సభ్యుడు 'తమరు ఏ సాల్ట్ తీసుకుంటారు?' అని అడిగేరు. దానికి ఒక్క క్షణం కూడా వ్యవధినివ్వకుండా శ్రీ ఎన్.వి.గాడ్గిల్ గారు 'ఆయన సోమర్‌సాల్ట్ (పిల్లిమొగ్గలు) తీసుకుంటారు' అన్నారు. దాంతో సభలో నవ్వుల జల్లు కురిసింది.

---

ఒక సందర్భంలో రాజ్యసభలో ఏదో చర్చ జరుగుతుండగా కాస్త లావుగా ఉండే సభ్యుడు శ్రీ పిలూ మోడీగారు వెనక్కి తిరిగి మహిళా సభ్యురాలొకరితో మాట్లాడుతూ ఉన్నారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తుతున్న సభ్యుడు శ్రీ మోడీ గారు అధ్యక్షునివైపు వీపు త్రిప్పి  ఉంచడాన్ని గమనించి, ఆయన అధ్యక్షస్థానాన్ని అగౌరవ పరుస్తున్నారని అధ్యక్షుని దృష్టికి తెచ్చారు. దీనికి జవాబిస్తూ పిలూ మోడీ గారు అన్నారు కదా – "నాకు తెలిసి నాకు వెనక, ముందులేవు. నేను గుండ్రంగా ఉంటాను."

---

కాస్త పొట్టిగా ఉండే డెప్యూటీ స్పీకర్ శ్రీ జి. జి. స్వెల్ గారు ఒకసారి ఒక సభ్యునితో కోపంగా ఇలా అన్నారు – "నేను నిలబడి ఉండగా, మీరు నిలబడొద్దు".

దానికి ఆ సభ్యుడు వెంటనే ఇలా బదులిచ్చాడు – "సర్, మీరు నిలబడ్డారని నాకు నిజంగానే తెలియలేదు. సుమండీ!"

---

ఒకసారి సభలో ప్రశ్నోత్తరాల సమయం నడుస్తుండగా స్పీకర్ డా. జి.ఎస్. థిల్లాన్ గారు సభ్యురాలు కుమారి కమలా కుమారి గారి పేరు పిలిచి ఆమె పేరున ప్రశ్న ఉందని చెప్పారు. దానికి ఒక సభ్యుడు 'కుమారి' అని రెండుసార్లు ఎందుకు పలకాల్సి వచ్చిందని వాకబు చేయగా స్పీకర్ సరదాగా ఇలా అన్నారు –

"గట్టిగా నిర్ధారించుకోవడానికి..."

---

ఒక సందర్భంలో 'జీరో అవర్'లో ఏదో విషయాన్ని లేవనెత్తడానికి శ్రీ మధులిమాయెగారు గట్టిగా తీర్మానించుకున్నారు. అంతకు ముందే ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ, సభ సజావుగా నడవాలంటే ఆ విషయం లేవనెత్తడానికి తనకి అవకాశం యివ్వాలని బెదిరిస్తూ అతను స్పీకర్‌కు లేఖ రాసి ఉన్నారు. ప్రశ్నోత్తరాల సమయం ముగిసేక, 12 గంటల వేళ శ్రీ లిమయెగారు పైకి లేచి గట్టిగా బొంగురు గొంతుతో స్పీకర్‌కు వినతి చెయ్యసాగారు. గానీ స్పీకర్ గారు ఏమీ చలించలేదు. శ్రీ లిమాయె గారికీ, స్పీకర్‌కూ మధ్య చిన్నపాటి వాగ్యుద్ధం నడిచింది. సభలో వాతావరణం వేడెక్కింది. అలా గట్టిగా అవమానకరంగా మాట్లాడం ద్వారా లిమాయె గారు అధ్యక్షస్థానాన్ని అవమానిస్తున్నారని స్పీకర్ హెచ్చరించారు. వాతావరణాన్ని చల్లబరచడానికి నేను పైకి లేచి స్పీకర్‌గారితో ఇలా అన్నాను – "సర్, లిమాయె గారి పెద్ద గొంతుని తప్పుగా అర్థం చేసుకోకండి. ఆయన ఇంటి వద్ద వారి శ్రీమతితో కూడా ఇలానే మాట్లాడతారు."

దీంతో సభలో నవ్వులు విరిసాయి. స్పీకర్‌గారు, లిమాయెగారు కూడా దీనికి శృతి కలిపారు. వాతావరణం చల్లబడడంతో మధు లిమాయె గారు మాట్లాడడానికి స్పీకర్ అనుమతినిచ్చారు.

---

ఒకసారి అవిశ్వాస తీర్మానం మీద జరుగుతున్న చర్చలో ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ ప్రతిపక్షాల మీద విరుచుకు పడుతున్నారు. నేను మెల్లగా లేచి ప్రధానమంత్రితో ఇలా అన్నాను – "మేడమ్, కొన్ని రోజుల ముందే మీరు యు.ఎస్. పర్యటనలో ఉండగా మేం మిమ్మల్ని టెలివిజన్‌లో చూసాం. అప్పుడు మీరెంతో ఆకర్షణీయంగా, మధురంగా ఉన్నారు. ఇప్పుడు దేశానికి తిరిగి వచ్చాక ఇలా కటువుగా ఉన్నారెందుకు?"

దీనికి సభంతా నవ్వుల్లో మునిగిపోయింది. ప్రధానమంత్రి కూడా నవ్వులతో శృతి కలిపారు. ఆ తరవాత ఆమె ఉపన్యాసంలో వేడి తగ్గింది.

---

అధికార పార్టీ సభ్యుడైన శ్రీ మూల్ చంద్ ధాగా గారు తరచూ ప్రభుత్వ బిల్లులను విమర్శిస్తూ ఉండేవారు. దీనికి శ్రీ వెంకటరామన్ గారు తనదైన హాస్య చతురతతో ఇలా అన్నారు – "శ్రీ ధాగా గారు మా గోల్ కీపర్. అతను తరచూ మా మీదే గోల్స్ చేస్తూ ఉంటారు."

---

ఆరవ లోక్ సభలో రైల్వే మంత్రిగా నేను రైల్వే బడ్జెట్ మీద ఉపన్యసిస్తున్నాను. ఒక సభ్యుడు లేచి బీహార్ ఉద్యమ సమయంలో అక్కడ రైళ్ళ మీద రిజర్వేషన్ వాదులు, రిజర్వేషన్ వ్యతిరేక వాదులూ కూడా ఎందుకు దాడి చేస్తున్నారని ప్రశ్నించాడు. అవసరంగా రాద్ధాంతం చెయ్యడం, యిష్టం లేక నేను ఇలా తప్పించాను – "ఎందుకంటే రైళ్ళలో 'రిజర్వ్‌డ్' బోగీలు, 'అన్ రిజర్వ్‌డ్' బోగీలు రెండూ ఉంటాయి గనక."

# మార్క్స్ అండ్ గాంధీ

**– మధు దండావతే**

అనువాదం : **రావెల సాంబశివరావు**

❊ ❊ ❊

**1**975లో అత్యయిక స్థితి ప్రకటించగానే నన్ను బెంగుళూరు కేంద్ర కారాగారంలో నిర్బంధించినపుడు నేను కారల్‌మార్క్స్, మహాత్మాగాంధీల తులనాత్మక అధ్యయనాన్ని ఒక చిరుపొత్తంగా రూపొందించాను.

జైలు జీవితంలో కొన్ని అనుకూలతలున్నట్టే కొన్ని పరిమితులూ ఉంటాయి. గ్రంథసృజనకు అత్యావశ్యకమయ్యే చిత్తశాంతిని, ప్రశాంతతను అది ప్రసాదిస్తుంది. ఇక అననుకూలతల విషయానికొస్తే తక్షణమే కావలసిన సమాచారం అందుబాటులో వుండదు.

అయితే సోషలిస్టు పార్టీ కేంద్ర కార్యాలయానికి చెందిన నా అనుచరుడు శ్రీ రామకృష్ణన్ నాకు కావలసిన చాలా సమాచారాన్ని మార్క్సుకు గాంధీకి సంబంధించిన పలు ప్రామాణిక గ్రంథాల ద్వారా అందించారు.

గాంధీగారి రచనల నుండి నాకు కావలసిన ఎంతో సమాచారం కారాగార గ్రంథాలయం నుండి లభించింది. "సోషలిజమ్ అండ్ పెజంట్రీ (సామ్యవాదం–

రైతాంగం) అనే అశోక్ మెహతాగారి గ్రంథం నాకు లభించి వుండకపోతే రైతాంగం పట్ల మార్క్స్ వైఖరికి సంబంధించిన అవగాహన నాకు అందుబాటులోకి వచ్చి వుండేది కాదు.

గౌరవనీయ అనుచరుడు శ్రీ ప్రేమ్ భాసిన్ వ్రాత ప్రతిని శ్రద్ధగా పరిశీలించి తన కుశాగ్ర బుద్ధితో చేసిన విలువైన సూచనలు ఈ గ్రంథానికి మరింత మెరుగులు దిద్దేందుకు పనికివచ్చాయి.

మార్క్స్ గాంధీ రచనల నుండి నేను విరివిగా ఉటంకించాననే విషయం నాకు తెలుసు. అయినా నేను వాళ్ళ వైఖరిలోని వైరుధ్యాలను వెలికి తీసాను. వాటికి సంబంధించిన వాళ్ళ మాటల్నే చెప్పటం సమంజసమనుకున్నాను. అలా అయితేనే నేను వాళ్ళ అభిప్రాయాలపై వ్యాఖ్యానాలు చేసే సందర్భాలలో వాళ్ళ అభిప్రాయాల సాధికారతను గూర్చిన అనుమానాలు పొడసూపవు. ఈ స్వల్ప ఆధ్యయనంలోని వివరణంతా గత మూడు దశాబ్దాలుగా నేను వినమ్రతతో పాల్గొనే అవకాశం లభించిన భారతదేశంలోని సోషలిస్టు ఉద్యమం మార్క్స్ గాంధీలను నిరంతరం మదింపు చేస్తూ, విలువకడుతూ వచ్చిన దాని ఫలితమే.

ఈ విధమైన నా యీ వివరణను క్లుప్తంగా చెప్పేందుకు "ఎకనామిక్స్ ఆఫ్టర్ మార్క్స్" (మార్క్స్ తరువాత ఆర్థికశాస్త్రం) అనే డా॥రామమనోహర లోహియా గ్రంథం నుండి ఈ క్రింది మాటల్ని ఉపయోగించుకుంటాను.

"రాజకీయ పోరాటానికి ఏ ఒక్క వ్యక్తి ఆలోచన కేంద్ర బిందువు కారాదు. ఆ ఆలోచన అతనికి సాయపడేదిగా ఉండాలేతప్ప పెత్తనం చెలాయించేదిగా వుండరాదు. అంగీకరించటం, తృణీకరించటం అనేవి రెండూ కూడ మూఢభక్తికి విభిన్నరూపాలు, గాంధేయునిగానో, మార్క్సువాదిగానో నిలిచిపోవటం ఎంత తెలివి తక్కువపనో గాంధీవాదానికి, మార్క్సువాదానికి వ్యతిరేకంగా నిలవటం కూడా అంతే. గాంధీ నుండి మార్క్స్ నుండి గ్రహించగలిగిన అమూల్య సంపద అపారం. అయితే అలా గ్రహించేందుకు మనం ఆధారపడే చట్రం యుగాలకు, వ్యక్తులకు అతీతంగా వుండాలి."

బెంగుళూరు కేంద్ర కారాగారం
14 నవంబరు 1975

# మరణపు అవధులు దాటి....

**– ఉదయ్ దండావతే**

అనువాదం : **రావెల సాంబశివరావు**

⁂

"సంతానంలోనూ, యువతరంలోనూ మనం
చిగురించగల్గితే మన మరణం అంతిమ దశకాదు
ఎందువల్లనంటే వాళ్ళే మనం గనుక, జీవన
వృక్షంపై మన శరీరాలు పండుటాకులు మాత్రమే."

– ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్

నా కన్న తండ్రి చనిపోయిన సందర్భంగా సంతాపం ప్రకటించే సమయంలో నా మానసిక స్థితికి ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ సాంత్వనపు పలుకులు అతికినట్లు సరిపోతాయి. ముంబాయిలో సంతాపసభలో మాట్లాడేందుకు లేచి నిలబడగానే ఆ క్షణపు వింత వెలుగులో నేనాయన్ని చూచినట్లనిపించింది. ఆయన జీవించివున్న రోజుల్లో కూడ నేనాయన దరికి జేరింది భౌతిక బంధంవల్ల కాదనీ, ఆయన ఆదర్శాలు, మమకారం, సంకల్పబలం, ఆశావాదం నన్నాయన అక్కున జేర్చాయనీ ఆ క్షణంలో

అర్థమయింది. మేము కలిసి జీవించిన గృహంలో కంటే నా ఊహల్లోనే ఆయన నాకు అతి సన్నిహితుడు.

నేను మైక్ ముందు నిలబడి శ్రోతలవంక చూడగానే చీమ చిటుక్కుమన్నా విన్పించేంతటి నిశ్శబ్దం, ఓ క్షణంపాటు చోటుచేసుకొంది. ఆ క్షణం నాకు గుర్తుచేసిందే మంటే– జీవనయానంలో తమతో కలిసి పయనించిన ప్రజల జ్ఞాపకాలలో అమ్మ, నాన్న ఇరువురూ కలిసి ఇప్పుడు సజీవంగా ఉన్నారని, నా తల్లిదండ్రులు భౌతికంగా దూరమయ్యారని దురపిల్లటంవల్ల ప్రయోజనం లేదనిపించింది. ఎందువల్లనంటే వాళ్ళస్ఫూర్తి, ఆదర్శాలు ఏళ్ళతరబడి నా హృదయంలో తప్పక తిష్టవేస్తాయి. వాళ్ళ జీవితకాలంలో వాళ్ళు ఎంచుకున్న మార్గంలో ప్రదర్శించిన నిజాయితీ కారణంగా ఎందరో వారిపట్ల ఆకర్షితులయ్యారనటానికి తార్కాణం పెద్ద సంఖ్యలో హాజరైన ఈ ప్రజలే. నా తల్లిదండ్రులతో కలిసి ఎంచుకున్న ఆ మార్గంలోనే వారు తమ పయనాన్ని కొనసాగిస్తే మా అమ్మానాన్నల స్ఫూర్తిని వాళ్ళు నిలబెట్టిన వారవుతారు. నా తల్లిదండ్రులు నా సమక్షంలోనే ఉన్నట్లుంటుంది. అశోక్ సస్వాద్‌కర్ సురేఖా దాల్వి, మేథాపాట్కర్‌వంటివాళ్ళు అట్టడుగు ప్రజల ఉజ్జ్వల భవిష్యత్తుకోసం కలలుకంటూ తమ జీవితాలను అంకితం చేసే కృషిలో మా అమ్మానాన్నలు సజీవంగా నిలిచివుంటారు.

మిగ్‌నాన్ మెక్‌లాలిన్ తన న్యూరాటిక్స్ నోట్‌బుక్ (1960) (మానసిక నరాల బలహీనతల ఉద్దేశిక) లో యిలా వ్రాస్తారు. “మన మెరిగిన వారి మరణం నిరంతరం మనమింకా జీవించే ఉన్నామనే విషయాన్ని మనకు గుర్తుకు తెస్తూంటుంది–బహుశా దాని ప్రయోజనాన్ని మనం తప్పక పునఃసమీక్షించు కోవాలని. నాన్న మరణం వల్ల నేను తెలుసుకున్నదేమంటే అమ్మనాన్నల నుండి నేను వాస్తవంగా పొందిన వారసత్వం అణగారిన అట్టడుగు ప్రజానీకం ఉద్ధరణకు వాళ్ళవలె నడుం బిగించటమే. ప్రత్యేకించి నా మాత్రపు జీవితానికి కూడ నోచుకోని వాళ్ళపట్ల సహానుభూతిని ప్రకటించే నైపుణ్యాన్ని నాన్న నాలో జాగృతం చేసారని అర్థమయింది. ఆయన వల్ల నాకు ప్రజల కళ్ళలోని బాష్పకణాలను గుర్తించే విద్య అబ్బింది. న్యాయం కోసం నిలబడటం ఎలాగో అమ్మ నాకు నేర్పిందని అర్థమయ్యింది. నా హక్కులకోసం నేను పోరాడటమే గాక వాళ్ళ హక్కుల కోసం

వాళ్ళు పోరాడలేని వాళ్ళ తరపున నిలబడి పోరాడటం కూడ ఆమే నాకు నేర్పింది. కోపం పెల్లుబుకటం సహజమే అయినా దానిని నిర్ణీతమైన క్రియాత్మక చర్యల వైపుకు మళ్ళించటం ముఖ్యమని నేను అమ్మ నుండి నేర్చుకుంటే నాన్న నుండి సమతౌల్యాన్ని పాటించడం అలవడింది. వాళ్ళిరిరువురూ, ఇన్నాళ్ళూ, కళల్లో, ప్రకృతిలో, ప్రజల్లో పలకరించే అందాల్ని ఆస్వాదించే గుణాన్ని అలవర్చుకునేందుకు ప్రోత్సాహాన్ని యిస్తూ వచ్చారు.

నా మనోఫలకంపై చెరగని ముద్రవేసిన అనేక ఘటనలు నా జ్ఞాపకాల దొంతరల్లో ఉన్నాయి. ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొనే తరుణంలో వాళ్ళు ప్రదర్శించిన ధైర్య సాహసాలు నాకు ప్రోత్సాహాన్నందించేవి. అయితే కొన్నిసార్లు నేను భయ కంపితుణ్ణయ్యే వాణ్ణి– మరీ ముఖ్యంగా కమ్యూనిస్టు నేత కృష్ణదేశాయి హత్యానంతరం గురి మా నాన్న వైపేనని తెలిసిన తరువాత. ఆయన్ని మాత్రం యిదేమీ కలవరపెట్టినట్లు లేదు. మరణాన్ని లక్ష్య పెట్టకుండానే రోజువారీ కార్యక్రమాల్లో ఆయన తలమునకలయ్యేవారు. శివ సైనికుల హెచ్చరికలకు అదరక, బెదరక మునిసిపల్ కౌన్సిలర్‌గా మా అమ్మ తన కర్తవ్యాన్ని కొనసాగిస్తూండేది. అది నాకెంతో గర్వకారణం. గత శతాబ్దపు అరవయ్యవ దశకపు చివరి భాగంలో శివసైనికులు చేపట్టిన విధ్వంసకాండ సందర్భంగా నేను ఆమెతో కలిసి ముంబాయిలో తిరిగిన జ్ఞాపకాలు స్పష్టంగా గుర్తుకు వస్తాయి. భివాండీ మత కల్లోలాల సందర్భంగా క్షతగాత్రులకు బట్టలు తీసికెళ్ళి ఇవ్వటం నా కింకా గుర్తే. శ్రీమతి గాంధీ పాశవికంగా హత్యగావించబడినప్పుడు నాన్నా, నేనూ కలిసి ముంబయి నుండి ఢిల్లీకి రాజధాని ఎక్స్‌ప్రెస్ ప్రయాణపు సన్నివేశాలూ సుళ్ళు తిరుగుతున్నాయి. రైలు ఫరీదాబాద్, తుగ్లకాబాద్ స్టేషన్ల వద్ద ఆగింది. కోపోద్రిక్త మూకలు రైలు పెట్టెల్లోకి జొరబడి శిక్కుల్ని బయటకు లాగి వాళ్ళని అందరిముందే (పోలీసులతో సహా) ఊచకోత కోయసాగారు.

ఆ సమయంలో నాన్నగారు రైలుదిగి ఆ మూకను అదుపు చేయమని పోలీసుల్ని కోరటమూ గుర్తుకు వస్తున్నది. అలా మూకుమ్మడి పాశవికతకు గురైన శిక్కుల మనోభావాల ఉద్వేగ తీవ్రతను తగ్గించేందుకు ఢిల్లీలోని త్రిలోక్‌పురి ప్రాంతాల్లో నాన్నవాళ్ళు పర్యటించినపుడు నేను వాళ్ళతోనే వున్నాను.

ఈ అనుభవాలన్నింటిద్వారా నిర్భయంగా ఉండటం నేర్చుకొన్నాను. నా తల్లిదండ్రుల జీవితాల్నుండి నేనెంతగానో నేర్చుకున్నాను–మరీ ముఖ్యంగా మా తండ్రి మరణాన్నుండి.

నవంబరు 12 ఉదయం నాన్నగారి మరణాన్ని వైద్యుడు ధృవపరచటం జరిగింది. ఆయన శరీరంలోని ప్రాణవాయువు త్వరితగతిన క్షీణిస్తున్న కారణంగా సాయంత్రానికి మరణం ఖాయం అన్నారు. నేను ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు, మిత్రులకు తెలియజేసాను. ఆ పగలంతా నేనాయన ప్రక్కనే అలాగే కూర్చొని ఉన్నా. ఆక్సిజను స్థితిని తెలిపే యంత్రం ఆయన తుది శ్వాసను తన 'బీప్' శబ్దాలతో గమనంలోకి తెస్తూనే ఉంది. మేము ఉచ్ఛ్వాస నిశ్వాసాలు మాని, గుడ్ల నీరు కుక్కుకుంటున్న తరుణంలో కూడ నాన్న తన ప్రశాంతతను కోల్పోలేదు. తమ తుది క్షణాలలో కూడ ఆయన టీ.వీ.లో వస్తూన్న క్రికెట్‌క్రీడను చూచి ఆనందించసాగారు. నేపథ్యంలో ఆయన మరాఠీ నాట్య సంగీతాన్ని కూడ విన్పించే ఏర్పాటు చేయమన్నారు. ఆయన జీవనయానంలో అదే చిట్టచివరి అడుగని ఆయనకు తెలుసు. అయినా చివరి క్షణం వరకూ ఆయన ప్రశాంతతను కోల్పోక పశ్చాత్తాపాన్ని దరిజేరనివ్వక మరణాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఖలీల్ జీబ్రాన్ (మహా దార్శనికుడు) మాటల్లో నాన్న మరణాన్ని పఠించటం ఓ అపురూప సన్నివేశం.

"మరణించటం అంటే ఏమిటి? –

ఎండలో నిలబడటం, గాలిలో కలగలసిపోవటం"

తుది ఘడియలకోసం నాన్న ఖచ్చితంగా సంసిద్ధంగానే వున్నారు. ఇతరుల్నీ సంసిద్ధ పరిచారు. లియొనార్డోడావెన్సీ మరణ వర్ణనపై ఆయనకు ఎనలేని విశ్వాసం.

"చక్కగా గడిచిన రోజు ఆనందపు నిద్రను అందించినట్లే

అర్థవంతమైన జీవితం ఆనందమయ మరణాన్ని అందిస్తుంది."

(తండ్రి మరణం తర్వాత యిది తనయుడి స్పందన)

## Text of the speech delivered on the centenary celebrations of Madhulimaye

**Justice B. Sudershan Reddy**
Former Judge of the Supreme Court

⁂

Let me at the very outset, rather unequivocally, state that it was only with a great deal of trepidation that I accepted this assignment of presiding over this function to celebrate the 100$^{th}$ year of birth of Shri. Madhu Limayeji – or “Bhai” as he was affectionately called, by young and old, and by those who loved him and those who respected him. So, that is what I will address him as throughout this speech.

It is impossible to canvas, state and critically examine, within the space of a fifteen minute speech, the complex life and thoughts of a man who was both a witness and participant in momentous events leading to our indepe-ndence from colonial exploitation, and then an actuator of other momentous events in political and constitutional history of our then fledgling nation-state. Of course, Mahatma Gandhi, Pandit Nehru,

Sardar Patel, Babasaheb, JP and Lohia were the dominant figures in the first phase, and the second phase was marked by deep insecurities, as the unrealistic expectations of miraculous development of the nation were dashed and the mood swung to the end of cynicism, and the descent into authori tarianism by Mrs. Indira Gandhi. Furthermore, another aspect of my trepidations was on account of how prolific a writer Bhai was – he was a political activist and scholar who has written more than 100 books and monographs relating to various aspects of the events he was witness to and a participant in, many as a prime mover. Many scores of those published works were also about dominant socio-political and economic issues that informed debate about the course of the nation in the first four decades after independence. The sheer scale of his published work militates against easy summaries, much less glib summaries.

So, the question was: how does one begin to encapsulate, in the matter of 15-20 minutes speech, the life and works of an immensely wondrous personality like Bhai and also yet undertake a critical assessment of his contributions. The standard temptation would be to engage in a hagiography. This is not to suggest that Bhai was not worthy of that. Of course he was and his memories continue to inspire us. And that is what makes the many hagiographies of him, by his disciples and admirers, so believable also. The second temptation would be to describe his life in a chronological order, starting with his earliest influences, and his early baptism in the fire of the deeply moral fight for independence waged by our countrymen, and a lifelong battle to construct a morally virtuous, deeply egalitarian polity. For a good rendition of the second temptation, I would strongly recommend an essay by his son Anirudh Limaye.

One major drawback in our political discourse has been that there has been very little serious academic and scholarly

attention, much less reaso ned and critical appreciation, of how events were shaped and the significant thoughts, ideas, and philosophical orientations of the times and of the main personalities who straddle them. If only we had encouraged more rigorous and extensive scholarly research of key figures in many of the momentous events of our nation's history, we probably would have been in a position to better assess the events of first three to four decades after Independence, and also been able to more scientifically evaluate our present predicaments and denouements in light of the sacred goals we set ourselves as a polity and as a nation.

Yet, one needs to pause and reflect upon Bhai's penchant itself – to be deeply reflective and analytical, with minute attention to detail as well as over all logic

of movement of larger forces and social aspirations. And wonder, whether one might attempt a more contextual analysis of the man, on the plane of conflict of visions and ideas about what comprises the nation state, its polity and also the moral imperatives and urgencies that ought to inform the goal that the nation set for itself.

Given the paucity of time, I will touch upon one or two aspects of what Bhai was very disturbed by, and try to place them in the context of larger philosophical lacunae that emerged in the post independence years. But, before I proceed with that, I want to categorically condemn a strange and ill- informed opinion that sometimes is broadcast about him. This is about the excessively critical view about "anti-congressism" of certain eminent socio-political activists such as JP, Lohia and of course Bhai – Madhu Limaye, himself. This view seems to hold the position that but for such leaders, the more militant majoritarian groups would not have become more assertive, and Congress would not have become weaker as a

large tent by pandering to the majoritarian views within. This, I will submit might be a simplistic reading.

The first question that one would have to ask – actually a counterfactual – is whether, even without JP, Lohia and Bhai, the militant majoritarianism would not have gained salience, and whether it wasn't the case that it was actually happening within Congress itself too? Very few reasonable and honest scholars would deny the fact that Congress, as a large umbrella, also had strong votaries for the majoritarian impulse along with a desire to keep the inegalitarian social institutions going and secure the ill begotten economic surpluses of the exploiting classes. And in power, even those with impeccable credentials - and a background of being raised on a diet of highest liberal ethos – began to pander to majoritarian planks in electoral politics and also succumb to their own inner majoritarian streaks.

What may be of greater salience, as to why both the majoritarian impulses and an authoritarian state garbed in the livery of patriotism emerged, would be the incapacities of the political process in delivering on the consti-tutional promises of social justice and the intransigent structural weaknesses preventing the emergence of more egalitarian outcomes. The only real anti- dote for sectari-anism, majoritarianism and the authoritarian state is egalitarianism, as it demands the capacity to view every human being as being endowed with an indefeasible dignity – and hence a shared oneness.

For Bhai, the project of egalitarianism was dual – it was a good, in and of itself, and also because he realized that was the only ultimate goal that would enable the survival of a constitutional democracy in a populace that was organized, to use Babasaheb's evocative phraseology, in layers of graded socio-economic inequality. The sheer number of layers, which naturally become coves of identity, and most of them being

lower down the rung would, structurally, always pose a problem for a constitutional democracy. It could happen that coalitions of such groups would resort to violence to overthrow the temple of democracy, if the contradictions between putative political equality and unconscionable inequality on the social and economic plane were allowed to persist. Or, while the shell of democracy persists – through the continuation of some form of competitive electoral politics – the transformative soul of the constitutional democracy would be killed, as the have-nots settle for meagre hand outs. Furthermore, as cynicism settles in and hopes of real transformation vanish, people could fall prey to demagoguery and othering of vulnerable groups – who are then painted as the villains.

This was something that Bhai realized and it animated his formulation that the Parliament is but one of the platforms for expression of the desires and voices of the people. Nevertheless, for him the expression through elected representatives could never be a substitute for peoples movements, and agitational politics. He realized early on, that an unholy alliance can emerge amongst the upper classes, the political class and permanent machinery of governance, and collective resources and energies of apparatus of the State be directed towards aggrandizement of a small number of elites, even as the masses – organized into competitive identity groups – are encouraged to keep the social order on a boil.

Bhai realized that the potential of parliamentarians being reflectors inside the Parliament, of discontent outside the Parliament, would be significantly attenuated if the anti-defection laws were enacted. He sensed the dangers of a "one leader" political party that captures power, very early on in the history of our republic. This is not to say he did not have a deep admiration for Pandit Nehru, even if he felt disappointed that he could have done a lot more to strengthen the impulses

for egalitarianism. Nevertheless, for him the combination of power to disburse largesse that vests in the executive, centralization of decision making, persistence of deeply entrenched inequalities and the overriding logic of electoral politics would nurture, grow and sustain the "mai baap" culture, thereby tying up the tongues of parliamentarians who were expected to keep the executive in check. The anti-defection laws, for Bhai, were precisely the tools that would make even the most recalcitrant of members on the treasury benches only becoming cheer leaders for the cult of the supreme leader.

For Bhai, political and social causes were deeply moral, and emotionally necessary for discovery of oneself. His baptism came early enough, during the Quit India movement when he went underground and began to organize resistance. His participation in the "satyagraha" for liberation of Goa from the tentacles of the brutal Portuguese military leader, Salazar, even though he was suffering from asthma and a high fever is of course well known. They, including Bhai, were subject to brutal beatings, physical torture and kept in prison in sub-human conditions. He defended the moral foundations of his civil disobedience, to the fullest, in his trial. Though sentenced to 12 years of imprisonment, he did not appeal for mercy and did not even countenance

asking Pandit Nehru's intervention. And in this regard he stated: *"I was right in following the Gandhian principles in the manner of civil disobedience. It was in Goa that I realised how profoundly Gandhi has transformed my life, and how deeply he has shaped my personality and will.*

India was of course fortunate that it had such great sons and daughters to guide its fledgling democracy. Yet, we must also confess to a deep sense of worry as to where it might head. I have repeatedly said that these worries are not peculiar to only India – but are global in scale. There has been a

subtle turn towards the authoritarian form of governance and the cult of the single leader. This happened, in India, at least once before. So, the question would be about what went wrong.

A clue emerges from Bhai's writings. In his book "Janata Party Experiment" hebemoans the fact that even as leaders such as JP tried to rouse the people to the dangers of the emerging authoritarian state, the masses remained strangely quiescent. So, Bhai asks:

*"Why did the country lay stunned and prostrate at the feet of Indira Gandhi who had now assumed dictatorial power? Did the JP movement and the Opposition have absolutely no mass support? It would be wrong to say so.... " [BUT} "it can be argued that the Opposition which had rallied around the JP Movement did not enjoy much support among the poorest of strata of our society..... cannot explain the terrible fear and paralysis that gripped the whole country in June 1975."*[1]

He then goes on to cite JP, who said:

*"The past year has shown that the people are still ignorant of and unconcerned about their rights and duties as citizens of an independent and democratic country. A rather glaring proof of this was their complete passivity when their fundamental rights.... Were suddenly taken way by Mrs. Gandhi. Had the people been conscious of their rights, inspite of the Emergency, there would have been country-wide protests and demonstrations."*[2]

He contrasts the above with what he calls the "Gandhi Age":

*"The Gandhi Age had made a deep impression on all fighters for freedom. The ideal of independence and the example of Gandhi had brought out the best in the Indian*

---

[1] Limaye, Madhu: "Janata Party Experiment, Vol I", page 7

[2] Ibid, page 7.

*people. Out of dust he created men of steel. He taught them the virtues of courage, uprightness and self-sacrifice. After independence the forms and standards of behavior had fallen low. Satyagraha, which for Gandhi was a spiritual exercise, had now become a ritual... a farce – it consisted of getting arrested in the afternoon and released in the evening.... With so much hypocrisy in public life, with such nauseating dominance of fair weather politics, how could popular resistance be built up? The people and the opposition had gone soft, the moral fibre had got weakened and so when the blow fell both the parties and the people were unprepared to face it...... The spirit of defiance was just not there. The country submitted to authoritarianism like an inert mass. Barring a few exceptions, there was no sign of sustained organized resistance anywhere."* [3]

So, what went wrong? How could a country that responded, for decades, to the person who became a "half naked faker" to be like the poorest of his countrymen, become so quiescent? And why did even die hard Gandhians with great moral hold in the minds of the people – fail to enthuse the resistance?

